

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 9-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 304 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి ఉ.7:06 తదుపరి సప్తమి, నక్షత్రం: ఉత్తర మ.1:41 తదుపరి హస్త, వర్జ్యం: రా.10:46-12:30, దుర్ముహూర్తం: ఉ.9:03-9:47, మ.12:44-1:28, అమృతఘడియలు: శేషం ఉ.7:47, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:51, సూర్యాస్తమయం: 5:53 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జిల్లా కోర్టులకు బాంబు బెదిరింపులు

బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు

విశాఖ, ఏలూరు, అనంతపురం, చిత్తూరుల్లో కలకలం

తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని కోర్టుల్లోనూ సోదాలు

అన్నీ ఉత్తుత్తి బెదిరింపులేనని నిర్ధారణ

11



ఇదేమి నైజం..

జగన్ మాటల్లో మర్మమేమిటి! విషయం ఏదైనా విషం చిమ్మడమే ఆయన నైజమా? 2019 ఎన్నికల ముందు 'అమరావతి'కి జై కొట్టి, అధికారంలోకి రాగానే మూడు ముక్కలాట మొదలుపెట్టి, 2024లో ఓడిపోగానే అమరావతి అనుకూల వాదనలు చేసి, తాజాగా 'అది రివర్ బేసిన్. అక్కడ రాజధాని కట్టకూడదు' అనే ఆయన అవగాహనను ఏమంటారు? 'ఎర్రబస్సు రాని చోటికి ఎయిర్ బస్సు ఎందుకు?' అని భోగాపురం విమానాశ్రయాన్ని గేలి చేసి... అక్కడ తొలివిమానం దిగగానే ఆ ఎయిర్‌పోర్టు తన ఘనతే అని ప్రకటించుకునే తీరును ఎలా అర్థం చేసుకోవాలి? రాయలసీమకు నిజంగా మేలు చేసే 'ముచ్చుమర్రి-బనకచర్ల' లిఫ్టును మూలకు నెట్టి, రాజకీయ కారణాలతో 'సీమ లిఫ్టు'ను మొదలుపెట్టి, అది తన హయాంలోనే అటకెక్కినప్పటికీ... 'చంద్రబాబు సీమ ద్రోహి' అంటున్న జగన్ తెగింపును ఏమనాలి? ఆయన రాజకీయాలకు ఏ పేరు పెట్టాలి?





ఇది తాడేపల్లిలో జగన్ నిర్మించుకున్న ప్యాలెస్. కృష్ణా నదికి రెండు కిలోమీటర్లలోపే ఉంటుంది. అమరావతి 'రివర్ బేసిన్'లో ఉందంటున్న జగన్... తన ప్యాలెస్‌తోపాటు తాడేపల్లి మొత్తాన్నీ ఖాళీ చేయించాలంటారా?

ద్రోహి ఎవరు?

రాయలసీమ ఎత్తిపోతలపై వైసీపీ రచ్చ

నిజాలు వదిలి నిస్సిగ్గుగా అబద్ధాలు

ఆది, అంతం జగన్ హయాంలోనే

2020లో మొదలు.. 2021 జూలై 7న ఎన్జీటీ స్టే

ఆపై మూడేళ్లు అధికారంలో ఉన్నా మొద్దునిద్రే

స్టే వెకేట్ చేయించడంలో జగన్ విఫలం

ముందే 'ముచ్చుమర్రి'కి చంద్రబాబు శ్రీకారం

అక్కడి నుంచి వరదజలాలు ఎత్తిపోసేలా పథకం

అది కొనసాగిస్తే క్రెడిట్ దక్కదన్న జగన్ దుగ్ధ

ప్రాజెక్టు పేరు, డిజైన్, హెడ్‌వర్క్ పాయింట్ మార్పు

తెలంగాణ ఫిర్యాదుతో అసలుకే మోసం

(కర్నూలు - ఆంధ్రజ్యోతి)

'నేను ముక్కలుగా నరికి... కూకటి వేళ్లతో సహా పెకలించిన చెట్టును నువ్వెందుకు మళ్లీ బతికించలేదు? నువ్వు ద్రోహివి!' 'రాయలసీమ ఎత్తిపోతల పథకం'పై వైసీపీ అధ్యక్షుడు జగన్ వైఖరి అచ్చం ఇలాగే ఉంది. ఆ పథకానికి ఆది, అంతం జగన్ హయాంలోనే జరిగిపోయాయి. అయినా సరే... చంద్రబాబుపై నెపం వేయడం వైసీపీకే చెల్లింది.

● అదే జరిగి ఉంటే...

కృష్ణా వరద జలాలను రోజుకు మూడు టీఎంసీలు ఎత్తిపోసి రాయలసీమను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో చంద్రబాబు 2018లో ముచ్చుమర్రి-బనకచర్ల లిఫ్ట్‌కు డిజైన్ చేశారు. 2019లో ప్రభుత్వం మారింది. 'ముచ్చుమర్రి'ని యథావిధిగా చేపడితే చంద్రబాబుకు మంచిపేరు వస్తుందనే దుగ్ధతో... దానిపేరు, తీరూ మార్చేశారు. హెడ్ వర్క్‌ను ముచ్చుమర్రి నుంచి సంగమేశ్వరానికి మార్చారు. అలాకాకుండా... 'ముచ్చుమర్రి'నే కొనసాగించి ఉంటే ఎలాంటి సమస్యలూ వచ్చేవి కావు. ఎందుకంటే... అది 'ఆన్‌గోయింగ్' ప్రాజెక్టు. తెలంగాణ ప్రభుత్వం ఎన్జీటీని ఆశ్రయించినా 'స్టే' వచ్చేది కాదు. ఇప్పుడు చెప్పండి.. 'సీమ' ద్రోహి ఎవరు?

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన కోణంలో చేసిన వ్యూహాత్మక ప్రకటన ఆధారంగా జగన్ రోత మీడియా రచ్చ చేస్తోంది. కాస్త వెనక్కి వెళ్లి వాస్తవాలను పరిశీలిస్తే.. 'సీమ'కు అసలు ద్రోహం చేసింది జగనే అని స్పష్టమవుతుంది. ఎలాగంటే... రాయలసీమ జీవనాడి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం. శ్రీశైలం

మిగతా 12వ పేజీలో...

ఎప్పుడేం జరిగింది?

2020 మే 5: నాటి జగన్ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్‌కు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. 'ఇది కొత్త ప్రాజెక్టు. నేనే మొదలుపెట్టా' అంటూ ఆర్భాటం చేశారు. పర్యావరణ అనుమతులూ రాలేదు.

2021 ఫిబ్రవరి 27: రాయలసీమ లిఫ్టు పనులు ప్రారంభించారు. 24 శాతం పనులు చేసి దాదాపు రూ.923 కోట్లు ఖర్చు చేశారు. ఇవన్నీ... దాదాపుగా మట్టి పనులే. అంటే, కాంట్రాక్టరుకు సులువుగా డబ్బులు తెచ్చిపెట్టే పనులు. అంతేతప్ప కాంక్రీటు పనులు సాగలేదు. లిఫ్టుకు మోటార్లు పెట్టలేదు.

2021 జూలై 7: రాయలసీమ లిఫ్ట్‌పై తెలంగాణకు చెందిన ఒక వ్యక్తి వేసిన పిటిషన్‌పై స్పందించిన ఎన్జీటీ... ఈ పనులు ఆపి వేస్తూ 'స్టే' ఇచ్చింది.

2021 ఆగస్టు 7: సీమ ఎత్తిపోతలపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఎన్జీటీ స్పందించింది. ప్రాజెక్టు పనులు పూర్తిగా ఆపేయాలని జగన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

2024 మార్చి 22: పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.2.65 కోట్లు అపరాధ రుసుం చెల్లించాలని ఎన్జీటీ ఆదేశించింది.

వెరసి... రాయలసీమ ఎత్తిపోతల పథకం తెరమరుగైంది జగన్ హయాంలోనే! ఎన్జీటీ స్టే తర్వాతా మూడేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ దీనిపై మిన్నకుండిపోయారు.

మళ్లీ అదే విషం!

అమరావతిపై జగన్ కొత్త కుట్రలు

లేని రివర్ బేసిన్‌ను 'సృష్టించిన' వైసీపీ నేత

నదికి 6 కిలోమీటర్ల దూరంలో కోర్ క్యాపిటల్

ప్రభుత్వ ప్రధాన భవనాలన్నీ అక్కడే

కరకట్టకు వంద మీటర్ల వరకే 'రివర్ బేసిన్'

అయినా.. కొత్త వాదన మొదలుపెట్టిన జగన్

(గుంటూరు/అమరావతి- ఆంధ్రజ్యోతి)

రాజధాని కోసం రెండోదశ భూసమీకరణ ప్రక్రియ ప్రారంభమైన వేళ... 'అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులోనే బిల్లు ఆమోదించేలా ప్రయత్నాలు సాగిస్తున్న సమయంలో... వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోసారి అమరావతిపై విషం చిమ్మారు. 'రాజ్యాంగంలో అసలు రాజధాని అనే పదమే లేదు' అని పాతపాట పాడుతూనే... 'నదీ పరీవాహక ప్రాంతం' (రివర్ బేసిన్)లో నిర్మాణాలు చేస్తున్నారని, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కొత్త పల్లవి అందుకున్నారు. అమరావతిని జాతీయ స్థాయిలో వివాదాస్పదం చేసేందుకు లేని 'రివర్ బేసిన్'ను సృష్టించారు. ప్రస్తుతం రాజధానిలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ భవనాలను నేలపాడు గ్రామ పరిధిలో నిర్మిస్తున్నారు. ఇది కోర్ క్యాపిటల్ ఏరియా! ఈ ప్రాంతం

మిగతా 12వ పేజీలో...

రివర్ బేసిన్‌లో రాజధాని కడతారా?

అది సుప్రీం మార్గదర్శకాలకు విరుద్ధం

దీనిపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలి

రాజ్యాంగంలో రాజధాని అనే పదమే లేదు

సీఎం ఎక్కడుంటే అదే రాజధాని: జగన్

12

రివర్ బేసిన్ అంటే ఏంటో జగన్‌కు ఏం తెలుసు?

ఆయన మిడి మిడి జ్ఞానంతో మాట్లాడుతున్నాడు

రైతుల్ని భయపెట్టేలా తప్పుడు వ్యాఖ్యలు.. సహించం

అమరావతికి చట్ట బద్ధత కల్పిస్తాం: మంత్రి నారాయణ

ఏసీబీ కేసుల కొట్టివేత చెల్లదు!

13

ఏపీ హైకోర్టు తీర్పు న్యాయానికి విఘాతం

సాంకేతిక కారణాలతో ఎఫ్ఐఆర్‌ల రద్దు న్యాయాన్ని అపహాస్యం చేయడమే: సుప్రీం

ఆ అధికారులపై దర్యాప్తు కొనసాగింపు

బెంగాల్‌లో హైడ్రామా!

2

ఐ-ప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ ఇల్లు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు

ఆయన ఇంటికెళ్లిన సీఎం మమతా బెనర్జీ

ఈడీ దాడులు రాజ్యాంగ విరుద్ధం

కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తిన మమత

జైన్ ఇంటి నుంచి పత్రాలు, హార్డ్ డిస్కులు తీసుకెళ్లిపోయిన మమత అనుచరులు

మనీలాండరింగ్ కేసులో భాగంగానే తనిఖీలు

మమత కీలక ఆధారాలను ఎత్తుకెళ్లారు: ఈడీ

నేడు బెంగాల్ వ్యాప్తంగా టీఎంసీ నిరసనలు

యూనిట్ రూ.4కే!

మూడేళ్లలో కరెంటు చార్జీ ఆ మేరకు తగ్గిస్తాం: సీఎం

కూటమి వచ్చే నాటికి ధర రూ.5.19

ప్రస్తుతం దానిని 4.90కి తీసుకొచ్చాం

మార్చికి మరో 10 పైసలు తగ్గిస్తాం

సీమ లిఫ్టుపై తప్పు చేసింది వాళ్లే

జగన్ హయాంలోనే ఆగింది

నాడు కళ్లుమూసుకుని నేడు నిందలా?

ఇలాంటివాటిలో వాళ్లు సిద్ధహస్తులు

తిరుమలలో మద్యం బాటిళ్ల వ్యవహారం వైసీపీ నైజానికి నిదర్శనం

అప్రమత్తంగా లేకపోతే నష్టపోతాం

పీపీపీ అమల్లో దేశంలో మనమే టాప్

మంత్రివర్గ సహచరులతో చంద్రబాబు



క్యాబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు, అధికారులు

వైసీపీ వారికి బురదజల్లడం అలవాటుగా మారింది. రాయలసీమ లిఫ్టు విషయం గానీ.. తిరుమలలో మద్యం బాటిళ్ల ఉదంతం గానీ వారి నైజాన్ని బయటపెడుతున్నాయి. ఇలాంటి వాటిని ఎక్కడికక్కడ పార్లమెంటు నియోజకవర్గాలవారీగా తిప్పికొట్టాలి. నేతలు ఏకతాటిపైకి వచ్చి వైసీపీ అసత్య ప్రచారాలకు దీటుగా బదులివ్వాలి. - సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో కమీషన్ల కోసం అస్తవ్యస్త విధానాలను అమలు చేసి విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపారు. కూటమి అధికారంలోకి వచ్చే నాటికి యూనిట్ విద్యుత్ రూ.5.19 గా ఉంది. దానిని ప్రస్తుతం రూ.4.90కి తెచ్చాం. మార్చి నాటికి మరో 10 పైసలు తగ్గించి రూ.4.80కి తెస్తాం. 2029 నాటికి మొత్తం మీద యూనిట్‌కు రూ.1.19 తగ్గించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. అంటే మూడేళ్లలో యూనిట్ రూ.4కి తీసుకొస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గురువారం

మిగతా 14వ పేజీలో...

టీటీడీ దూకుడుకు బ్రేక్

జంగాకు కొండపై భూమి ఇవ్వబోం


క్యాబినెట్‌లో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

టీటీడీలో అందరికీ ఒకే రూల్ ఉండాలి

ఇష్టానుసారం తీర్మానాలొద్దన్న పవన్

13





భారత్‌పై 500% సుంకాలు?

- రష్యా చమురు కొంటున్న దేశాలపై భారీగా టారిఫ్‌లు విధించే బిల్లుకు ట్రంప్ మద్దతు
- భారత్‌తోపాటు చైనా, బ్రెజిల్‌పై ప్రభావం
- సెనేట్‌లో రిపబ్లికన్ లిండ్సే గ్రాహమ్ బిల్లు
- వచ్చే వారమే ఓటింగ్ జరిగే చాన్స్: లిండ్సే

అమెరికా రక్షణ బడ్జెట్.. రూ.135 లక్షల కోట్లు!

- 2027 ఏడాది కోసం ఏకంగా 50 శాతం పెంచుతూ ట్రంప్ ప్రతిపాదన

2


మీ నౌకల్ని ముంచేస్తాం!

మళ్లీ ఇలాంటి చర్యలకు తెగబడితే సైనిక చర్యతో ప్రతీకారం తీర్చుకుంటాం

చమురు నౌకను సీజ్ చేయడంపై అమెరికాకు రష్యా ఘాటైన హెచ్చరిక

కువైత్‌లో డ్రగ్స్ అక్రమ రవాణా


ఇద్దరు భారతీయులకు మరణశిక్ష



- వారి నుంచి 14 కిలోల హెరాయిన్, 8 కిలోల మెథాంఫెటమైన్ స్వాధీనం
- అమెరికాలో 140 కిలోల కొకైన్ రవాణా చేస్తూ దొరికిన ఇద్దరు భారతీయులు
- దాని విలువ దాదాపు 62 కోట్లని అంచనా

న్యూయార్క్, కువైత్, జనవరి 8: పెద్ద ఎత్తున మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు పాల్పడుతున్న ఇద్దరు భారతీయులకు కువైత్ కోర్టు మరణ శిక్ష విధించింది. పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో వారి వద్ద పద్నాలుగు కిలోల హెరాయిన్, ఎనిమిది కిలోల మెథాంఫెటమైన్ లభ్యమైంది. ఆ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. వారిద్దరూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లో భాగమని నిరూపించడంతో న్యాయమూర్తి వారికి మరణశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మరోవైపు, అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో.. పెద్ద ఎత్తున కొకైన్‌ను రవాణా చేస్తున్న ఇద్దరు భారతీయ ట్రక్ డ్రైవర్లు పోలీసుల హైవే తనిఖీలో అడ్డంగా దొరికిపోయారు. వారి పేర్లు.. గురుప్రీత్ సింగ్ (25), జస్వీర్ సింగ్ (30). వారి వాహనాన్ని ఆపినప్పుడు.. మాదకద్రవ్యాలను పసిగట్టే శునకాలు అందులోని స్లీపర్‌బెర్త్ (డ్రైవర్లు విశ్రాంతి తీసుకునే చోటు)లో డ్రగ్స్ ఉన్నట్టు పసిగట్టాయని, సోదా చేయగా దాదాపు 140 కిలోల కొకైన్ దొరికిందని.. అది దాదాపు లక్షా పదమూడు వేల మంది ప్రాణాలు తీయగలిగేంత ప్రమాదకర పరిమాణమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. వారిద్దరినీ అరెస్టు చేసి జైలుకు తరలించారు. వారిపై మాదకద్రవ్యాల రవాణా కేసు పెట్టామని ఇండియానా పోలీసులు తెలిపారు. వారివద్ద స్వాధీనం చేసుకున్న కొకైన్ విలువ దాదాపుగా రూ.62 కోట్ల దాకా ఉంటుందని అంచనా. వీరిలో గురుప్రీత్ సింగ్ 2017లో, జస్వీర్ సింగ్ 2023లో అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించినట్టు గుర్తించామని.. ఈ నేపథ్యంలో వారిపై డీపోర్టేషన్ హోల్డ్‌లు కూడా పెట్టామని వెల్లడించారు. డీపోర్టేషన్ హోల్డ్ అంటే.. వీరు ఈ కేసులో జైలు నుంచి విడుదలయ్యాక ఇమ్మిగ్రేషన్ అధికారులకు అప్పజెప్తారు. వారు ఈ ఇద్దరినీ భారతదేశానికి డీపోర్ట్ చేస్తారు. కాగా.. ట్రక్కులో ఉన్న మాదక ద్రవ్యాల గురించి తమకు తెలియదని, ఆ ట్రక్కును రిచ్‌మాండ్‌లోని ఒక భారతీయ రెస్టారెంట్‌కు తీసుకెళ్లాల్సిందిగా ట్రకింగ్ కంపెనీ చెప్తే తీసుకెళ్తున్నామని.. తాము అమాయకులమని వారిద్దరూ వాదిస్తున్నారు.

లోకం తీరు



అమెరికా రక్షణ బడ్జెట్ రూ.135 లక్షల కోట్లు!

- 2027 ఏడాది కోసం ఏకంగా 50 శాతం పెంచుతూ ట్రంప్ ప్రతిపాదన

వాషింగ్టన్, జనవరి 8: తరచూ తన వ్యాఖ్యలతో, ఇటీవల వరుసగా దాడులతో ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. తన 'కలల మిలటరీ'కి పదును పెడుతున్నారు. 2027కు సంబంధించి అమెరికా రక్షణ బడ్జెట్‌ను ఏకంగా 50శాతం పెంచేస్తూ.. రూ.135 లక్షల కోట్ల (1.5 ట్రిలియన్ డాలర్లు) మేర ప్రతిపాదించారు. ప్రస్తుత సంవత్సరం అమెరికా రక్షణ బడ్జెట్ సుమారు రూ.90 లక్షల కోట్లు మాత్రమే కావడం గమనార్హం. శత్రువు ఎవరనే ప్రసక్తే అవసరం లేకుండా అమెరికాను అత్యంత భద్రంగా ఉంచే కలల మిలిటరీ (డ్రీమ్ మిలిటరీ)ని నిర్మించేందుకు బడ్జెట్‌ను పెంచడం తప్పనిసరి అని ట్రంప్ పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ ఊహించని విధంగా టారిఫ్‌ల మార్గంలో అమెరికాకు గణనీయస్థాయిలో ఆదాయం పెరుగుతుందని, రక్షణ బడ్జెట్ పెంపునకు ఊతమిస్తుందని స్పష్టం చేశారు. ఇక మరిన్ని ప్లాంట్లు ఏర్పాటు చేసి, ఉత్పత్తులను పెంచడంపై దృష్టిపెట్టాలని అమెరికా ప్రైవేటు రక్షణ రంగ సంస్థలను ట్రంప్ ఆదేశించారు. లాభాలను పెట్టుబడుల కోసం, సంస్థ విస్తరణ కోసం వినియోగించకుండా షేర్ల బైబ్యాక్ వంటివి చేపడితే.. ఆయా సంస్థలకు రక్షణ కాంట్రాక్టులు ఇవ్వబోమని హెచ్చరించారు. అయితే ట్రంప్ వ్యవహారంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టిన వెంటనే మిత్రులు, శత్రువులు అని లేకుండా అన్ని దేశాలతోనూ పేచీలకు దిగారు. ఇలాంటి సమయంలో అమెరికా రక్షణ బడ్జెట్ పెంచితే.. యుద్ధాలకు మరింత ఊతమిచ్చినట్టేనన్న అభిప్రాయం వస్తోంది.

అటవీ భూముల్లో 'ప్రైవేట్' వనాలు

- అడవుల పెంపకానికి కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 8: అటవీ భూముల్లో ప్రైవేట్ సంస్థలు కూడా వనాలను పెంచడంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు అటవీ భూములను లీజుకు తీసుకుని పర్యావరణ పరిహార ఫీజులు చెల్లించే అవసరం లేకుండా అడవులు పెంచడానికి, కలప ప్రాజెక్టులు నిర్వహించడానికి నిబంధనలను సవరించింది. రాష్ట్ర ప్రణాళికల ప్రకారం అనుమతి పొందిన ప్రాంతాల్లో అడవుల పెంపకం, వనాల సంరక్షణ (సిల్వికల్చర్) కార్యక్రమాలను 'అటవీ కార్యకలాపాలు'గానే పరిగణిస్తామని ఈనెల 2న రాష్ట్ర ప్రభుత్వాలకు రాసిన లేఖలో కేంద్రం స్పష్టం చేసింది. సంబంధిత ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలతో ఆదాయ భాగస్వామ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు విధివిధానాలు రూపొందించుకునే అవకాశాన్ని కేంద్రం ఇచ్చింది. గతంలో నిబంధనల ప్రకారం అటవీ భూముల్లో ప్రైవేట్ సంస్థలు ఔషధ మొక్కలు, తక్కువ సమయంలో పెరిగే చెట్లు పెంచడాన్ని 'అటవీయేతర కార్యకలాపాలు'గానే పరిగణించేవారు. అయితే అటవీ భూములను ప్రైవేట్ పరం చేయడానికే ఈ కొత్త నిబంధనలు అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా విమర్శించారు. ఆగస్టు 2023 సవరణల ద్వారా అటవీ (సంరక్షణ) చట్టం-1980ను మోదీ ప్రభుత్వం నాశనం చేసిందంటూ మండిపడ్డారు. విమర్శలపై కేంద్ర పర్యావరణ శాఖ అధికారులు వివరణ ఇస్తూ.. 33 శాతం ఫారెస్టు కవరేజీ లక్ష్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

ఐసీఈ ఏజెంట్ కాల్పులు.. మహిళ మృతి

- అమెరికాలోని మినియాపోలిస్‌లో తీవ్ర ఉద్రిక్తత

మినియాపోలిస్, జనవరి 8: అమెరికాలోని అక్రమ వలసదారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకునే ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) విభాగానికి చెందిన ఏజెంట్ జరిపిన కాల్పుల్లో ఓ మహిళ మరణించింది. మినియాపోలిస్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో రెనీ నికోల్ మాకిన్ గుడ్(37) అనే స్థానిక మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. కాల్పులకు కారణంపై స్పష్టత లేదు. అయితే, మహిళ మృతితో మినియాపోలిస్‌లో తీవ్ర ఉద్రిక్తత చెలరేగింది. పెద్దసంఖ్యలో ప్రజలు ఐసీఈకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఐసీఈ కార్యకలాపాలపై దేశవ్యాప్తంగా చర్చ కూడా మొదలైంది. స్థానిక అధికారుల కథనం ప్రకారం.. దక్షిణ మినియాపోలిస్‌లో బుధవారం ఉదయం విధుల్లో ఉన్న ఐసీఈ ఏజెంట్లు.. రహదారిపై అనుమానాస్పదంగా ఉన్న ఓ కారును ఆపారు. ఐసీఈ ఏజెంట్లు మాట్లాడుతుండగానే ఆ వాహనాన్ని నడుపుతున్న మహిళ కారును హఠాత్తుగా ముందుకు తీసుకెళ్లింది. ఈ క్రమంలో ఓ ఏజెంట్ ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపగా కారులోని మహిళ తీవ్రంగా గాయపడింది. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై ఫెడరల్ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు మీదున్న ప్రతి కుక్కనూ తొలగించాలనలేదు

- నిబంధనలు అమలు చేయాలనే ఆదేశించాం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జనవరి 8: రోడ్ల మీద తిరుగుతున్న ప్రతి వీధి కుక్కనూ తొలగించాలని తామేమీ చెప్పలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) నిబంధనలను అమలు చేయాలని మాత్రమే ఆదేశించామని తెలిపింది. వీధి కుక్కల బెడద నివారణపై గతంలో ఇచ్చిన ఆదేశాలు కఠినంగా ఉన్నాయని, వాటిలో మార్పులు చేయాలని కోరుతూ పలువురు జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం విచారణ జరిపింది. శుక్రవారం కూడా వాదనలు కొనసాగనున్నాయి.

'ఆధార్ మస్కట్' ఆవిష్కరణ

న్యూఢిల్లీ, జనవరి 8: ఆధార్ సేవలపై ప్రజలకు మరింత సులభంగా అవగాహన కల్పించే ఉద్దేశంతో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) గురువారం ఉదయ్ పేరుతో ఒక మస్కట్‌ను విడుదల చేసింది. మైగావ్ ప్లాట్‌ఫామ్‌పై మస్కట్ రూపకల్పన, పేరుకు సంబంధించి దేశవ్యాప్త పోటీ నిర్వహించగా వచ్చిన వివిధ ఎంట్రీల నుంచి ఈ మస్కట్‌ను ఎంపిక చేశారు. కేరళలోని తిరువనంతపురంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మస్కట్‌ను యూఐడీఏఐ చైర్మన్ నీలకంఠ మిశ్రా, సీఈవో భువనేష్ కుమార్ ఆవిష్కరించారు. అలాగే విజేతలను సత్కరించారు. ఆధార్‌కు సంబంధించిన సమాచారాన్ని సులభంగా ప్రజలకు అర్థమయ్యేలా చేయడానికి యూఐడీఏఐ చేస్తున్న ప్రయత్నాల్లో మస్కట్ మరో ముందడుగు అని మిశ్రా తెలిపారు.

భారత్‌కు వీసా సేవలు రద్దు చేసిన బంగ్లాదేశ్

ఢాకా, జనవరి 8: భద్రతా కారణాల దృష్ట్యా భారత్‌కు వీసా సేవలను రద్దు చేస్తున్నట్టు గురువారం బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారు ఎం. తౌహిద్ హుస్సేన్ ప్రకటించారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఢిల్లీలోని రాయబార కార్యాలయం, కోల్‌కతాలోని డిప్యూటీ హైకమిషనర్ కార్యాలయాలను ఆదేశించారు. ముంబయి, చెన్నైల్లోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాలు యథావిధిగా పనిచేయనున్నాయి. అంతకుముందు భారత్ తీసుకున్న చర్యకు ప్రతిచర్యగా బంగ్లాదేశ్ ఈ నిర్ణయం తీసుకొంది. బంగ్లాదేశ్ వెళ్లేందుకు బిజినెస్, వర్క్ వీసాలు ఇవ్వకూడదని న్యూఢిల్లీ, అగర్తలాల్లోని కార్యాలయాలకు భారత్ విదేశీ వ్యవహారాల శాఖ ఆదేశాలు పంపింది.

భారత్‌పై 500% సుంకాలు?

రష్యా చమురు కొంటున్న దేశాలపై భారీగా టారిఫ్‌లు విధించే బిల్లుకు ట్రంప్ మద్దతు

- భారత్‌తోపాటు చైనా, బ్రెజిల్‌లపై ప్రభావం

వాషింగ్టన్, జనవరి 8: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ తదితర దేశాలపై ఏకపక్షంగా 500శాతం సుంకాలు విధించేందుకు వీలు కల్పించే బిల్లుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు తెలిపారు. రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసి, ఉక్రెయిన్‌తో యుద్ధ విరమణ దిశగా ఒత్తిడి చేయడం లక్ష్యంగా.. రిపబ్లికన్ పార్టీ సెనేటర్ లిండ్సే గ్రాహమ్, ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంథాల్ కలిసి ఈ బిల్లును రూపొందించారు. దీనిపై బుధవారం ట్రంప్‌తో భేటీ అయిన లిండ్సే గ్రాహమ్ అనంతరం వివరాలను వెల్లడించారు. 'గ్రాహమ్-బ్లూమెంథాల్ ఆంక్షల బిల్లు' గురించి ట్రంప్‌కు వివరించానని.. దీనికి ఆయన మద్దతు పలికారని చెప్పారు. ఉక్రెయిన్ శాంతి చర్చల కోసం ముందుకొస్తున్నా కూడా.. పుతిన్ మాత్రం దాడులు చేస్తూ, మారణహోమం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. వచ్చే వారమే ఈ బిల్లుపై అమెరికా చట్టసభ 'సెనేట్'లో ఓటింగ్ జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రష్యాపై ఒత్తిడి పెంచేందుకే..

చమురు కొనుగోలు చేస్తున్న దేశాల నుంచి సమకూరుతున్న నిధులతోనే ఉక్రెయిన్‌లో రష్యా నరమేధానికి పాల్పడుతోందని అమెరికా మొదట్నుంచీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా చమురును కొనడం ఆపేయాలని చైనా, భారత్, బ్రెజిల్ తదితర దేశాలపై తీవ్రంగా ఒత్తిడి తెచ్చింది. భారత్‌పై అయితే 50శాతం సుంకాలు కూడా విధించింది. అయినా రష్యా చమురు కొనుగోళ్లను ఈ దేశాలు తగ్గించలేదు. మరోవైపు ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతి ఒప్పందంపై చర్చలు ముమ్మరంగా సాగుతున్నాయి. కానీ ఒక కొలిక్కి రావడం లేదు. దీనితో రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే 500శాతం టారిఫ్‌లు విధించేందుకు వీలు కల్పించేలా 'గ్రాహమ్-బ్లుమెంథాల్ ఆంక్షల బిల్లు'ను అమెరికా చట్టసభ సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఇది ఆమోదం పొందితే.. 500శాతం వరకు సుంకాలు విధించేందుకు అమెరికా అధ్యక్షుడికి అధికారాలు దఖలు పడతాయి.



టార్పిడోలతో దాడిచేసి మీ నౌకల్ని ముంచేస్తాం జాగ్రత్త!

- చమురు నౌకను సీజ్ చేయడంపై అమెరికాకు రష్యా ఘాటైన హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 8: ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలోని రష్యా జెండాతో వెళుతున్న వెనెజువెలా చమురు నౌక మారినెరా (పాతపేరు-బెల్లా వన్)ను అమెరికా దళాలు సీజ్ చేయడంపై రష్యా తీవ్రవ్యాఖ్యలు చేసింది. అమెరికా తన చర్య ద్వారా అంతర్జాతీయ చట్టాలను, రష్యా సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించిందని కన్నెర్ర చేసింది. ముందుముందు అమెరికా ఇలా చట్టవిరుద్ధ చర్యలకు తెగబడితే సైనిక చర్య రూపంలో ప్రతీకారం తీర్చుకుంటామని ఆ దేశ చట్టసభ్యుడు అలెక్సీ గురవేల్వ్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. తాము ఏంచేసినా చెల్లుతుంది అన్న అహంకారంతో అమెరికా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టార్పిడోలతో తాము అమెరికా నౌకలను సముద్రంలో ముంచేందుకూ వెనుకాడం అంటూ హెచ్చరించారు. బుధవారం అమెరికా దళాలు మారినెరా నౌకతో పాటు ఏ దేశ జెండా లేకుండా వెళుతున్న మరో చమురు నౌకనూ సీజ్ చేశాయి. మారినెరా నౌకాలోని 28 మంది సిబ్బందిలో ముగ్గురు భారతీయులున్నట్లు రష్యా పేర్కొంది. మరోవైపు తన చర్యను అమెరికా సమర్థించుకుంది. అంతర్జాతీయ చట్టాలను అనుసరించే నౌకను సీజ్ చేశామని స్పష్టం చేసింది. ఆంక్షల చట్రంలో ఉన్న వెనెజువెలా, ఇరాన్‌కు చమురు సరఫరా చేస్తున్న నౌకల్లో మారినెరా ఒకటి అని అమెరికా పేర్కొంది. దీన్ని రష్యా ఖండించింది. చమురు రవాణా చేసే మారినెరా చట్టబద్ధంగా రిజిస్టర్ అయిందని.. రష్యా, అంతర్జాతీయ నిబంధనలను అనుసరించే ఈ నౌక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్పష్టం చేసింది. మారినెరా సీజ్ కోసం అమెరికా దళాలకు బ్రిటన్ సహకరించడం మరింత ఉద్రిక్తతకు దారితీస్తోంది. ఈ క్రమంలో బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ ట్రంప్‌తో మాట్లాడారు. గ్రీన్‌లాండ్‌పై బ్రిటన్ వైఖరిని ట్రంప్‌కు కెయిర్ స్టార్మర్ స్పష్టం చేసినట్లు బ్రిటన్ పీఎంవో పేర్కొంది.

66 అంతర్జాతీయ సంస్థలకు అమెరికా దూరం

- తమ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయంటూ తప్పుకొన్న అగ్రరాజ్యం

వాషింగ్టన్, జనవరి 8: అంతర్జాతీయ స్థాయిలో 66 సంస్థలు, ఒప్పందాల నుంచి తప్పుకొంటున్నట్టు అమెరికా ప్రకటించింది. అవి తమ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండటంతోపాటు అమెరికా ప్రజలు చెల్లించిన పన్నుల సొమ్ము వృథా కాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. వాటికోసం ఇన్నాళ్లూ అమెరికా ఖర్చు చేస్తున్న నిధులను, అవే రంగాలకు సంబంధించి ఇతర సమర్థమైన మార్గాల్లో వెచ్చిస్తామని పేర్కొంది. ఈ మేరకు 66 సంస్థలు, ఒప్పందాల నుంచి అమెరికా వైదొలిగే ఆదేశాలపై అధ్యక్షుడు ట్రంప్ బుధవారం సంతకం చేశారని అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌజ్ ప్రకటించింది. "అమెరికా నుంచి నిధులు పొందుతూ.. అమెరికా ప్రయోజనాలకు, విధానాలకు విరుద్ధంగా ఉన్న, సరిగా పనిచేయని, ప్రభావం చూపని సంస్థలు, ఒప్పందాల నుంచి తప్పుకోవాలని అధ్యక్షుడు నిర్ణయించారు. దేశ ప్రజలు చెల్లించిన పన్నుల సొమ్ము వృథా కాకూడదని భావిస్తున్నారు. ఇవే రంగాలకు సంబంధించి 'అమెరికా ఫస్ట్' విధానానికి మద్దతిచ్చే ఇతర సమర్థమైన మార్గాల్లో ఈ నిధులను వెచ్చించాలని నిర్ణయించారు" అని తెలిపింది. అమెరికా తప్పుకొన్న 66 సంస్థల్లో 31 ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోనివికాగా, మిగతా 35 ఇతర సంస్థలు. ఇందులో భారత్-ఫ్రాన్స్ ఆధ్వర్యంలోని అంతర్జాతీయ సోలార్ అలయన్స్ కూడా ఉంది. గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలను తగ్గించి, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వీలుగా సౌర విద్యుత్ ఉత్పత్తిని భారీగా పెంచడం.. ఇందుకోసం సభ్య దేశాలకు సాయం అందించడం ఈ సంస్థ లక్ష్యం. హరియాణాలోని గురుగ్రామ్‌లో ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ఉంది. 120 దేశాలు దీనిలో సభ్యులుగా ఉండటం గమనార్హం.

రోడ్డు ప్రమాదాల నివారణకు వీ2వీ సాంకేతిక పరిజ్ఞానం

- కార్లలో వైర్‌లెస్ వ్యవస్థ: నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, జనవరి 8: రోడ్డు ప్రమాదాల నివారణకు వెహికిల్ టు వెహికిల్ (వీ2వీ) సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయనున్నట్టు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. డ్రైవర్‌కు రియల్‌టైంలో సమీపంలోని ఇతర వాహనాలు, స్పీడు, ప్రమాదకర ప్రాంతాలు తదితర వివరాలు పంపించి, తగిన హెచ్చరికలు చేయడానికి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తామని తెలిపారు. టెలికమ్యూనికేషన్ల శాఖ సహాయంతో దీన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. గురువారం ఇక్కడ జరిగిన రాష్ట్రాల రవాణా మంత్రుల వార్షిక సదస్సు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాచారం పంపించడం కోసం కార్లలో వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థ ఉంటుందని చెప్పారు. రోడ్డు నిర్మాణంలో తగిన మార్పులు చేయడం ద్వారా ప్రమాదాలు తగ్గిస్తామని తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలను పాటించడం కోసం మోటారు వాహనాల చట్టంలో 61 సవరణలు తీసుకొస్తామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారికి నగదు రహిత విధానంలో వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేస్తామని గడ్కరీ తెలిపారు. ఈ విధానాన్ని త్వరలో ప్రధాని మోదీ ప్రారంభిస్తారని వెల్లడించారు. ఇప్పటికే ఈ విధానం ఆరు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా అమలవుతున్నట్టు తెలిపారు. క్షతగాత్రులకు సకాలంలో వైద్య సేవలు అందక మరణాలు సంభవిస్తున్నందున దాన్ని నివారించడానికే నగ దు రహిత వైద్య సేవలు అందించనున్నట్టు చెప్పారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి రూ.1.5 లక్షల మేర, గరిష్ఠంగా వారంరోజుల పాటు చికిత్సలు అందించడమే ఈ పథకం లక్ష్యమన్నారు.

రాజస్థాన్ మధ్యాహ్న భోజన పథకంలో రూ.2వేల కోట్ల కుంభకోణం

- 21 మంది నిందితులపై ఏసీబీ కేసు

జైపూర్, జనవరి 8: రాజస్థాన్ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో భారీ అవినీతి జరిగినట్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వెల్లడించింది. పాఠశాలలకు ఆహార ధాన్యాల సరఫరాలో రూ.2వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారంటూ 21 మంది నిందితులపై కేసు నమోదు చేసింది. రాజస్థాన్ స్టేట్ కో-ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (కాన్ఫెడ్) అనే సంస్థ కొవిడ్ సమయంలో పాఠశాలలకు ఆహార ధాన్యాలను సరఫరా చేసింది. ఈ పథకం అమలులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో కేసు నమోదు చేసిన ఏసీబీ.. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన అధికారులు, కాన్ఫెడ్ అధికారులు కుమ్మక్కై నిబంధనలను ఉల్లంఘించినట్లు తన ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. వారు అర్హత కలిగిన సంస్థలను టెండర్ ప్రక్రియ నుంచి తప్పించి, తమ అనుకూల సంస్థలకు టెండర్లు కట్టబెట్టినట్లు వెల్లడించింది. టెండర్లు పొందిన సంస్థలు నకిలీ సరఫరాదారులతో ఓ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనేక సందర్భాల్లో సరుకులు సరఫరా చేయకుండానే, చేసినట్లు అధిక ధరలతో నకిలీ బిల్లులు సమర్పించి ప్రభుత్వ చెల్లింపులు పొందినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

బెంగాల్‌లో హైడ్రామా!

- ఐ-ప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ ఇల్లు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు
- ఆయన ఇంటికెళ్లిన సీఎం మమతా బెనర్జీ
- ఈడీ దాడులు రాజ్యాంగ విరుద్ధం
- కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తిన మమత

న్యూఢిల్లీ/కోల్‌కతా, జనవరి 8: రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐ-ప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో ఈడీ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. కోల్‌కతాలోని ఆయన ఇంట్లో సోదాలు చేపట్టారు. బొగ్గు అక్రమ రవాణాకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో ప్రతీక్ జైన్ నివాసంలో సోదాలు చేస్తున్నట్లు ఈడీ ప్రకటించింది. ఉదయం నుంచి ఆయన నివాసంతోపాటు ఐ-ప్యాక్‌కు సంబంధించిన పలు ప్రాంగణాల్లో దాడులు చేసింది. సోదాలు జరుగుతున్న సమయంలోనే బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోల్‌కతా పోలీసు కమిషనర్‌తో కలిసి అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మమత మాట్లాడుతూ.. ఈడీ సోదాలు రాజ్యాంగవిరుద్ధమని మండిపడ్డారు. రాజకీయ కుట్రలో భాగంగానే తమ పార్టీ ఐటీ సెల్ ఇన్‌చార్జి ప్రతీక్ జైన్ ఇంట్లో తనిఖీలు చేస్తున్నారని దుయ్యబట్టారు. "మా పార్టీ రాజకీయ వ్యూహం, రాబోయే అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల జాబితా, రహస్య సమాచారాన్ని చోరీ చేసేందుకే ఈడీతో దాడులు చేయిస్తున్నారు. టీఎంసీ పార్టీ హార్డ్‌డిస్క్‌లను తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు" అని ఆరోపించారు. రాజకీయ కక్షతోనే కేంద్ర ప్రభుత్వం ఈడీతో దాడులు చేయిస్తోందని ఆరోపించారు. తమ పార్టీ రాజకీయ వ్యూహం, ఇతర సమాచారం మొత్తాన్ని వారి కంప్యూటర్లలోకి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని ఆరోపించారు. ఈడీ దాడులకు ప్రతిగా తాము బీజేపీ కార్యాలయాల్లో దాడులు చేయిస్తే ఏం చేస్తారని నిలదీశారు. కాగా, ఈడీ అధికారులు తనిఖీలు చేస్తున్న సమయంలో సీఎం మమత అక్కడ ఉండగానే ఆమె అనుచరులు చాలా ఫైళ్లు తీసుకెళ్లి కారులో పెట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మమత 20-25 నిమిషాల పాటు ప్రతీక్ జైన్ నివాసంలోనే ఉన్నారు. ఆమె అక్కడి నుంచి వెళ్లేటప్పుడు చేతిలో గ్రీన్ ఫోల్డర్ ఉండడం గమనార్హం. మధ్యాహ్నం 1 గంట సమయంలో మమత ఐ-ప్యాక్ ఆఫీసుకు వెళ్లారు. ఆ సమయంలో మంత్రులు, టీఎంసీ నేతలతో పాటు డీజీపీ రాజీవ్ కుమార్ కూడా అక్కడకు చేరుకున్నారు. ఐ-ప్యాక్ ఆఫీసు ఉన్న భవనం లోపలికి, బయటకి వెళ్లే ద్వారాలను ఈడీ అధికారులు మూసివేశారు. మమత బేస్‌మెంట్ నుంచి భవనంలోకి వెళ్లి సాధారణ లిఫ్ట్ ద్వారా 11వ అంతస్తులోని కార్యాలయానికి చేరుకున్నారు. బెంగాల్‌లో గెలవాలనుకుంటే రాజకీయంగా ఎదుర్కోవాలని బీజేపీకి సవాలు విసిరారు. జైన్ ఆఫీసుకు వచ్చిన తర్వాత 4.15 గంటల సమయంలో మమత అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈడీ దాడులకు నిరసనగా శుక్రవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు మమత వెల్లడించారు.

ఇంట్లో చోరీ జరిగింది.. ప్రతీక్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు

ఈడీపై ప్రతీక్ జైన్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ఇంట్లో కొన్ని విలువైన పత్రాలను ఈడీ చోరీ చేసిందంటూ జైన్ భార్య ఆరోపించారు. సోదాల అనంతరం ఈడీ అధికారులు మధ్యాహ్నం 3 గంటలకు జైన్ ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఆ వెంటనే జైన్ భార్య స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. అత్యవసరమైన పత్రాలను ఈడీ చోరీ చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిందని, విచారణ జరుపుతామని పోలీసులు వెల్లడించారు.

మమత కీలక ఆధారాలను ఎత్తుకెళ్లారు: ఈడీ

ఐ-ప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో సోదాలు జరుపుతుండగా.. బెంగాల్ సీఎం మమత వచ్చి కీలక ఆధారాలను తీసుకెళ్లిపోయారని ఈడీ ఆరోపించింది. కొన్ని పత్రాలతో పాటు హార్డ్ డిస్క్‌లను కూడా ఆమె ఎత్తుకెళ్లిపోయారని ఓ ప్రకటనలో తెలిపింది. ఐ-ప్యాక్ కార్యాలయం నుంచి మమత, ఆమె అనుచరులు, పోలీసులు బలవంతంగా పత్రాలు, హార్డ్ డిస్క్‌లను తీసుకెళ్లిపోయారని పేర్కొంది. 2020లో నమోదైన బొగ్గు అక్రమ రవాణా కేసులో భాగంగా బెంగాల్‌లో ఆరు చోట్ల, ఢిల్లీలో నాలుగు చోట్ల తనిఖీలు చేసినట్లు వెల్లడించింది. కేసులో నిందితుడిగా ఉన్న హవాలా నిర్వాహకుడు ఒకరు ఐ-ప్యాక్‌తో రూ.కోట్లలో నగదు లావాదేవీలు జరిపినట్లు గుర్తించామని తెలిపింది. అందులో భాగంగా సోదాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. సీఎం మమత, కోల్‌కతా సీపీ కలిసి తమ విచారణ కు అడ్డంకులు సృష్టించారని ప్రకటనలో తెలిపింది. తాము ఏ పార్టీనీ లక్ష్యంగా చేసుకోలేదని, పార్టీ కా ర్యాలయాల్లో తనిఖీలు చేయలేదని స్పష్టం చేసింది. ఎన్నికలకు, ఈ సోదాలకు సంబంధం లేదని.. చట్టప్రకారమే తాము మనీలాండరింగ్ ఆరోపణలపై సోదాలు నిర్వహించామని తేల్చిచెప్పింది. కాగా, తమ విచారణకు అడ్డంకులు సృష్టించారన్న ఆరోపణలపై పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఈడీ కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. విచారణలో సీఎం జోక్యం చేసుకోవడాన్ని ప్రశ్నించింది. విచారణలో తమకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోర్టును కోరింది.

టీఎంసీకి 'కళ్లు, చెవులు'గా ఐ-ప్యాక్: కాంగ్రెస్

ఐ-ప్యాక్ సంస్థ టీఎంసీకి కళ్లు, చెవులుగా మారిందని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌధరి ఆరోపించారు. ఆ సంస్థ బెంగాల్‌లో టీఎంసీ గెలుపు కోసం అనైతిక, కుట్ర కార్యకలాపాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఒక కార్పొరేట్ సంస్థలో ఈడీ దాడులు చేస్తుంటే మమత ఎందుకంత ఆందోళన చెందుతున్నారని ప్రశ్నించారు.

మమతపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి: బీజేపీ

ఈడీ దాడులు జరుగుతుండగా ప్రతీక్ జైన్ నివాసానికి సీఎం మమతాబెనర్జీ వెళ్లడాన్ని బీజేపీ తప్పుపట్టింది. ఇది దర్యాప్తులో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడమే అవుతుందని బెంగాల్ ప్రతిపక్ష నేత, బీజేపీ నాయకుడు సువేందు అధికారి పేర్కొన్నారు. ఇలాంటి ప్రవర్తన అనైతికమని మండిపడ్డారు. ఆమెపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థల విధులకు ఆటంకం కలిగించడం ఆమెకు కొత్తేమీ కాదని.. ఇది అలవాటుగా మారిందని చెప్పారు. సీఎంపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని దర్యాప్తు సంస్థలను కోరారు. లేకపోతే రాష్ట్ర ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయన్నారు.



ప్రముఖ పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

- పశ్చిమ కనుమల పరిరక్షణ కోసం పోరాటం

పుణే, జనవరి 8: ప్రముఖ పర్యావరణవేత్త, పశ్చిమ కనుమల పరిరక్షణ యోధుడు మాధవ్ గాడ్గిల్ కన్నుమూశారు. 83ఏళ్ల వయసున్న ఆయన, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ బుధవారం పుణేలో తుదిశ్వాస విడిచారు. పశ్చిమ కనుమల జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో ఆయన చేసిన కృషి ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. 1942లో పుణేలో జన్మించిన గాడ్గిల్, భారత పర్యావరణ విధానాలను రూపొందించడంలో కీలకపాత్ర పోషించారు. బెంగుళూరులోని ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)లో 'సెంటర్ ఫర్ ఎకోలాజికల్ సైన్సెస్' వ్యవస్థాపకుడిగా సేవలందించారు. పశ్చిమ కనుమల పర్యావరణ వ్యవస్థను కాపాడడానికి 2010లో కేంద్రం ఏర్పాటుచేసిన 'గాడ్గిల్ కమిషన్'కు ఆయన చైర్మన్‌గా వ్యవహరించి.. పలు సాహసోపేతమైన, శాస్త్రీయమైన సిఫారసులను చేశారు. పర్యావరణ రంగంలో ఆయన చేసిన కృషికిగాను ఐక్యరాజ్యసమితి 2024లో అత్యున్నత పర్యావరణ పురస్కారం 'చాంపియన్ ఆఫ్ ఎర్త్'తో గౌరవించింది. అలాగే, పద్మవిభూషణ్, పద్మశ్రీ, టైలర్ ప్రైజ్(పర్యావరణ రంగంలో నోబెల్ లాంటిది)వంటి అనేక పురస్కారాలు ఆయనను వరించాయి. మాధవ్ గాడ్గిల్ మృతిపట్ల కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, జైరాం రమేశ్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

10, 11 తేదీల్లో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

గుంటూరు (విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): "ఊరి బడిని కాపాడుకుందాం" అనే నినాదంతో ఈ నెల 10, 11 తేదీల్లో యూటీఎఫ్ 51వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు గుంటూరులో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు వెల్లడించారు. గురువారం గుంటూరు యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడిలో బోధించే ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ఎలాంటి బోధనేతర కార్యక్రమాలు ఉండకూడదనే నినాదంతో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు వెంకటేశ్వర్లు తెలిపారు. గుంటూరు ఏసీ కళాశాల ఆవరణలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నామని, 32 సంవత్సరాల తర్వాత యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభలు గుంటూరులో జరుగుతున్నాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, తాము అధికారంలోకి వస్తే సకాలంలో డీఏలు మెరుగైన పీఆర్సీ ఇస్తామని చెప్పి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 18 నెలలు పూర్తికావస్తున్నా 12వ పీఆర్సీ చైర్మన్‌ను ఇంతవరకు నియమించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

దివ్యాంగుల హక్కుల అమలుకు నోడల్ అధికారి

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగుల హక్కుల పరిరక్షణ, అమలు పర్యవేక్షణకు ప్రభుత్వం నోడల్ అధికారిగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దివ్యాంగుల రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు సంరక్షణ కేంద్రాల్లో నివసిస్తున్న మానసిక వైకల్యాలు ఉన్న దివ్యాంగుల రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను సమర్థవంతంగా అమలు చేయడం, వారు గౌరవం, హక్కులు, అందుబాటులో సదుపాయాలు, సమాజంలో సమగ్ర భాగస్వామ్యాన్ని నిర్ధారించడమే లక్ష్యంగా ఈ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

● గుంటూరు మెడికల్ కాలేజీకి చెందిన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఇటీవల అదృశ్యమైంది. కళాశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు.. పోలీసుల విచారణ చేపట్టగా, ఆ విద్యార్థిని చెన్నై రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే గుంటూరు తీసుకువచ్చారు. విచారణలో ఆ వైద్య విద్యార్థిని మానసిక ఒత్తిడి, డిప్రెషన్‌కు గురై కాలేజీని నుంచి వెళ్లిపోయినట్లు తేలింది.

● గుంటూరు జిల్లాలోని ఓ వైద్య కళాశాలలో ఎనస్థీషియా పీజీ కోర్సు చేస్తున్న ఓ విద్యార్థిని.. ఆపరేషన్ థియేటర్‌లో రోగికి మత్తు మందు ఇస్తూ ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోయింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సదరు విద్యార్థిని పని ఒత్తిడితో పాటు వ్యక్తిగత జీవితంలో ఇబ్బందులు వల్ల తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై.. స్పృహ తప్పినట్లు న్యూరాలజిస్టులు గుర్తించారు.



శిక్షణతో మెడికోల ఒత్తిళ్లకు చెక్!

వైద్య విద్యార్థుల్లో తీవ్రమైన మానసిక ఒత్తిడి

- మొదటి సంవత్సరం వారిలో మరీ ఎక్కువ
- యూజీ విద్యార్థుల్లో 28%, పీజీ విద్యార్థుల్లో 15% మందికి మానసిక సమస్యలు.. ఎన్ఎంసీ నివేదిక
- 'క్యూపీఆర్' ఒప్పందంతో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- వారి మానసిక స్థితి అంచనా వేసి.. కౌన్సెలింగ్
- ఒత్తిడికి చెక్.. తద్వారా ఆత్మహత్యల నివారణ
- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో వినూత్న కార్యక్రమం

(గుంటూరు మెడికల్-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో చదువుతున్న చాలా మంది ఎంబీబీఎస్, మెడికల్ పీజీ విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు! తీవ్రమైన మానసిక కల్లోలంతో కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. అండర్ గ్రాడ్యుయేషన్ విద్యార్థుల్లో 27.8 శాతం మంది, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థుల్లో 15 శాతం మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు జాతీయ వైద్య కమిషన్ 2024లో నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. 'నేషనల్ టాస్క్‌ఫోర్స్ ఆన్ మెంటల్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్ ఆఫ్ మెడికల్ స్టూడెంట్స్' పేరుతో నివేదికను విడుదల చేసింది. ఎంబీబీఎస్ మొదటి ఏడాదిలో చేరిన విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని వివిధ అధ్యయనాల్లోనూ తేలింది. విద్యార్థుల సమస్యలను సకాలంలో గుర్తించి, తగిన చికిత్స అందించకపోతే.. ఎంతో విలువైన ఆ విద్యార్థుల జీవితం గాడి తప్పుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్య విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని నిర్మూలించేందుకు, ఆత్మహత్యలను నివారించేందుకు, వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. అమెరికాకు చెందిన క్వశ్చన్ పర్స్యూడ్ రిఫర్ (క్యూపీఆర్) ఇనిస్టిట్యూట్ ఇండియా అనే సంస్థతో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ గత వారం ఒప్పందం చేసుకుంది. వైద్య విద్యార్థుల మానసిక వికాస కల్పన శిక్షణలో ఒప్పందం జరగడం దేశంలో ఇదే తొలిసారి అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు.

కళాశాలల వారీగా విద్యార్థులకు శిక్షణ

2025-26 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చేరిన విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందించేందుకు, ఒత్తిడిని పారదోలేందుకు, ఆత్మహత్యల ఆలోచనల నుంచి బయటపడేలా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం కళాశాలల వారీగా తేదీలను ఎంపిక చేయనున్నారు. విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై 'అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్' అనే సంస్థకు చెందిన ప్రవాస భారతీయురాలు, చిన్న పిల్లల మానసిక వైద్య నిపుణులు డాక్టర్ అపర్ణ ఉప్పల సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఆమె ఎమోషనల్ అసిస్టెంట్ ఆఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేటర్స్(ఈజ్)కు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. క్యూపీఆర్ సంస్థ ద్వారా వైద్య విద్యార్థులకు అందించే శిక్షణ కార్యక్రమాలను డాక్టర్ అపర్ణ పర్యవేక్షిస్తారు.

ప్రశ్నావళి ద్వారా మానసిక స్థితి అంచనా

శిక్షణలో భాగంగా మానసిక వైద్య నిపుణులు నేరుగా విద్యార్థులతో సమావేశమై.. వారిలో సందేహాలను నివృత్తి చేస్తారు. ప్రశ్నావళి ద్వారా విద్యార్థుల మానసిక స్థితిని అంచనా వేసి.. దానికి అనుగుణంగా కౌన్సెలింగ్ ఇస్తారు. ప్రతి వైద్య కళాశాలలో ఎంపిక చేసిన సమన్వయకర్త ద్వారా శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులకు మేలు చేకూర్చే విధంగా నిర్వహిస్తామని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం నుంచి విద్యార్థులకు ఐదేళ్ల పాటు ఈ శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ తెలిపారు. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో శిక్షణ కార్యక్రమాలకు అయ్యే వ్యయాన్ని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ భరిస్తుందని పేర్కొన్నారు.

పది రోజుల్లో 7.90 లక్షల మంది..

రికార్డు స్థాయిలో వైకుంఠ ద్వార దర్శనాలు

- హుండీ ఆదాయం రూ.36.86 కోట్లు

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠ ద్వారం ద్వారా రికార్డు స్థాయిలో భక్తులు దర్శనం చేసుకున్నారు. డిసెంబరు 30వ తేదీ నుంచి పది రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పది రోజులకు దాదాపు 7.90 లక్షల మంది దర్శించుకున్నారు. గతేడాది పది రోజుల్లో 6.83 లక్షల మంది వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. కాగా.. ఈ ఏడాది వైకుంఠ ద్వార దర్శనాల తొమ్మిది రోజులకు హుండీ ద్వారా రూ.36.86 కోట్లు సమకూరాయి. 2.06 లక్షల మంది తలనీలాలను సమర్పించారు. 37.97 లక్షల లడ్డుల విక్రయాలు జరిగాయి.

రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

- వైకుంఠ ద్వార దర్శనాల తరహాలోనే...
- టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి

తిరుమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైకుంఠద్వార దర్శనాల తరహాలోనే రథసప్తమికి ఏర్పాట్లు చేయనున్నట్టు టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. ఈ నెల 25న జరగనున్న రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై తిరుమలలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, అదనపు ఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

25న ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు

రథ సప్తమి సందర్భంగా ఆ రోజు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. అలాగే ఎన్ఆర్ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, వికలాంగుల ప్రివిలేజ్ దర్శనాలు రద్దు చేశారు. తిరుపతిలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు స్లాటెడ్ సర్వ దర్శనం టోకెన్ల జారీని కూడా రద్దు చేశారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా, వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఈ నెల 24న ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించబోమని ప్రకటించారు.

తిరుమలలో 'శ్రీవాణి' ఆఫ్‌లైన్ టికెట్ల జారీ రద్దు: టీటీడీ

నేటి నుంచి తిరుమలలో కౌంటర్ ద్వారా శ్రీవాణి టికెట్ల విక్రయం ఉండదు. ఆఫ్‌లైన్ ద్వారా రోజువారి టికెట్ల జారీ విధానాన్ని టీటీడీ రద్దు చేసింది. ఈ పద్ధతిలో ప్రస్తుతం రోజుకు 800 టికెట్లు జారీ చేస్తున్నారు. శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లోనే ఏరోజుకా రోజు వీటిని విడుదల చేస్తారు. ఈ టిక్కెటను ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంచుతారు. టికెట్ పొందిన భక్తులు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి వెళ్లవచ్చు. ఒక కుటుంబంలో నలుగురు సభ్యులకు మాత్రమే అనుమతి ఉంటుంది. కాగా ప్రస్తుతం అమలులోనున్న శ్రీవాణి దర్శన టిక్కెట్ల అడ్వాన్సు బుకింగ్, తిరుపతి విమానాశ్రయంలో ఆఫ్‌లైన్ కరెంటు బుకింగ్ విధానం మాత్రం యథాతథంగా కొనసాగుతుంది.

డిప్యూటీ సీఎం సొంత నిధులతో

అరకులో బ్లడ్ బ్యాంకు

- భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కలెక్టర్


అరకులోయ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రి ప్రాంగణంలో బ్లడ్ బ్యాంకు భవన నిర్మాణానికి గురువారం కలెక్టర్ ఎ.ఎస్.దినేశ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సొంత నిధులు రూ.95 లక్షలు మంజూరు చేశారని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. అన్ని సదుపాయాలతో తొమ్మిది నెలల్లో ఈ భవనాన్ని పూర్తిచేస్తామని చెప్పారు. సొంత నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎంకు ఈ ప్రాంత గిరిజనుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

స్టీల్‌ప్లాంట్ భూముల ధారాదత్తం తగదు: సీపీఐ

అమరావతి: విశాఖ ఉక్కు పరిశ్రమకు చెందిన 2,500 ఎకరాల స్టీల్ ప్లాంట్ భూములను ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

జీవ వైవిధ్య రక్షణలో ఆంధ్ర రోల్ మోడల్ కావాలి

- మడ అడవుల పెంపుదలకు చర్యలు
- తీరంలో గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టు
- వీటి పెంపకంతో తీర ప్రజలకు ఆదాయ మార్గాల కల్పనకు కృషి: డిప్యూటీ సీఎం



అటవీ శాఖ నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అమరావతి/విజయవాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'మడ అడవుల్లో జీవ వైవిధ్యాన్ని రక్షించడంలో జాతీయ స్థాయిలోనే ఏపీ రోల్ మోడల్‌గా నిలవాలి. ఇందుకోసం అటవీశాఖ సమష్టిగా కృషి చేయాలి' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో 'మడ అడవులు పెంపుదల-వాటి నుంచి సుస్థిర ఆదాయం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ గురువారం విజయవాడలో ప్రారంభమైంది. ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'తీర ప్రాంత రక్షణకు, ప్రకృతి వైపరీత్యాల నుంచి నష్ట నివారణకు మడ అడవులు కీలకం. ఏపీ తీర ప్రాంత రక్షణకు బలమైన గోడల్లా ఉండే మడ అడవులను రక్షించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. రాష్ట్రానికి తుఫానుల ప్రభావం ఎక్కువ. గోదావరి, కృష్ణా బేసిన్లలో తుఫాన్ల నుంచి నష్టాన్ని నివారించేందుకు మడ అడవుల్ని విరివిగా పెంచడం చాలా అవసరం. మడ అడవుల్ని కొత్తగా పెంచడంతో పాటు ఇప్పటికే ఉన్న వాటిని కాపాడుకోవడం అవసరం. 2025లో తీరప్రాంతంలో 700 హెక్టార్లలో మడ అడవుల్ని ప్రభుత్వం పెంచింది. ఇదే స్ఫూర్తిని భవిష్యత్‌లోనూ కొనసాగిస్తాం. తీర ప్రాంత వాసులకు ఆదాయం అందించే ప్రయత్నంలో భాగంగా మడ అడవుల పెంపకం, తీర ప్రాంతాన్ని రక్షించడానికి మూడు దశలుగా గ్రీన్ బెల్టు అభివృద్ధి చేయడంలోనూ వారిని భాగస్వాములను చేయాలని నిర్ణయించాం. ఎకో టూరిజం ద్వారా ఆదాయ మార్గాలు తయారు చేస్తాం. రాష్ట్రంలో 50% గ్రీన్ కవర్ ఉండాలనే బలమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. తీర ప్రాంతంలో గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్‌ను చేపట్టాం. పచ్చదనం నుంచి ఆర్థిక ఫలాలు రావాలనే కొత్త ఆలోచనతో ముందుకెళ్తున్నాం. అటవీ నర్సరీలను ప్రోత్సహించి, గిరిజనులకు ఆదాయం పెంచే చర్యలు తీసుకుంటున్నాం. వైవిధ్యమైన దేశవాళీ మొక్కలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. మడ అడవుల పెంపుదలకు సమగ్ర కార్యాచరణ తెస్తాం. అటవీ సిబ్బంది సంక్షేమ నిధికి రూ.5 కోట్లు అందించాం' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేషనల్ క్యాంపా (సీఏఎంపీఏ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆనంద్ మోహన్ మాట్లాడుతూ.. సముద్ర తీర ప్రాంతాల్లో క్షీణిస్తున్న మడ అడవులను పునరుద్ధరించి ఆ ప్రాంతాల్లో నివసించే ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడమే మిస్టీ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సముద్రతీర ప్రాంతాల్లో క్షీణిస్తున్న మడ అడవులను రక్షించి, సముద్రం కోత నుంచి కాపాడడమే లక్ష్యంగా మిస్టీ పథకం పనిచేస్తుందన్నారు. ఈ పథకాన్ని సుమారు రెండున్నర ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. ఈ పథకానికి జాతీయ క్యాంపా నిధుల నుంచి 10 శాతం కేటాయిస్తున్నారని చెప్పారు. మొత్తం రూ.825 కోట్ల కేటాయింపుల్లో ఇప్పటివరకు కేవలం రూ.100 కోట్లు మాత్రమే వినియోగించినట్టు తెలిపారు. చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ డాక్టర్ పీవీ చలపతిరావు మాట్లాడుతూ, గత నాలుగు దశాబ్దాలుగా రాష్ట్రంలో మడ అడవుల విస్తీర్ణం పెరుగుతూ ఉండడం ఒక సానుకూల అంశమని తెలిపారు. భవిష్యత్తులో తీర ప్రాంతాన్ని మరింత సురక్షితంగా మార్చడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అటవీ శాఖ ముఖ్యక కార్యదర్శి కాంతిలాల్ దండే, అటవీ శాఖ సలహాదారు మల్లిఖార్జునరావు, ఎన్ఏఈబీ అదనపు జనరల్ రమేశ్ కుమార్ పాండే తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో

20 ఏళ్ల జైలు, జరిమానా

కర్నూలు లీగల్/పాణ్యం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పాణ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన కేసు లో ముద్దాయికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారి రాజేంద్రబాబు గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నంద్యాలకు చెందిన పఠాన్ మహమ్మద్ ఖాన్ పాణ్యంలో ఓ హోటల్ నిర్వహించేవాడు. ఆ హోటల్‌కు బాలిక తరుచూ వస్తుండేది. ఈ నేపథ్యంలో పఠాన్ మహమ్మద్ ఖాన్.. వివాహం చేసుకుంటానని బాలికను నమ్మించి 2020 నవంబరు 2వ తేదీన కిడ్నాప్ చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పాణ్యం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మహమ్మద్ ఖాన్ బాలికను నెల్లూరుకు తీసుకెళ్లి ఓ ఇంట్లో నిర్బంధించాడు. 2020 డిసెంబరు 18న బాలికను వారి ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. తల్లిదండ్రులు ఆమెను తీసుకుని వెళ్లి పాణ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కిడ్నాప్, అత్యాచారం సెక్షన్ల కింద పోలీసులు మహమ్మద్ ఖాన్‌పై కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. గురువారం కోర్టులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. జైలు శిక్షను ఏకకాలంలో అనుభవించాలని, రూ.లక్ష జరిమానా బాధితురాలికి నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశిస్తూ తీర్పులో పేర్కొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ జీరామ్‌జీ చట్టం గ్రామీణ పేదలపై, వ్యవసాయ కార్మికులపై, నిరుద్యోగ యువత, మహిళలపై కేంద్రం ప్రకటించిన బహిరంగ యుద్ధమని వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2005 ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రజలు సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టబద్ధమైన పని హక్కును కేంద్రం లాక్కుంటోందని, కార్పొరేట్ లాభాల కోసం పేదల బతుకులను బలిపెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాలు, రేగ సంఘర్ష మోర్చ అధ్వర్యంలో సుర్జిత్ భవన్‌లో గురువారం అఖిల భారత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ జయతి ఘోష్, ప్రొఫెసర్ అర్చన ప్రసాద్, సీఐటీయూ అధ్యక్షుడు సుదీప్ దత్తా, ఐఎన్‌టీయూసీ నేత రఫియా, సీపీఎం నేత బి.వెంకట్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల తీసుకొచ్చిన వీబీ జీరామ్‌జీ చట్టాన్ని రద్దు చేసి, ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "2005 చట్టం గ్రామీణ పేదలకు కనీస జీవన భద్రత కల్పిస్తే, 2025 చట్టం ఆ భద్రతను కూల్చివేసి దేశాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టేలా ఉంది" అని విమర్శించారు. గ్రామీణ పేదల పని హక్కును కాలరాస్తే దేశవ్యాప్త ఉద్యమంతో తగిన బుద్ధి చెబుతామని సమావేశంలో వక్తలు హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బాధ్యతారాహిత్యం

ఢిల్లీ కాలుష్యానికి కారణాలు కనిపెట్టనందుకు కమిషన్ ఫర్ ఎయిర్‌క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎం)ను మంగళవారం సుప్రీంకోర్టు తప్పుబట్టింది. గ్యాస్‌చాంబర్‌లాగా తయారైన ఢిల్లీని కాలుష్యం బారినుండి కాపాడాలన్న సంకల్పం ఈ సంస్థకు లోపించిందని, కారణాలు, పరిష్కారాలతో రెండువారాల్లోగా తనముందు ఉండాలని కోర్టు గట్టిగా చెప్పింది. పొరుగురాష్ట్రాలనుంచి ఢిల్లీ వచ్చే భారీ వాహనాలు గంటలతరబడి టోల్‌ప్లాజాల దగ్గర వేచివుండటం కూడా కాలుష్యానికి కారణమవుతున్నందున వాటిని వేరే ప్రాంతాలకు తరలించాలని కోర్టు సూచించింది. తరలించాలా లేక తాత్కాలికంగా మూసేయాలా అన్నది నిర్ణయించడానికే ఓ రెండు నెలలు పడుతుందని కమిషన్ చెప్పడంతో న్యాయమూర్తులకు కోపం వచ్చింది. మాకు ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న టోల్‌ప్లాజాల జోలికిపోవద్దన్న రీతిలో ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్, గుర్‌గ్రామ్ డెవలప్‌మెంట్ అథారిటీ అఫిడవిట్లు సమర్పించినందుకు కూడా వారికి ఆగ్రహం కలిగింది. పొల్యూషన్‌కు పరిష్కారం సాధించాల్సిన వ్యవస్థలూ సంస్థలూ ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయని చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీ ధర్మాసనం అభిప్రాయపడింది. రాజకీయ ప్రయోజనాలకోసం ఏదో సమస్యని సృష్టించి, విద్వేషాన్ని రగల్చి ప్రజల జీవితాలని అతలాకుతలం చేయగల ఘటనాఘటన సమర్థులైన పాలకులకు ఈ వాయుకాలుష్యం కార్యకారణసంబంధాల గురించి తెలియదని ఎవరైనా నమ్ముతారా?

ఢిల్లీలో కాలుష్యం తగ్గాలంటే కార్లు తగ్గాలి, ఒకరికి ఒకటే కారు నిబంధన ఉంటే కాలుష్యం కాస్త తగ్గచ్చు అన్నారట న్యాయవాది. జనం దృష్టిలో కారు స్టేటస్ సింబల్ అయిపోయింది, సైకిళ్ళు తొక్కడం మానేశారు, ధనవంతులు కాస్తంత త్యాగం చేసి, ఖరీదైన కార్ల బదులు విద్యుత్ వాహనాలు కొంటే ఉత్తమం అన్నారట చీఫ్‌జస్టిస్. ఇదే వేడిమీద, కార్ల అమ్మకాలు కొనుగోళ్ళను నియంత్రించడం గురించి కూడా రేపటిరోజుల్లో కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశిస్తే ఎంతో బాగుంటుంది. ఆటో మొబైల్ పరిశ్రమ అత్యంత శక్తిమంతంగా తయారైందన్న న్యాయవాది వ్యాఖ్యలోనే అసలు నిజం ఉంది. వాహనాలు, పరిశ్రమలు, నిర్మాణ రంగం ఢిల్లీ ఉక్కిరిబిక్కిరికి ప్రధాన కారణాలని అందరికీ తెలుసు. సవివరమైన డేటాతో నిపుణులు వ్యాసాలు రాస్తున్నారు, మీడియా సైతం చర్చోపచర్చలు చేస్తోంది. కమిషన్ ఫర్ ఎయిర్‌క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఏర్పాటై కూడా ఐదేళ్ళు దాటింది కనుక, దాని దగ్గర తగినంత సమాచారం లేదని అనుకోలేం. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా విశ్లేషించడంలో, వ్యవహరించడంలో ఎందుకంత జాప్యం జరుగుతోందో తెలియదు.


కాలుష్యనివారణ పేరిట చలికాలంలోనే హడావుడి చేసి, తరువాత సమస్యను వదిలివేయడం వల్లనే పదేళ్ళుగా అవే బాధలు అనుభవించవలసి వస్తోంది. శ్వాససంబంధిత సమస్యలతో, తీవ్ర జ్వరాలతో ఢిల్లీ పౌరులు ఆస్పత్రుల పాలవుతున్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి కూడా ఈ బాధ తప్పలేదు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఆరంభమైననాడే ఢిల్లీ కాలుష్యం మీద సభలో చర్చజరగాలని ఆమె పట్టుబట్టారు. ఇది రాజకీయాంశం కాదని, ప్రభుత్వం చర్చకు గనుక సిద్ధపడితే చర్యలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఢిల్లీ సహా అన్ని ప్రధాన నగరాల్లో కోట్లాదిమంది ఉసురుతీస్తున్న కాలుష్యం మీద రాజకీయాలకు అతీతంగా సభలో చర్చించి, సమష్టి నిర్ణయాలు చేద్దామంటూ రాహుల్ సభాముఖంగా అభ్యర్థించినప్పటికీ, కేంద్రప్రభుత్వం ఊరుకుంది. వందేమాతరం మీద చర్చ పేరిట లోక్‌సభలో 11గంటలు, రాజ్యసభలో 13గంటలు గతాన్ని తవ్విపోయడానికే అధికారపక్షం ప్రాధాన్యం ఇచ్చింది.

ప్రతీ ఢిల్లీవాసీ ముప్పైఐదు సిగరెట్లు తాగినంత విషప్రభావాన్ని దిగమింగుతున్నాడట. వాయుకాలుష్యాన్ని దేశరాజధాని శీతాకాలంలోనే చవిచూస్తున్నట్టుగా కనిపిస్తున్నా, తీవ్రతలో కాస్తంత తేడాపాడాలతో ఏడాది అంతా అది కాలుష్యంలోనే మగ్గుతోంది. వాహన, పారిశ్రామిక, నిర్మాణరంగ కాలుష్యాలను నియంత్రించేపని నిరంతరం సాగాల్సిన అవసరం ఢిల్లీలో ఉంది. ఉన్నతస్థాయి పర్యవేక్షణతో, అన్ని విభాగాల మధ్య సమన్వయంతోనే ఇది సాధ్యం. బీజింగ్ వంటి ప్రధాన నగరాల్లో ఇంతకుమించిన భయానకమైన కాలుష్యంతో పోరాడిన చైనా పదేళ్ళ కాలంలోనే అద్భుతమైన ఫలితాలను సాధించింది. వాయుకాలుష్యానికి దారితీసే ఏ చిన్నదారినీ అది వదల్లేదు. ఢిల్లీ కాలుష్యంమీద నిరవధికంగా, నిరంకుశంగా, నిర్దాక్షిణ్యంగా పోరాడటానికి పాలకులు ఇప్పుడు సంకల్పిస్తే, కనీసం కొంతకాలానికైనా పరిస్థితులు కాస్తంత మెరుగుపడతాయి.

బడుగుల జీవితాల్లో వెలుగురేఖ

మానవ హక్కులంటే, సమాజంలోని అన్ని వర్గాల హక్కులని, ముఖ్యంగా బలహీన వర్గాలు, మహిళలు, పిల్లల హక్కులని, వాటి సాధనకు అక్షరమే ఆయుధమని నమ్మిన సమాజ సేవకురాలు ఫాతిమా షేక్. సావిత్రీబాయి పూలేతో కలిసి అణగారిన వర్గాల మహిళలు, పిల్లలకు అక్షరజ్ఞానం ప్రసాదించిన విద్యాదాత. ఆధునిక భారత విద్యారంగానికి మార్గదర్శకురాలు. మనువాద, అగ్రవర్ణ భావజాలికులు సంప్రదాయం పేరుతో శూద్రులకు విద్యను నిరాకరించినప్పుడు ఆ హక్కు కోసం గళమెత్తిన ధీరవనిత. సావిత్రీబాయి, జ్యోతిరావు పూలేలతో కలిసి విద్యాభివృద్ధికి పాటుపడిన త్యాగమయి. పూలే నేతృత్వంలోని సత్యశోధక్ ఉద్యమంలో భాగస్వామి.

1848లో దళిత పిల్లలు, మహిళల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించడానికి ప్రయత్నించినప్పుడు, 'మత వ్యతిరేక చర్య'గా పేర్కొంటూ పూలే దంపతులను కుటుంబ సభ్యులు, గ్రామస్థులు బహిష్కరించినప్పుడు ఫాతిమా షేక్, ఆమె సోదరుడు ఉస్మాన్ షేక్ వారికి సహాయం చేసి ఆదుకున్నారు. పూలే ఆలోచనల నుంచి ప్రేరణ పొందిన ఉస్మాన్, తన సోదరికి ఉపాధ్యాయురాలిగా శిక్షణ ఇప్పించాడు. సావిత్రీ బాయితో పాటు, ఫాతిమా కూడా నాటి ఆధిపత్య వర్గాల నుంచి సామాజిక పరంగా అనేక అవమానాలను ఎదుర్కొన్నారు. ఎందుకంటే వారు దుర్మార్గమైన నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడారు. విద్యాభివృద్ధి జరగాలంటే విద్యాసంస్థలు సజీవంగా ఉండాలి. వాటిని నిర్మూలించడానికి మనువాదులు విశ్వప్రయత్నాలు చేసినప్పుడు వాటిని కాపాడుకోడానికి ఫాతిమా చేసిన కృషి అనుపమానమైనది.



ముస్లిం మైనారిటీలు అనుసరించే ఇస్లాం ధర్మం స్త్రీ విద్యను వ్యతిరేకించనప్పటికీ, ఇస్లాం తెలియని ముస్లింల నుంచి, అగ్రకుల హిందువుల నుంచి ఫాతిమా తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నారు. అనేక ఆటుపోట్లు, అవమానాలు చవిచూశారు. అయినా అకుంఠిత దీక్షతో ఆమె దళితులు, ఆదివాసీలు, స్త్రీలు, పిల్లల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసి, చరిత్రలో నిలిచి పోయారు. 2014లో మహారాష్ట్ర ప్రభుత్వం ఫాతిమా షేక్ సేవలను గుర్తించి, సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, జాకీర్ హుసేన్, అబ్దుల్ కలామ్‌లతో పాటు ఆమె సంక్షిప్త పరిచయాన్నీ రాష్ట్ర పాఠ్య పుస్తకాలలో పొందుపరిచింది. 2021లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఫాతిమా గురించిన పాఠాన్ని ఎనిమిదవ తరగతిలో ప్రవేశపెట్టింది. 2022లో ఫాతిమా జన్మదినం సందర్భంగా గూగుల్ ఇండియా ప్రత్యేక డూడుల్ ద్వారా ఆమె సేవలను స్మరించింది. కాస్త ఆలస్యమైనా జాతీయ–అంతర్జాతీయ స్థాయిలో ఆమెకు లభించిన సమున్నత గుర్తింపు ఇది.

అక్షరాన్ని అమితంగా ప్రేమించి, అణగారిన వర్గాలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి, అలుపెరుగని పోరు సలిపిన ఫాతిమా షేక్ విస్తృత చరిత్రను మరింతగా పరిశోధించి భావితరాలకు అందించవలసిన అవసరం మేధావులు, చరిత్రకారులపై ఉంది.

● యండి.ఉస్మాన్ ఖాన్

(నేడు ఫాతిమా షేక్ జయంతి)

పీఆర్‌సీ జాప్యంతో పెన్షనర్లకు అన్యాయం

ఆంధ్రప్రదేశ్‌లో పీఆర్‌సీల అమలులో జరుగుతున్న తీవ్రమైన ఆలస్యాలు, పెన్షనర్లను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. 1958లో తొలి పీఆర్‌సీ నుంచి 1999లో అమలైన ఏడవ పీఆర్‌సీ వరకు సమయానికి ఏర్పాటై, నివేదికలు సమర్పించిన ఒకటి, రెండు సంవత్సరాల్లోనే అమలయ్యేవి. కానీ 2005 తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎనిమిదవ పీఆర్‌సీ నుంచి మొదలైన ఆలస్యాల ధోరణి తొమ్మిది, పది పీఆర్‌సీలలో కొనసాగి, చివరకు పదకొండవ పీఆర్‌సీ వద్ద పరాకాష్ఠకు చేరింది.

11వ పీఆర్‌సీ అర్హత తేదీగా 2018 జూలై 1ని నిర్ణయించినా, నగదు ప్రయోజనాలు మాత్రం 2022 అక్టోబర్ 1 నుంచి అమలయ్యాయి. దాదాపు నాలుగేళ్లకు పైగా పెన్షనర్లు తమకు రావాల్సిన న్యాయమైన లాభాన్ని కోల్పోయారు. ఈ కాలంలో వేలాది పెన్షనర్లు మరణించారు. వారు ఎదురుచూసిన పీఆర్‌సీ ప్రయోజనాన్ని చూడకుండానే లోకాన్ని విడిచిపెట్టారు. ఇది కేవలం ఆర్థిక నష్టం కాదు, మానవీయ విషాదం.

2019–24 కాలంలో పీఆర్‌సీ ఆలస్యం కొనసాగడం పెన్షనర్లకు తీవ్రమైన ఆర్థిక, మానసిక ఒత్తిడిని కలిగించింది. ఈ నాలుగేళ్లలో ద్రవ్యోల్బణం పెరిగింది, వైద్య ఖర్చులు రెట్టింపయ్యాయి. పీఆర్‌సీని న్యాయబద్ధంగా అమలు చేయాల్సి ఉండగా, కేవలం కనీస పెంపు మాత్రమే ఇచ్చారు. పీఆర్‌సీ ఆలస్యం వల్ల పెన్షన్ నిజమైన విలువ క్రమంగా తగ్గిపోతోంది. ఖర్చులు, అవసరాలు పెరుగుతున్న ఈ కాలంలో, పాత పెన్షన్‌తో జీవించడం పెన్షనర్లకు సవాలుగా మారింది. బకాయిల చెల్లింపుల్లోనూ అన్యాయం కొనసాగుతోంది. విడతలుగా చెల్లింపులు, కొంత మొత్తాన్ని ఫ్రీజ్ చేయడం, కోతలు విధించడం వల్ల పెన్షనర్లకు రావాల్సిన మొత్తం పూర్తిగా అందడం లేదు. ఇది వారి ఆర్థిక భద్రతను దెబ్బతీస్తోంది.

11వ పీఆర్‌సీ కాలంలో మరో తీవ్రమైన అన్యాయం గ్రాట్యుటీ విషయంలో జరిగింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రాట్యుటీ పరిమితి రూ.20 లక్షలకు పెరిగినా, ఆంధ్రప్రదేశ్‌లో 2018 జూలై 1 నుంచి 2022 మధ్య పదవీ విరమణ చేసిన పెన్షనర్లకు ఈ ప్రయోజనం పూర్తిగా కల్పించలేదు. దాంతో ఒక్కో పెన్షనర్‌కు సుమారు నాలుగు లక్షల రూపాయల వరకు నష్టం జరిగింది.

పెన్షన్ కమ్యూటేషన్‌లో కూడా అన్యాయం జరుగుతోంది. ప్రస్తుతం కమ్యూట్ చేసిన పెన్షన్ మొత్తాన్ని 15 సంవత్సరాల పాటు రికవరీ చేస్తున్నారు. కానీ వాస్తవంగా ఆ మొత్తాన్ని అధిక వడ్డీతో కలిపి కేవలం 12 సంవత్సరాల లోపే ప్రభుత్వం తిరిగి పొందుతోంది. కనుక కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని పన్నెండేళ్లకు పరిమితం చేయాలి. ఇది ఆర్థిక లెక్కల ఆధారంగా న్యాయమైన డిమాండ్. ప్రభుత్వాలు తరచూ ఖజానా లోటు, ఆర్థిక భారం పేరుతో పీఆర్‌సీలను ఆలస్యం చేస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా ఈ కారణం మాత్రం మారడం లేదు. పెన్షన్–దయ కాదు, రాజ్యాంగ హక్కు అని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో స్పష్టంగా చెప్పింది. 11వ పీఆర్‌సీలో జరిగిన అన్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని, రాబోయే పీఆర్‌సీలో కనీసం 35శాతానికి తక్కువ కాకుండా పెంపు ఉండాలి. కొత్త పీఆర్‌సీని సమయానికి ఏర్పాటు చేసి, నివేదిక వచ్చిన వెంటనే అమలు చేయాలి.


● టి.ఎం.బి.బుచ్చిరాజు

జనరల్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం

బహుళ భారత్‌లు–అనేక అంతర్యాలు

ఏ మనిషి అయినా ప్రాథమిక అవసరాలు తీరిన తరువాత గుర్తింపు, గౌరవం కోసం ఆరాట పడతాడు. వ్యక్తులలోను, సమాజాలలోను ఈ ఆరాటం ఉంటుంది. అయితే, నిర్దిష్ట సంస్కృతులు, భాషలకు సంబంధించిన వారు తమ తమ భాషా సంస్కృతుల గుర్తింపు, గౌరవం కోసం పడుతున్న ఆరాటం అపార వైవిధ్యమున్న మన సమాజంలో తరచూ వక్రగతిలో వ్యక్తమవుతోంది. నేను చూసిన ఒక వీడియోలో ఒక వ్యక్తిని మరాఠీ భాష మాట్లాడి తీరాలని ఒక యువతి నిక్కచ్చిగా చెబుతోంది. తాను హిందీ మాత్రమే మాట్లాడగలనని, మనం భారతదేశంలో ఉన్నాం కనుక మనమందరమూ హిందీలో మాట్లాడుకోవాలని ఆ 'ఇతర' వ్యక్తి సమాధానమిచ్చాడు. ఇరువురి మధ్య వాద ప్రతివాదాలు ప్రారంభమయ్యాయి. అంతిమంగా వారిరువురి వాగ్యుద్ధం ఆంగ్లభాషలో కొనసాగింది! ఆ మరాఠీ యువతి, హిందీ భాషీయుడి మధ్య మాటల యుద్ధం సమంజసమైనదేనా?

మరో వీడియోలో ఒక మహిళ మరొక మహిళను హిందీలో చీవాట్లు పెడుతోంది. బాధితురాలు అయిన మహిళ బురఖాలో ఉంది. తనపై హిందీలో వర్షిస్తున్న తిట్లకు ఆమె కన్నడంలో ప్రతిస్పందిస్తోంది. ఇరువురూ బిగ్గరగా మాట్లాడుతున్నారు. జెండర్ భాగస్వామ్యం ఆ మహిళల మధ్య ఎలాంటి ప్రత్యేక బంధనాన్ని సృష్టించ లేదు. భాషా దురభిమానం బరువు కింద ఆ సహజ బంధం పనికిరాకుండాపోయింది. తమ భాషను గుర్తించి, గౌరవించాలని ఎవరైనా కోరుకోవడం సహజం. అయితే ఆ ఆరాటం ఇతరులను బలవంతం చేసేందుకు పురిగొల్పకూడదు. అలా చేయడం ఇతరుల హక్కులను కాలరాయడమే. తమ నమ్మకాలు, విలువలు, అభ్యాసాలనే ఇతరులూ విశ్వసించాలని, అనుసరించాలని కోరుకోవడమే తప్పు. పైగా వాటిని ఇతరులపై రుద్దడానికి ప్రయత్నించడం నాగరీక సంస్కారానికి విరుద్ధం. అయినా నేటి సమాజంలో చాలా మంది అటువంటి సంకుచితత్వాలను వదులుకోలేకున్నారు. అసలు అవి సంకుచితత్వాలనే వివేకం కూడా చాలా మందికి లేదు. కాకపోతే హిందీ, కన్నడ భాషల్లో పరస్పరం అరుచుకున్న మహిళలు ఇరువురూ తాము నివసిస్తున్న పితృస్వామ్య వ్యవస్థ విసురుతున్న సవాళ్లను సమష్టిగా ఎదుర్కోవడంపై అలక్ష్యం చూపడం సబబేనా?



> వైవిధ్యానికి ఉన్న ప్రాధాన్యాన్ని ఒకనాటి మన రాజులు, చక్రవర్తులు గుర్తించినట్టుగా నేడు మనం గుర్తిస్తున్నామా? భాష, మతం, ప్రాంతం ప్రాతిపదికన గుర్తింపులు సులభంగానే లభిస్తాయి. అయితే అవి శాశ్వతమైనవి కావు.

మానవ ప్రవర్తన విచిత్రమైనది. ఇతర ప్రాంతాలకు చెందిన సహచరుల నుంచి తమ భాషా సంస్కృతులకు సంపూర్ణ గుర్తింపు గౌరవాన్ని డిమాండ్ చేస్తున్న వారు– ఇతర దేశాలకు చదువు, ఉద్యోగం కోసం వెళ్లినప్పుడు అక్కడి సంస్కృతిని గౌరవిస్తున్నారా? సమాధానం స్పష్టమే. ఈ తరహా విద్యావంతులు విదేశీ సమాజాలలో ఉన్నప్పుడు తమకొక నిర్దిష్టమైన గుర్తింపు, గౌరవాన్ని పొందేందుకు ఎంతగా ఆరాట పడతారో చెప్పనవసరం లేదు. వినడానికి సిద్ధంగా ఉన్నవారికి తమ విలక్షణ అస్తిత్వం గురించి అరుస్తూ మరీ చెబుతారు. నలుగురి మధ్యా అటువంటి ప్రవర్తన ఎబ్బెట్టుగా ఉంటుందనే విషయాన్ని సైతం పట్టించుకోరు. స్వకీయ గుర్తింపునకు ఎందుకంత పవిత్రతను ఆపాదిస్తున్నారు? బహుశా అది ఒక ఆవశ్యక మానసిక ఓదార్పునివ్వడం వల్ల కావచ్చు. అయితే అపార వైవిధ్యమున్న భారతీయ సంస్కృతీ సంప్రదాయాలలో భాగమైన, తమవైన ఉప భాషా సంస్కృతుల మాన్యత విషయమై అంతగా పట్టింపులకు పోవడం ఆశ్చర్యకరం. మన ఆహార అలవాట్లనే చూడండి. మన సువిశాల భారత భూమిలో అన్ని భాషా సంస్కృతుల వారూ, కుల మతాల వారూ చేతులతో తినడం సర్వవ్యాపకంగా ఉన్నది. అయితే ప్రాంతాల వారీగా భిన్న భిన్న రీతుల్లో ఉండడం కద్దు. ఆ మాట కొస్తే ఆహారాన్ని వండుకునే పద్ధతి కూడా చాలా వైవిధ్యంగా ఉంటుంది. ప్రతి భారతీయ కుటుంబమూ పప్పు వండుకోవడం పరిపాటి. అయితే ఈ ప్రధాన ఆహార పదార్థాన్ని సిద్ధం చేసుకునే రీతి రివాజులు ప్రాంతాల వారీగా భిన్నంగా ఉండడంలో ఆశ్చర్యం లేదు.

పురాతన యోగా సంప్రదాయాన్నే తీసుకోండి. యోగాభ్యాసంలో అనేక పద్ధతులు ఉన్నాయి. ఒక ప్రాంతంలో ఉన్న పద్ధతులు మరొక ప్రాంతం వారికి కొత్తగా ఉండడం కద్దు. అలాగే స్త్రీల చీరకట్టు. అద్భుతమైన వైవిధ్యమున్న స్త్రీల వస్త్రధారణ ఇది. చీరకట్టు సౌందర్య శోభలో కూడా అందమైన వైవిధ్యం ఉంది. భారతీయులు అందరికీ నోరూరించే పుచ్కా అనే స్ట్రీట్ ఫుడ్ బహుళ రుచులతో ఉంటుంది. గోల్‌గప్పా, జల్ పూరీ తదితర ప్రాంతీయ నామాలతో సుప్రసిద్ధమైన ఈ స్నాక్‌ను వివిధ ప్రాంతాలవారు వివిధ రీతుల్లో వండుకుంటారు.

వైవిధ్యానికి ఉన్న ప్రాధాన్యాన్ని ఒకనాటి మన రాజులు, చక్రవర్తులు గుర్తించినట్టుగా నేడు మనం గుర్తిస్తున్నామా? శివాజీ మహరాజ్ సైన్యంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. మొగల్ చక్రవర్తుల ప్రధాన సైనికాధికారులు అందరూ రాజపుత్రవీరులే. హిందూ రాజులు జైన, బౌద్ధ మతస్థులకు చేసిన దాన ధర్మాల గురించి ఈనాటికీ మనం చెప్పుకుంటూనే ఉన్నాం. రాజులు, చక్రవర్తులు వాటిని తమ రాజధర్మంలో భాగంగా గుర్తించారు. ప్రజలకు ఆమోదమైన పరిపాలననందించేందుకే వారు ఆ పుణ్య విధులు నిర్వర్తించారు. తమ సువిశాల సామ్రాజ్యాలలో ప్రజలు అందరూ ఒకే భాష మాట్లాడేవారు కాదని, ఒకే మతాన్ని అనుసరించేవారు కాదనే సత్యాన్ని నాటి మన రాజులు, చక్రవర్తులు గుర్తించారు. ఆ వైవిధ్యాన్ని గౌరవించారు, సమున్నతం చేశారు. దానశీలురు అయ్యారు. ఉదారంగా వ్యవహరించారు. బహుళ సంస్కృతీ సంప్రదాయాలను పోషించి పెంపొందించారు. దేశ దేశాల సార్థవాహులు ఈ భారత భూమికి వచ్చేందుకు సానుకూల పరిస్థితులు కల్పించారు. అపార వైవిధ్యం అలరారుతుండగా ఒకే విధమైన జీవనరీతులు లేదా సజాతీయతను కీర్తించడం ఎందుకు?

సారూప్యతకు స్థిరమైన, సార్వత్రిక నిర్వచనం లేదు. ఒక విషయాన్ని ఏ ఇద్దరు వ్యక్తులూ ఒకే దృక్కోణం నుంచి చూడరు. సజాతీయత సందర్భోచితమైనది, భావోద్వేగమైనది. అది సామాజిక, రాజకీయ శక్తులతో ప్రభావితమవుతుంది. ముఖ్యంగా రాజకీయవర్గాలు దానిని తమ స్వార్థ ప్రయోజనాలకు నేర్పుగా ఉపయోగించుకోవడం కద్దు. ఎన్నికలలో గెలవడం ముఖ్యం కదా. స్పష్టమైన, కచ్చితమైన విధానాలు ఎన్నికలలో విజయాలకు దోహదం చేయవు. ప్రజలలో ఉమ్మడి భావోద్వేగాలు, భావసారూప్యతలు లేదా కుల మతాలు, వర్గాలు, ప్రాంతాలు మొదలైన సంకుచితత్వాల ఆధారంగా ప్రజలలో విభజనలు సృష్టించడం ద్వారానే ఎన్నికలలో విజయాలు సుసాధ్యమవుతాయి.

ప్రజాసమూహాలలో సామూహికత లేదా సాధారణత్వం ఒక దేశానికి విలక్షణ గుర్తింపును సృష్టిస్తుందనే విశ్వాసం విస్తృతంగా ఉన్నది. ఆ సమష్టి గుర్తింపు జాతీయ స్వాభిమానాన్ని పెంచుతుందని, జాతీయ భద్రతకు భరోసా కల్పించడంతో పాటు, ఆర్థిక అభివృద్ధిని ఇతోధికం చేస్తుందనే విశ్వాసం కృత్రిమమైనది. బూటకపు విశ్వాసాలు ఏ సమాజానికీ ఎటువంటి ఉపకారమూ చేయవు. ఒక సమాజంలో సజాతీయతకు ఆరాటపడితే సరిపోదు. దానిని అమలుపరచవలసిన అవసరమున్నది. ఎందుకంటే సజాతీయత దానికదే ఒక ఏకీకృత శక్తి కాదు, కాలేదు. ప్రజల జీవన కార్యకలాపాలు ఒకే విధంగా ఉన్నంత మాత్రాన ఏకీకరణ సాధ్యమవుతుందా? చెప్పవచ్చినదేమిటంటే సహజంగా ఉండేది వైవిధ్యం మాత్రమే.

> మానవ ప్రవర్తన విచిత్రమైనది. ఇతర ప్రాంతాలకు చెందిన సహచరుల నుంచి తమ భాషా సంస్కృతులకు సంపూర్ణ గుర్తింపు గౌరవాన్ని డిమాండ్ చేస్తున్న వారు– విదేశాలకు చదువు, ఉద్యోగం కోసం వెళ్లినప్పుడు అక్కడి సంస్కృతిని గౌరవిస్తున్నారా?

సజాతీయతను సృష్టించాలంటే ప్రజా సమూహాలను పలు విధాలా ఒత్తిడి చేయవలసి ఉంటుంది. ఇలా అమలయ్యే సజాతీయత స్థిరంగా ఉండదు. శాశ్వతంగా ఉండడమనేది జరగదు.

సామాజిక సారూప్యతలు, భావ సారూప్యతలు ప్రజలను సమైక్యపరచలేవు. వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య పరస్పర గౌరవమే సమైక్యతకు ప్రాథమిక ప్రాతిపదిక అవుతుంది. ప్రజలు సమానత్వాన్ని ఆశిస్తారు. గుర్తింపు, గౌరవం కోసం ఆరాటమే సమానత్వాన్ని ఆశించేందుకు వ్యక్తులు, సమాజాలను పురిగొల్పుతుంది. భాష, మతం, ప్రాంతం ప్రాతిపదికన గుర్తింపులు సులభంగానే లభిస్తాయి. అయితే ఆ గుర్తింపులు శాశ్వతమైనవి కావు, సార్థకమైనవి అసలే కావు. స్థిరంగా, శాశ్వతంగా ఉండే ఏకైక విషయం మనలోని మానవత్వమే. 'అంతరంగం అట్టడుగున అంతమందిమీ మానవులమే' అని మహాకవి ఒకరు అన్నారు. మానవ నాగరికత ప్రభాతంలోనే ఈ సత్యాన్ని గుర్తించిన వేదఋషులు 'వసుధైక కుటుంబకం' (సమస్త ప్రపంచమూ ఒకే కుటుంబం) అని ఉద్ఘోషించారు. మనం ఔదలదాల్చి, ఆచరించవలసిన ధర్మమది.

◆ సమీర్ నజరేత్

(ది టెలిగ్రాఫ్)

రేపు డీటీఎఫ్ ధర్నా

పాఠశాల విద్యలో వస్తున్న మార్పులు, తీసుకొస్తున్న సంస్కరణలు అంతిమంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు బలపడడానికే పనికొస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో విద్య నానాటికీ కునారిల్లుతున్నది. విద్యార్థుల నమోదు దాదాపు యాభై శాతానికి పడిపోయింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పథకాలు ఏపీ పాఠశాల విద్యను బలోపేతం చేయలేకపోతున్నాయి. విద్యా సంవత్సరంలో పూర్తిగా చదువు చెప్పనీయకుండా ప్రమాణాల సాధన పేరుతో వంద, డెబ్బై అయిదు రోజుల ప్రణాళికలతో అకడమిక్ క్యాలెండర్ అలంకారప్రాయమైంది. అధికారులకు, ఉపాధ్యాయులకు నిర్ణీత ప్రమాణాల సాధన ఒక అభద్రతాభావాన్ని సృష్టించింది. కుదురుగా 220 పనిదినాలు టీచర్లను చదువు చెప్పనిచ్చి ఉంటే ప్రమాణాల విషయంలో ఇంతటి భయాందోళనలకు కలిగేవి కావు.

పాఠశాల విద్యలో మాతృభాషా మాధ్యమం అమలుచేయాలి; ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి; నాడు–నేడులో భాగంగా నిర్మాణాలు మధ్యలో ఆగిపోయిన పాఠశాలలకు నిధులివ్వాలి; విద్యాశక్తి ప్రోగ్రాంతో పాటు బోధనకు ఆటంకం కలిగించే వివిధ కార్యక్రమాల నిర్వహణ రద్దు చేయాలి; ఫార్మటివ్ అసెస్మెంట్ పరీక్షలు డీసెంట్రలైజ్ చేయాలి; ఉద్యోగ నియామకాలలో కాంట్రాక్టు, ఎమ్టీఎస్ విధానం రద్దు చేయాలి; స్థానిక సెలవుల ప్రకటన పాఠశాల ప్రధానోపాధ్యాయుని పరిధిలో ఉండాలి వంటి తదితర డిమాండ్లతో విద్యారంగ సమస్యల పరిష్కారం, ఉపాధ్యాయుల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం జనవరి 10న విజయవాడ ధర్నాచౌక్‌లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ధర్నా నిర్వహిస్తున్నది.

– డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్

చంద్రబాబుతో... ఆ తొమ్మిదేళ్లూ!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 1995 సెప్టెంబర్ 1న ప్రమాణ స్వీకారం చేశారు. నేనూ అదే రోజున చీఫ్ పీఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టాను. ముఖ్యమంత్రి అయిన రోజు నుంచి చంద్రబాబుకు రాష్ట్రాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టాలని, దేశదేశాల్లో ఉన్న అభివృద్ధి నమూనాలను రాష్ట్రంలో అమలు చేయాలని ఉండేది. అందుకే మొదట్లో ఆయన ఎన్నో విదేశీ పర్యటనలు చేశారు. ఆ దేశాల్లో తాను చూసిన అభివృద్ధి గురించి పత్రికల ద్వారా ప్రజలకు చేరవేయాలి అన్న తపన ఆయనలో ఎక్కువగా ఉండేది. ఆయనతో పాటు ఎన్నో దేశాలు తిరిగిన నేను ఆ వార్తలను రాష్ట్ర ప్రజానీకానికి అందించడంలో నూరుశాతం సఫలం అయ్యానని భావిస్తాను.

అప్పట్లో ఇప్పుడున్నంత టెక్నాలజీ లేదు. సెల్‌ఫోన్లు లేవు. ఇన్ని టీవీ చానెళ్లు లేవు. అలాంటి కాలంలో సమాచార నిర్వహణలో నేను పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు. 1995–2004 మధ్య కాలంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మలేషియా, సింగపూర్, అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్, దుబాయ్, ఇటలీ, లండన్ దేశాల్లో పర్యటించారు. ఈ పర్యటనల సమాచారాన్ని ఏ రోజుకు ఆ రోజు పత్రికలకు పంపి ప్రచారాన్ని కల్పించడం నా పని.

ముఖ్యంగా అమెరికా పర్యటనలు నన్ను చాలా ఇబ్బంది పెట్టాయి. చంద్రబాబు నాయుడు ఉదయం లేచిన దగ్గర నుంచి ఏవో మీటింగ్స్‌లో, పారిశ్రామికవేత్తలతో సమావేశాల్లో పాల్గొనేవారు. ఒక్కోసారి అవి రాత్రి 10 గంటల వరకు జరిగేవి. నేను ప్రతి మీటింగ్‌కూ హాజరై నోట్ చేసుకునేవాడిని, ఫొటోలు తీసుకునేవాడిని. గంపెడు వార్తలు ముందేసుకొని ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకు మేం దిగిన హోటల్లోని బిజినెస్ సెంటర్‌కు వెళ్లి, వైట్ పేపర్‌పై న్యూస్ రాసుకొని వరుసగా హైదరాబాద్‌లోని మా కార్యాలయానికి ఫ్యాక్స్ పంపేవాడిని. ఆ కార్యక్రమం రాత్రి ఒంటిగంట వరకు ఒక్కోసారి ఉదయం నాలుగు వరకు కూడా జరిగేది. మా ఆఫీసులో పీఆర్‌ఓలు నాగేశ్వరరావు, చంద్రమోహన్, గోపీనాథ్ తెల్లవారేసరికి ఆఫీసుకు చేరుకుని ఫ్యాక్స్‌లు రిసీవ్ చేసుకుని, టైప్ చేయించి అన్ని పేపర్ ఆఫీసులకు పంపేవారు. అక్కడ పగలైతే ఇక్కడ రాత్రి కదా. అర్ధరాత్రి రూమ్ చేరుకొని కేవలం మూడు నాలుగు గంటలు కునుకు తీసి, మళ్ళీ గబగబా తయారై బాబు గారితో పాటు విమానం ఎక్కి మరో స్టేట్‌కు వెళ్లేవాడిని. ఆ రెండు వారాల పర్యటనలో రాత్రి భోజనం తిన్నది చాలా తక్కువ. చివరికొచ్చేసరికి బాగా అలసిపోయాను. సరైన నిద్ర, ఆహారం లేక బక్కచిక్కిపోయాను. షుగర్ లెవెల్స్ కొండెక్కాయి. అన్ని రోజులున్నా మేము అమెరికాలో పెద్ద పెద్ద బిల్డింగ్స్, హోటల్స్, ఏయిర్‌పోర్టులు తప్ప మరి ఇంకేమీ చూసింది లేదు. ఎలాగైనా అక్కడ ఆగి అమెరికా చూడాలన్న ఆశ కలిగింది. అదృష్టం కొద్దీ నా వెంట రాధాకృష్ణ, సుధాకర్‌రెడ్డి అనే పాత్రికేయ మిత్రులు కూడా వచ్చారు. వారే చంద్రబాబు దగ్గరకు వెళ్లి– ఇంకో రెండు వారాలు ఆగి ఇండియా వస్తామని అడిగారు. ఆయన సరేనంటూ తన దగ్గర మిగిలిన కొన్ని డాలర్స్ కూడా మాకు ఇచ్చేసి వెళ్లారు. మిత్రులు సీఎం రమేశ్ సౌజన్యంతో మరో రెండు వారాలు తిరిగాం!

సెల్‌ఫోన్ లేని ఆ కాలంలో అన్ని వ్యవహారాలు ల్యాండ్ ఫోన్‌లోనే. ముఖ్యమంత్రి కార్యక్రమాలు ఆ ముందు రోజు రాత్రి 10 గంటలకు, ఒక్కోసారి 12 గంటలకు, ఒక మెసెంజర్ తీసుకువచ్చి, ఇంటి డోర్ వద్ద వేసి వెళ్లేవాడు. ఆ లోపే ప్రధాన పత్రికా రిపోర్టర్లు– సీఎం మరుసటి రోజు కార్యక్రమాల గురించి తెలుసుకునేందుకు ఎడతెగకుండా ఫోన్లు చేసేవారు. అందరికీ జవాబులు చెబుతూ ఏ అర్ధరాత్రో పడుకొని వేకువజామున నాలుగు గంటలకు లేచేవాళ్ళం. సమాచారశాఖ వారు ఒక వాహనం ద్వారా ప్రధాన పత్రిక ఆఫీసులకు నేరుగా వెళ్లి, ఆ దినపత్రికలు తీసుకువచ్చి ఒక సెట్టు నాకు, ఆ తర్వాత ముఖ్యమంత్రి గృహానికి, ఆ తర్వాత సమాచార కమిషనర్ ఇంటికి ఇచ్చేవాళ్ళు. నేను వేకువజాము నుంచి ఒక్కో పత్రికను చూసి, అన్ని రకాల వార్తలు, ముఖ్యంగా సీఎం చర్య తీసుకోవాల్సిన వార్తలన్నీ ఓ పేపర్‌పై రాసుకునేవాడిని. ఉదయం 6:30 గంటల కల్లా ముఖ్యమంత్రి ఇల్లు చేరుకొని, అన్ని టైప్ చేయించి, తొమ్మిది గంటలకు కమిషనర్, నేనూ కలిసి ముఖ్యమంత్రికి వార్తలన్నీ బ్రీఫింగ్ ఇచ్చేవాళ్ళం. ఒక్కోసారి చంద్రబాబు తానే న్యూస్ పేపర్లు తిరగేసి, ఇంటి వద్ద నుంచే ఆ వార్తలకు సంబంధించి ఆయా అధికారులతో గానీ, కలెక్టర్లతో గానీ మాట్లాడేవారు. రానురాను మేం జిల్లా పేపర్లు కూడా తెప్పించుకొని కాస్త ఆలస్యమైనా ఆయనకు బ్రీఫింగ్ చేసేవాళ్లం. చంద్రబాబు గారికి రాష్ట్ర సమగ్ర సమాచారం మొత్తం ఏ రోజుకు ఆ రోజు తెలుసుకోవాలన్న ఆసక్తి వుండేది.

> చంద్రబాబు న్యూస్ పేపర్లు తానే తిరగేసి, ఇంటి వద్ద నుంచే ఆ వార్తలకు సంబంధించి ఆయా అధికారులతో గానీ, కలెక్టర్లతో గానీ మాట్లాడేవారు. రానురాను మేం జిల్లా పేపర్లు కూడా తెప్పించుకొని, కాస్త ఆలస్యమైనా ఆయనకు బ్రీఫింగ్ చేసేవాళ్లం. చంద్రబాబు గారికి రాష్ట్ర సమగ్ర సమాచారం మొత్తం ఏ రోజుకు ఆ రోజు తెలుసుకోవాలన్న ఆసక్తి వుండేది.




పాఠకులకు, వీక్షకులకు మా తెరవెనుక కష్టం తెలిసేది కాదు. అయినా ఎవరి మెప్పు కోసమో కాకుండా పూర్తి కమిట్మెంట్‌తో పనిచేసేవాళ్ళం. ఒక చిన్న ఉదాహరణ చెప్పాలి. భారతదేశానికి మొదటిసారిగా అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ వచ్చారు. ఆ సందర్భంగా ఆయనకు చంద్రబాబును కలవాలన్న కోరిక కలిగింది. దీనికి ఓ ఫ్లాష్‌బ్యాక్ ఉంది. ఒకసారి న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్ చంద్రబాబునాయుడితో ఇంటర్వ్యూ చేయాలని హైదరాబాద్ వస్తే, నేను అతణ్ణి ఒకరోజు చంద్రబాబుతో టూర్‌కు హెలికాప్టర్ ఎక్కించాను. చంద్రబాబు కృషిని కళ్లారా చూసి, అతను న్యూయార్క్ టైమ్స్ పేపర్‌లో ఓ పెద్ద ఆర్టికల్ రాశాడు. ఆ ఆర్టికల్ చదివిన క్లింటన్ తన ప్రెస్ సెక్రెటరీని పిలిచి, ఇండియా టూర్‌లో చంద్రబాబును కలిసే ప్రోగ్రాం పెట్టాలని ఆదేశించారు. అలా ఆయన హైదరాబాద్ వచ్చారు. క్లింటన్, చంద్రబాబు కలిసి కారులో పర్యటిస్తూ, గంటకుపైగా వివిధ అంశాలను చర్చించుకున్నారు. ఆ రోజు క్లింటన్‌కు వీడ్కోలు చెప్పి, చంద్రబాబు ఇంటికి వెళుతూ నాకు ఫోన్ చేసి, వారిద్దరి మధ్య జరిగిన సంభాషణను దాదాపు అరగంట పాటు వివరించారు. అప్పటికే చీకటి పడింది. ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ ప్రెస్‌నోట్ టైప్ చేసి అందరికీ పంపడం కరెక్ట్ కాదు. ప్రతి ఒక్కరికీ ఫోన్ ద్వారా తెలియజేయాల్సిన పరిస్థితి. అలా నాలుగు గంటలపాటు ప్రతి ఒక్కరికీ, ఒక్క అంశం కూడా మిస్ కాకుండా ఫోన్లో చెప్పి ముగించాను. మరుసటి రోజు అన్ని పేపర్లలో బ్యానర్ వార్తగా ఆ అంశం కనిపించగానే ఆ సంతోషంలో వాయువేగంతో సీఎం ఇంటికి చేరుకున్నా. మా పేషీ వాళ్ల కళ్ళల్లో నేను పడిన కష్టం కనిపించింది. చంద్రబాబు మాత్రం తన ఆనందాన్ని పైకి కనిపించకుండా గుంభనంగా దాచుకున్నారు. నాకైతే ఆయన కళ్ళల్లో బిగబట్టిన ఆనందం కనిపించింది.

ఇప్పుడేముంది..! ఇంటర్నెట్, వైఫై ఫోన్లు, కెమెరా ఫోన్లు, స్పీచ్ డిక్టేషన్స్... ఇంకా ఇంకా ఎన్నో వస్తూనే ఉన్నాయి. నిమిషాల్లో ఒక వార్తను ప్రపంచంలోని అన్ని పత్రికలకు, అన్ని చానెల్స్‌కు పంపేయచ్చు. దేశవిదేశాల్లో చంద్రబాబు ప్రోగ్రాంను లైవ్ పెట్టుకొని ఇక్కడే ప్రెస్‌నోట్స్ తయారు చేసుకోవచ్చు. కానీ 1995 నుంచి 2004 వరకు ఆ తొమ్మిదేళ్ల పాటు మేము టెక్నాలజీ లేని కాలంలోనే సమాచార వెలుగులు నింపాం. బిల్ క్లింటన్, పుతిన్ వంటి ఎందరెందరో మహానుభావుల్ని హైదరాబాద్ గడ్డపై కాలు మోపేలా చేశాం.

■ డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్

మాజీ చీఫ్ పీఆర్‌ఓ





సరస్.. శుభారంభం

న్యూ ఢిల్లీ నుంచి గుంటూరుకు వచ్చిన మేళా



డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తున్న సీఎం చంద్రబాబు



స్టాల్స్ వద్ద చీరలు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



కుండల తయారీని పరిశీలిస్తున్న సీఎం

- ఆకర్షణగా నిలిచిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శన
- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన మహిళా సంఘాలు
- 'సరస్' ప్రదర్శనను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- మినీ ఇండియా కళ్ల ముందు కనిపిస్తుందన్న ముఖ్యమంత్రి

గుంటూరు సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న కళాకృతులు.. చేతితో రూపొందించిన బొమ్మలు, వస్తువులు.. ఆకట్టుకుంటున్న వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత, కళంకారీ వస్త్రాలు.. మహిళలను, యువతులను కట్టిప డేస్తున్న ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు.. నోరూరిస్తోన్న ఆహార పదార్థాలు, వంటకాలను సరస్ కేంద్రం గుంటూరువాసులకు అందుబాటులోకి తెచ్చింది. దేశంలో, రాష్ట్రంలో విభిన్న ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటుంది. కశ్మీర్ మొదలుకొని కన్యాకుమారి వరకు ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలు, ముంబై నుంచి మిజోరం వరకు తూర్పు, పశ్చిమ రాష్ట్రాల స్వయం సహాయక బృందాల రాకతో సరస్ ప్రాంగణం మినీ ఇండియాను తలపిస్తోంది. అఖిల భారత స్థాయిలో, న్యూఢిల్లీ వెలుపల ఇంత భారీ ఎత్తున సరస్ ప్రదర్శన నిర్వహించడం ఇదే తొలి సారి కావడం అదీ గుంటూరులో ఏర్పాటు చేయడం విశేషం. సేల్ ఆఫ్ రూరల్ ఆర్టిసాన్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక నల్లపాడు రోడ్డులోని మిర్చి యార్డు సమీపంలో సరస్-2026ను గురు వారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలు, సెర్ప్, డీఆర్ డీఏ సంయుక్తంగా ఎస్ఏఆర్ఏఎస్(సేల్ ఆఫ్ ఆర్టి కల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్స్ సొసైటీ) ప్రదర్శన సభ లో చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయన ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని సందర్శించి వారి బాగోగులు, ఆర్థిక పరిస్థితులు అడిగి తెలుసు కున్నారు. వివిధ స్టాళ్లను సందర్శించి మహిళా వ్యాపారుల్ని అభినందించారు. మాడుగుల హల్వా రుచి చూశారు. మహిళా సంఘాల ఉత్పత్తుల నాణ్యత, మార్కెట్ సామర్థ్యాన్ని ప్రశంసించారు. ప్రతి స్టాల్ ఒక విజయగాథను చెబుతోందని వ్యాఖ్యానించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే

(మిగతా 8వ పేజీలో)



ప్రాంగణం వద్ద సీఎంకు డప్పులతో స్వాగతం

మహిళలకు రూ.3,546 కోట్లు

స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్ ద్వారా రూ.1,375 కోట్లను, సెర్ప్ ద్వారా రూ.2,171 కోట్లను డ్వాక్రా, మెప్మా స్వయం సహాయక సంఘాలకు రుణాలుగా ముఖ్యమంత్రి అందజేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం డ్వాక్రా సంఘాల్లో 80 లక్షల మంది, మెప్మాలో 24 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, వీరు రూ.26 వేల కోట్ల నిధిని ఏర్పాటు చేశారని ప్రశంసించారు. ఈ నిధిని సద్వి నియోగం చేస్తే అపారమైన వ్యాపార అవకాశాలు అందు బాటులోకి వస్తాయన్నారు.



నాడు కూలి.. నేడు వ్యాపారం

కూలి పనులు చేసుకుంటూ జీవించే తాను ప్రస్తుతం బిర్యానీ పాయింట్ నడుపుతూ ఆదాయంతో పాటు ముగ్గురికి ఉపాధి చూపిస్తున్నట్లు తాడికొండ మండలం లాం గ్రామానికి చెందిన షేక్ జహీబా తన విజయగాథను తెలిపారు. తాను చదువు కోలేదని అయినా భర్త ప్రోత్సహించారన్నారు. డ్వాక్రా సంఘంలో చేరి రూ.1.50 లక్షల రుణంతో బిర్యానీ పాయింట్ ఏర్పాటు చేసి నెలకు రూ.20 నుంచి 30 వేల వరకు ఆదాయం రాబడుతున్నట్లు చెప్పారు. మహిళలందరికీ వె లుగు చూపించిన ముఖ్యమంత్రి వేసిన విత్తనమే నేడు డ్వాక్రా ఉద్యమంగా ఎదిగిందని కృతజ్ఞతలు తెలిపారు.







విజయంగా మలిచిన ఓటమి : పెమ్మసాని

ప్రతీ స్టాల్ ఓటమిని విజయంగా మలచిన కథను చెబు తోందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. అభివృద్ధి తపన కలిగిన ముఖ్య మంత్రి నాయకత్వంలో సరస్‌ను న్యూఢిల్లీ వెలుపల ఇంత పెద్ద స్థాయిలో నిర్వహించడం గర్వ కారణ మన్నారు. జిల్లాలో పికిల్ తదితర నాలుగు నుంచి ఐదు క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని, వాటికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.



8

ఇక పర్యాటకం పీక్స్..

- సూర్యలంక బీచ్‌కు మహర్దశ
- ఇప్పటికే స్వదేశీ దర్శన్ కింద పనులు
- కొత్తగా మూడు స్టార్ హోటళ్లకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

ముమ్మరంగా వెస్ట్ బైపాస్



8

- ఏడు నెలల క్రితమే కృష్ణానదిపై వంతెన పూర్తి
- సాగుతున్న కాజ జంక్షన్ అనుసంధాన పనులు
- నెలాఖరునాటికి ఒకవైపు రాకపోకలు సిద్ధం

రౌడీషీటర్‌కు జీవిత ఖైదు.. జరిమానా

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను హత్య చేసిన కేసులో నిందితుడైన రౌడీషీటర్ శివరాత్రి శ్రీనివాసరావుకు కోర్టు జీవిత ఖైదు, రూ. 500 జరిమాన విధించింది. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న ఓ వివాహితపై కార్మికులకాలనీకి చెందిన రౌడీషీటర్ శివరాత్రి శ్రీనివాసరావు (33) వేధింపులకు పాల్పడేవాడు. ఆమె ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న శ్రీనివాసరావు 2014 డిసెంబరు 23న బాధితురాలిపై ఆమె ఇంట్లో కత్తితో దాడి చేశాడు. బాధితురాలిని రక్షించేందుకు అడ్డొచ్చిన ఆమె తల్లిని కిరాతకంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటనపై లాలాపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. విచా రణ అనంతరం, నిందితుడిని దోషిగా నిర్ధారించిన 2వ అదన పు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి వై.నాగరాజ నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

భార్యను చంపిన రౌడీషీటర్‌కు కూడా..

అనుమానంతో భార్యను కిరాతకంగా హత్య చేసిన కేసులో నిందితుడైన రౌడీషీటర్ కోట వెంకట తిరుపతిరావు అలియాస్ తిరుపతయ్య (31)కు కోర్టు జీవిత ఖైదు విధించింది. శ్రీనివాసరావుతోటకు చెందిన కోట శిరీష (24)ను రౌడీషీటర్ అయిన ఆమె భర్త కోట వెంకట తిరుపతి రావు అలియాస్ తిరుపతయ్య అనుమానంతో వేధిస్తూ వచ్చాడు. భార్య విడాకుల కోసం కోర్టును ఆశ్రయించగా కక్ష పెంచుకొని 2021లో భార్యపై కిరాతకంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటనపై నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన మూడో అదనపు సెషన్స్ కోర్టు జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు నిందితుడిని దోషిగా నిర్ధారించి, అతనికి యావజ్జీవ కారాగార శిక్ష, వెయ్యి జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారు.

చెప్పినట్లుగానే రాజధాని నిర్మాణం

- పెదమద్దూరు గ్రామసభలో మంత్రి నారాయణ
- 313 ఎకరాలకు అంగీకారపత్రాలిచ్చిన 80 మంది రైతులు

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భూములు ఇచ్చిన రైతులకు హామీ ఇచ్చినట్లుగా మూడేళ్లలో ప్రపంచంలో కెల్లా మేటి నగరాల్లో ఒకటిగా రాజధాని అమరావతిని నిర్మించి తీరుతామని మంత్రి నారాయణ చెప్పారు. రెండో విడత భూ సమీకరణ కార్యక్రమం గురువారం అమరావతి మండలం పెదమద్దూరులో గ్రామసభ నిర్వహించారు. 313 ఎకరాల భూమికి సంబంధించి సుమారు 80 మంది రైతులు అంగీకార పత్రాలను మంత్రి ద్వారా సీఆర్డీఏ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామసభలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై నమ్మకంతో రైతులు సమీకరణ ద్వారా భూములు ఇచ్చేందుకు సిద్ధమయ్యారన్నారు. నెలరోజుల్లో 80 శాతం భూసమీకరణ పూర్తి అయితే మూడు నెలల్లో లే అవుట్లు వేసి రైతులకు ప్లాట్లు కేటాయిస్తామన్నారు. ఆరునెలల్లో అంతర్జాతీయ క్రీడా నగర పనులను కూడా ప్రారంభిస్తామన్నారు. రైతుల వినతి మేరకు రూ.1.5 లక్షల రుణమాఫీ, కౌలు పెంపు, నాలుగు గ్రామాలు యూనిట్‌గా ప్లాట్ల కేటాయింపు, మూడేళ్లలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ రాజధాని అమరావతి అభివృద్ధికి భూములు ఇచ్చిన రైతుల సమస్యల సత్వర పరిష్కారానికి ముఖ్యమంత్రి, మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, సీఆర్డీఏ డీడీ చెన్నకేశవరావు, డిప్యూటీ కలెక్టర్ లలిత, తహసీల్దారు డానియేలు, జాస్తి వీరాంజనేయులు పాల్గొన్నారు.



పెదమద్దూరులో మంత్రి నారాయణకు ఫాం 1 పత్రాలు అందజేస్తున్న రైతులు

జగన్‌వి అసత్య ప్రేలాపనలు


అమరావతి నిర్మాణానికి కొనసాగుతున్న భూసమీకరణకు రైతుల నుంచి వస్తున్న స్పందన చూసి తట్టుకోలేక మాజీ ముఖ్యమంత్రి జగన్ అసత్య ప్రేలాపనలు చేస్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు. గ్రామసభ అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములు ఇచ్చే విషయాన్ని జగన్ గుర్తించి మాట్లాడాలని హితవు పలికారు. ఎండ్రాయిలో రైతులు 21 శాతం భూములు ఇచ్చారని తెలిసి తట్టుకోలేక అమరావతిపై తన కోపాన్ని కనబర్చారన్నారు. రాజధాని నదిలో కట్టడం లేదని జగన్మోహనరెడ్డి తెలుసుకోవాలన్నారు. గుంటూరు, విజయవాడ నగరాలకు మధ్యలో అంటున్న జగన్‌కి రాజధాని ఎక్కడ కడుతున్నదో కూడా తెలియడం లేదన్నారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ నూతనంగా భూసమీకరణ చేస్తున్న గ్రామాలకు దక్షిణంగా అంతర్జాతీయ విమానాశ్రయం, ఉత్తరంగా అంతర్జాతీయ క్రీడా నగరం, తూర్పులో రైల్వేలైను, ఇన్నర్‌రింగ్ రోడ్డు, పడమర వైపు న ఔటర్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ నుంచి మచిలీ పట్నం పోర్టుకు గ్రీన్ ఫీల్డ్ రహదారి వస్తుందన్నారు.

భూ సేకరణకు.. నోటిఫికేషన్

12.5758 ఎకరాలకు జారీ చేసిన కలెక్టర్



గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో అత్యంత కీలకమైన సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణం కోసం ఏపీసీఆర్డీఏ భూసేకరణకు సిద్ధమైంది. ఆమేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా నోటిఫికేషన్ జారీ చేశారు. సీడ్ యాక్సిస్ రహదారి నిర్మించే క్రమంలో సీఆర్‌డీఏ గతంలో భూ సమీకరణ ద్వారా భూములు తీసుకుంది. అయితే ఉండవల్లి, పెనుమాక, మందడం, రాయపూడి- 1, 2పరిధిలో కొంతమంది ముందుకు రాలేదు. ఈ కారణంగా రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. దీంతో సీ ఆర్డీఏ కమిషనర్ కన్నబాబు ఆ గ్రామాల్లో అవసరమైన భూమి కోసం భూసేకరణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరగా నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఉండవల్లిలో 10.5018 ఎకరాలు, పెనుమాకలో 0.6500 ఎకరాలు, మందడం-1లో 0.7000 ఎకరాలు, రాయపూడి- 1లో 0.4710 ఎకరాలు, రాయపూడి-2లో 0.2530 ఎకరాలు, మొత్తం- 12.5758 ఎకరాల భూమిని సేకరిం చనున్నారు. అయితే రైతులు, భూయజమానులు భూ సమీకరణ కు ముందుకొస్తే భూసేకరణ ఉండదని తెలిపారు.



కుళాయి.. కలెక్షన్లు

పునరుద్ధరణ పేరుతో వసూళ్లు

- కాల్వ తవ్వకాలతో గృహ యజమానులను పిండేస్తున్న ఫిట్టర్లు
- సైజు పెంచుతామని, పైపులైన్ లోపల నిప్పల్ పెడతామని వల

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సైడు కాల్వలు, రోడ్ల నిర్మాణం అంటూ కుళాయి పైపులైన్లను నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లు అడ్డగోలుగా తొలగిస్తున్నారు. వాటి పునరుద్ధరణ కోసం సంబం ధిత గృహ యజమానులు జేబుకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి నగరంలో నెలకొంది. రోడ్లు, కాల్వల పనులు ఇళ్ల యజమానులకు ఆర్థికంగా భారం మోపుతోండగా కొంతమంది ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు, ఫిట్టర్లు, గుంతలు తవ్వే వారికి కాసులు కురిపిస్తున్నాయి. కుళాయి కనెక్షన్ పునరుద్ధరణకు రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు. పైపులైన్ల తొలగింపుతో కొన్ని రోజుల పాటు ఆయా వీధుల్లోని ప్రజలు తాగునీటికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు తవ్విన తర్వాత కుళాయి పైపులైన్ పునరుద్ధరిస్తామని కార్పొరేషన్ సిబ్బంది గృహ యజమానులతో బేరం కుదుర్చుకుంటున్నారు. మెటీరియల్ తామే ఇస్తామని, గుంత తవ్వినందుకు, ఫిట్టింగ్‌కు రూ.3 వేల ఇవ్వాలని కోరుతున్నారు. నీళ్లు బాగా వచ్చేలా పైపులైనులో నిప్పల్ అమర్చుతామని, ఫెరోల్ లేకుండా చూస్తామని చెబుతూ అదనంగా మరో రూ.1500 వరకు వసూలు అడుగుతున్నారు. అయితే అప్పటికే నీటి కోసం తీవ్రంగా ఇబ్బంది పడుతున్న వారు సులభంగా సిబ్బంది చెప్పినట్లు చేస్తున్నారు. ఏటీఅగ్రహారం, గుజ్జనగుండ్ల, స్తంభాలగరువు, హెచ్ఎల్ఆర్ తదితర రిజర్వాయర్ల పరిధిలో కొన్ని వారాల నుంచి ఈ తరహా వసూళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రస్తుతం కంకరగుంట ఆర్వోబీ పక్కన రోడ్డు, కాల్వను తవ్వుతుండగా అక్కడ కమర్షియల్ ట్యాప్స్‌కి ఒక్కో దానికి రూ.6,500 వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు, ఫిట్టర్లు ఈ బాధ్యతలను పర్యవేక్షించాలి. అయితే ఒక అవుట్‌సోర్సింగ్ గ్యాంగ్‌మన్ అన్ని తానై వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. నగరపాలకసంస్థ అధికారులు ఈ అక్రమ వసూళ్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది.

ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి రూ.165 కోట్లు

● ఆమోదం తెలిపిన క్యాబినెట్ కమిటీ

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని పిచ్చికలపాలెం గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ' నిర్మాణ అవసరాలకోసం రూ. 165.33 కోట్లు కేటాయింపుకు క్యాబినెట్ కమిటీ గురువారం ఆమోదం తెలిపింది. అకాడమి నిర్మాణం, బాహ్య విద్యుదీకరణ, ప్లంబింగ్, మౌలిక సదుపాయాలు సహా అన్ని పనులకు రూ.165.33 కోట్ల మొత్తానికి పరిపాలనాత్మక ఆమోదం కల్పించడానికి కమిటీ అనుమతి ఇచ్చింది. 2 సంవత్సరాల డీఎల్‌పీతో కలిపి కాంట్రాక్ట్ పద్ధతిలో టెండర్లు పిలవడానికి అనుమతి కల్పించింది.

రాజధాని అమరావతిలో నాబార్డు బృందం

● జరుగుతున్న పనులపై సంతృప్తి

తుళ్లూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) బృందం గురువారం సందర్శించింది. దాదాపు రూ.55 వేల కోట్లతో నిర్మాణ సంస్థలు చేపట్టిన పనులను పరిశీలించింది. రాజధాని అమరావతి అభివృద్ధికి నాబార్డు గతంలో రూ. 7387. 70 కోట్ల ఆర్థిక సహకారం అందించింది. ఈ నిధులలో కొంతమేర రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల కాగా, ఏపీ సీఆర్డీఏ, ఏడీసీఎల్ ఆధ్వర్యంలో అమరావతిలో 9 ప్రాజెక్టులను చేపట్టడం జరిగింది. ఆయా ప్రాజెక్టు సైట్లలో నిర్మాణ పనుల పురోగతిని అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీజీఎంకి ఆయా ప్రాజెక్టు వద్ద ఏడీసీఎల్ ఎస్ఈ నరసింహ, సీఆర్డీఏ(అకౌంట్ విభాగం) కంపెనీ సెక్రటరీ కె.రాజేష్‌బాబు రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును వివరించినట్లు కమిషనర్ కార్యాలయం పేర్కొంది.



వివరాలు తెలుసుకుంటున్న నాబార్డు బృందం

విజ్ఞాన్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



రైతును సత్కరిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు (విద్య) జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సాంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన, పట్టు పరిశ్రమల సాగును చేపట్టడం ద్వారానే రైతులకు ఏడాది పొడవునా సుస్థిర ఆదాయం లభిస్తుందని ఏపీ వ్యవసాయ కమిషనరేట్, ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ వర్సిటీలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఏపీ అటవీ శాఖ ప్రభుత్వ సలహాదారు ఎం.మల్లికార్జునరావు, విజ్ఞాన్ వర్సిటీ వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, స్టార్టప్‌లు గ్రామీణ యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆచార్య పి.నాగభూషణ్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ కె.ధనుంజయ రావు, ఐసీఏఆర్ డైరెక్టర్, ఉపకులపతి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, వీసీ ఆచార్య నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కుర్రా అప్పారావు స్వాగతం



సీఎంను కలిసిన కుర్రా

గుంటూరు (తూర్పు), జనవరి8 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఆదర్శనగర్‌లో గురువారం నిర్వహించిన జాతీయ స్థాయి సరస్ మేళా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు గుంటూరు మిర్చి యార్డు కుర్రా అప్పారావు ఘన స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా యార్డును తిరిగ గాడిలో పెట్టేందుకు కృషి చేయాలని కుర్రా అప్పారావును ముఖ్యమంత్రి సూచించారు. అలాగే.. కుర్రా అప్పారావును మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ అభినందించారు. బృందావన్‌గార్డెన్స్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

రైతులకు రుణ మంజూరులో ఉదారత

● జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన



మాట్లాడుతున్న ఛైర్మన్ మక్కెన

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రైతులకు రుణాలందించడంలో సొసైటీ అధ్యక్షులు ఉదారంగా వ్యవహరించాలని జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కోరారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని సొసైటీ ఛైర్మన్ల శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఛైర్మన్లు సొసైటీ విధివిధానాలు, నిబంధనలు పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. రైతులకు సేవలందించడంలో రాజీ పడకూడదని సూచించారు. జిల్లాలోని పలు సొసైటీల్లో రుణ బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయని, రికవరీలో చొరవ చూపాలన్నారు. బ్యాంకు సీఈవో వీవీఎస్ ఫణికుమార్ మాట్లాడుతూ సొసైటీల్లో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. నాబార్డు డీడీఎం శరత్, ఓఎస్డీ విజయలక్ష్మి అధికారులున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శంగా నిలవాలి

● ఎగ్జిక్యూటీవ్ వైస్ ఛైర్మన్ విజయ కుమార్

బెల్లంకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయం దేశంలోనే ఆదర్శంగా నిలవాలని రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయకుమార్ పేర్కొన్నారు. గురువారం బెల్లంకొండలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన సందర్శించారు. నాగిరెడ్డిపాలెం గ్రామంలో న్యూఢిల్లీ బృందం పర్యటించింది. అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలోని తొమ్మిది సార్వత్రిక సూత్రాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం కింద అమలవుతున్న ఏటీఎం మోడల్ న్యూట్రీ గార్డెన్‌ను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రైతులతో పాటు సిబ్బందితో ప్రకృతి వ్యవసాయ విధానాలు, ఆరోగ్యం, పోషణ అంశాలపై చర్చించారు. ఆరు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ రోజుకు సుమారు రూ.5వేలు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. పల్నాడు జిల్లాలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల అమలు తీరును న్యూఢిల్లీ బృందం ప్రశంసించింది. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ బృందం ఫౌండేషన్ ప్రతినిధులు జర్నల్ సింగ్, రోహిణి చతుర్వేది, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. అమలకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

ఎస్ఆర్ఎం వర్సిటీలో ఏఐ ఇన్‌స్టిట్యూట్

● రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో క్వాంటమ్ సెంటర్

● వైస్ చాన్సలర్ సతీష్‌కుమార్

తుళ్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కార్నెగీ మెల్ యూనివర్సిటీ(సీఎంయూ)తో భాగస్వామ్య ఒప్పందం చేసుకుందని వైస్ చాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం విజయవాడలో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన మీడియాకు పలు వివరాలు వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు విశేషమైన ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో ఎస్ఆర్ఎం వర్సిటీలో ఏఐ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం కార్నెగీ మెలన్ యూనివర్సిటీ సహకారం తీసుకుంటున్నామని చెప్పారు. మూడేళ్ల కాల పరిమితికి ఎంవోయూ చేసుకున్నామని, దీనివల్ల ఫ్యాకల్టీ కెపాసిటీ బిల్డింగ్, సంయుక్త పరిశోధనలు, విద్యార్థుల ఇంటర్న్‌షిప్ మెరుగవుతాయన్నారు. ఇప్పటికే ప్రొఫెసర్లు కార్నెగీ మెలన్ వర్సిటీలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం పూర్తి చేశారని, ఈ వారంలో మరో నాలుగు వెళ్లేందుకు సిద్ధమయ్యారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో త్వరలో క్వాంటమ్ రిఫరెన్సు సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నామని సతీష్ కుమార్ చెప్పారు. ఎమర్జింగ్ టెక్నాలజీ ప్రోగ్రామ్స్‌ను ఏర్పాటు చేసే చర్యల్లో భాగంగా డిఫెన్స్ ఇంజినీరింగ్, ఫైనాన్సియల్, సెమీ కండక్టర్, హెల్త్ ఇంజినీరింగ్ కోర్సులను ప్రారంభించనున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ సినీ టామ్, రిసెర్చ్ డీన్ రంజిత్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ శివశంకర్, చీఫ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్ శంతన్ గార్గ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ సతీష్ కుమార్

చేపల వృద్ధికి ఆక్వాపల్స్ దోహదం: సీఈవో చంద్ర

మంగళగిరి సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏఐ, ఐఓటీ ఆధారిత ఆక్వాపల్స్ పరికరం ద్వారా నీటి నాణ్యత, చేపల ఆరోగ్యం, వృద్ధి వంటి కీలక అంశాలను నిరంతరం పర్యవేక్షించవచ్చని ఆక్వాపల్స్ వ్యవస్థాపకుడు, సీఈవో జి.చంద్ర ఆదిత్య తెలిపారు. అడ్వాన్స్‌డ్ సెన్సార్ ఏఐ స్టార్టప్ సంస్థ రూపొందించిన ఆక్వాపల్స్ ఉత్పత్తిని గురువారం మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఆవిష్కరించారు. చంద్ర ఆదిత్య మాట్లాడుతూ ఆక్వా రైతులకు ఆధునిక సాంకేతిక పరిష్కారాలు అందించాలనే లక్ష్యంతో ఆక్వాపల్స్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఈ పరికరం సుమారు 16 ముఖ్యమైన పరిమితులను కొలిచే సామర్థ్యం కలిగి ఉందని, ఆక్వా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. మత్స్య శాఖ కమిషనర్ రామ్ శంకర్ నాయక్ , ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ కోఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ఆక్వా రంగం అభివృద్ధికి దోహదపడే సాంకేతిక ఆవిష్కరణలు స్వాగతించదగినవని పేర్కొన్నారు. రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే ఈ తరహా ప్రయత్నాలను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఈ క్యాక్రమంలో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లాల్ మొహమ్మద్, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పీ.రామమోహన్‌రావు, సురేష్, ఆక్వా రైతులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.



ఆక్వాపల్స్ ఆవిష్కరణలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

అవకాశవాద రాజకీయాలకు నిదర్శనం జగన్ : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు, జనవరి8(ఆంధ్రజ్యోతి): అవకాశవాద రాజకీయాలకు నిదర్శనం జగన్‌రెడ్డి అని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గురువారం ఆరోపించారు. అమరావతిపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అప్రజాస్వామికమని, బాధాకరమని ఖండించారు. రాష్ట్ర రాజధాని అమరావతిపై పార్లమెంట్లో చట్టబద్ధ ప్రక్రియ ముందుకు సాగుతున్న కీలక సమయంలో వైసీపీ అధినేత జగన్ రెడ్డి అబద్ధాలే ఆధారంగా చేసుకొని ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం తీవ్రంగా ఖండించదగ్గ చర్యగా పేర్కొన్నారు. నదీ గర్భంలో రాజధాని నిర్మాణం వంటి పూర్తిగా అసత్యమైన వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసి కేంద్రానికి సుప్రీకోర్టుకు తప్పుడు సంకేతాలు పంపే కుట్రను జగన్ రెడ్డి మళ్లీ పునరావతం చేశారని దుయ్యబట్టారు. రాజధాని ప్రాంతం నదీ గర్భం కాదని దానికి సంబంధించిన ప్రతి అధ్యయనం సాక్ష్యమేనని జగన్‌కు తెలిసి కూడా పదేపదే అమరావతి మీద కుట్రలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఒకప్పుడు రాజధాని అనే పదమే లేదు సీఎం కూర్చునే చోటే రాజధాని అని చెప్పిన వ్యక్తి ఇప్పుడు మరోసారి అదే మాటలను మార్చి మాట్లాడటం ఆయన ద్వంద వైఖరి అస్థిరతను తెలియజేస్తుందన్నారు. జగన్ రెడ్డి అమరావతిని సో కాల్డ్ క్యాపిటల్ అని పిలవడం, అక్కడి 29 గ్రామాల రైతుల భావాలను మాత్రమే కాదు ఐదు కోట్ల ప్రజలను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది జగన్ రెడ్డి నీచ రాజకీయ సంస్కృతికి ప్రతిబింబంగా పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తులో చెలగాటమాడే హక్కు ఏ ఒక్కరికి లేదని సహించే అంశం కాదన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును ఆయన ఇంకా అర్థం చేసుకోలేదని. జగన్ రెడ్డి వ్యాఖ్యలతో స్పష్టమవుతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	170, 179, 190
చికెన్ విత్ స్కిన్(కిలో)	330.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	340.00

మిర్చియార్డు సమాచారం

(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	60,531
అమ్మకాలు	59,525
నిల్వ	15,743

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	19000
నెంబరు. 5	13500	18200
273	----	----
341	14000	20500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11500	15000
షార్క్-1	-----	----
బ్యాడిగి	13000	18000
దేవనూరు డీలక్స్	13500	20500
ఆర్మూరు	12000	13500
ఏసీ కామన్ వెరైటీ		
334	12000	18000
నెంబరు. 5	13000	17500
273	----	----
341	13000	19000
4884	----	----
సూపర్ 10	13000	18200
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
బ్యాడిగి 355	10000	16500
దేవనూరు డీలక్స్	10500	16000
తాలుకాయలు	5000	7700

భారతీయ విజ్ఞాన చరిత్రలో ఆచార్య నాగార్జునుడిది విశిష్ట స్థానం

● ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు

● ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ఏఎన్‌యూ జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రాచీన భారతీయ విజ్ఞాన చరిత్రలో ఆచార్య నాగార్జునుడికి విశిష్ట స్థానం ఉందని ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి కంచర్ల గంగాధర రావు అన్నారు. వర్సిటీ రసాయనశాస్త్ర విభాగం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జునుడి ఆల్కెమికల్ వారసత్వం సాంప్రదాయిక, ఆధునిక దృక్పథాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సభకు జాతీయ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ దిట్టకవి రామచంద్రన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి వీసీ గంగాధరరావు మాట్లాడుతూ.. ప్రధానంగా మెటలర్జీ, కెమికల్ ఇంజినీరింగ్, ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాల్లో నాగార్జునుడి ఆలోచనలు ప్రేరణగా మారినట్లు తెలిపారు. ఆయుర్వేదం, సిద్ధ వైద్యం వంటి రంగాలపై ఆయన ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని చెప్పారు. లోహాల శుద్ధి, ఔషధాల తయారీ వంటి అంశాల్లో నాగార్జునుడి కృషి భారతీయ శాస్త్రీయ వారసత్వానికి ప్రతీకగా నిలిచిందని వివరించారు. రసాయన శాస్త్రానికి మూలాలైన ఆల్కెమి రంగంలో ఆయన చేసిన పరిశోధనలు నేటి శాస్త్రవేత్తలకు ఆదర్శనీయమని తెలిపారు. సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ రామచంద్రన్ మాట్లాడుతూ... తమిళనాడు, కేరళ, తెలంగాణ, న్యూఢిల్లీ, కర్ణాటక వంటి పలు రాష్ట్రాల నుంచి సుమారు 300 మందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొని, పరిశోధన పత్రం సమర్పించారని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో శాస్త్రీయ చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో సదస్సు జరిగిందన్నారు. జబల్పూర్, మంగళాయతన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రయోగాత్మక దృక్పథం, పరిశీలన పద్ధతులు, శాస్త్రీయ తత్వం నాగార్జునుడి రచనలలో స్పష్టంగా కనిపిస్తాయని పేర్కొన్నారు. అనంతరం పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. చాణిక్య ఎడ్యుకేషన్ హబ్ ప్రతినిధి డాక్టర్ ఇంకుర్తి వెంకట్, రిజిస్ట్రార్ జి.సింహాచలం, మాజీ రిజిస్ట్రార్ జి.రోశయ్య, ఓఎస్డీ ఆచార్య ఆర్వీ ఎస్ఎస్ఎన్. రవికుమార్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

భూసమీకరణకు ఓకే.. కానీ!

● ప్రభుత్వం మారితే మా పరిస్థితేంటి?

● గత ప్రభుత్వ నిర్వాకంతో రైతుల్లో ఆందోళన

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రెండో దశ భూసమీకరణ ప్రక్రియ బుధవారం విజయవంతంగా ప్రారంభమైంది. రాష్ట్ర పురపాలక శాఖమంత్రి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వడ్డమాను, పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని యండ్రాయి గ్రామాల్లో రైతులు స్థానిక ఎమ్మెల్యేల సమక్షంలో మంత్రికి స్థానిక రైతులు భూసమీకరణ ఆమోద పత్రాలు అందజేశారు. భూసమీకరణకు ఆమోదం తెలుపుతూనే రైతులు పలు అనుమానాలు, ఆందోళనా వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తొలివిడత భూసమీకరణలో భూములిచ్చిన రైతులు పడ్డ కష్టాలను చూసి తమకు భద్రత కావాలని రైతులు మంత్రిని కోరారు.

● భరోసా కల్పించండి!

రాజధాని అమరావతిలో తొలివిడత భూసమీకరణ కింద 2015లో 29వేల మంది రైతుల నుంచి 34వేల ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం సమీకరించింది. కాగా ఇప్పుడు మరో 20,494 ఎకరాల భూమిని రెండో విడత పూలింగులో సమీకరిస్తోంది. ఇందులో 16,666.57 ఎకరాలు రైతుల నుంచి సమీకరిస్తున్నారు. దీనికి సంబంధించి మెజారిటీ రైతులు భూసమీకరణకు ముందుకు వచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం పోయిన ఐదేళ్లలో రైతులను పెట్టిన ఇబ్బందులను చూసి వారు మంత్రి దగ్గర తమ అనుమానాలు వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణాన్ని ఆపేసి, ఐదేళ్లపాటు రైతులను అనేక రూపాల్లో ఇబ్బందులకు గురిచేసి, వార్షిక కౌలు చెల్లింపులు నిలిపేసి, రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధిని నిలిపేసి రైతులను గత ప్రభుత్వం వేధించిన తీరును వారు మంత్రి దగ్గర ప్రస్తావించారు. ఆ అనుభవాల నేపథ్యంలో తమకు భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మళ్లీ మూడేళ్ల తరువాత ప్రభుత్వం మారినా తమకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని మంత్రిని అడిగారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడంతోపాటు, ఈ మూడేళ్లలోనే తమ ప్లాట్లను అభివృద్ధి చేసి తమకు అందించాలని వారు మంత్రిని కోరారు. అలా చేస్తే తమకు భరోసా ఉంటుందని చెప్పారు. రెండో దఫా సమీకరించే భూమిని అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వేట్రాక్, స్మార్ట్ పరిశ్రమలు, క్రీడా నగరం, ఇన్నర్ రింగ్‌రోడ్ నిర్మాణానికి వినియోగిస్తారు.

● కౌలు, పింఛను ప్రతి ఏటా పెంచాలి!

రాజధాని రైతులకు ఇచ్చే వార్షిక కౌలు గతంలో మాదిరిగా ఇస్తే సరిపోదని రైతులు చెప్పారు. గతంలో జరీబు పొలానికి ఎకరానికి రూ. 50వేలు, మెట్ట పొలానికి ఎకరాకు రూ. 30వేలు వార్షిక కౌలు చెల్లించారు. ప్రతి ఏటా 10 శాతం కౌలు పెంచి చెల్లించేవారు. కాగా ఇప్పుడు కూడా అదే విధంగా కౌలు ఇస్తే సరిపోదని, మారిన పరిస్థితులు, ధరలకు అనుగుణంగా కౌలు పెంచి ఇవ్వాలని, ఏటా పెంపుదల ఉండాలని కోరారు. ఈ విషయాన్ని మంత్రి, సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని సీఎం చెప్పారు. అయితే రైతుల పంట రుణాలను లక్షన్నర రూపాయల వరకూ రుణమాఫీ చేస్తామని మంత్రి రైతులకు తెలిపారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. అయితే భూమిలేని పేదలకు ఇచ్చే పింఛనుపై కూడా డిమాండ్లు వచ్చాయి. ప్రస్తుతం ఇస్తున్న పింఛను మొత్తం రూ. 5 వేలు చొప్పున తమ గ్రామాల్లో కూడా పింఛను ఇవ్వాలని, ప్రతి ఏటా పింఛనును 10 శాతం పెంచాలని గ్రామస్థులు మంత్రిని కోరారు. కాగా రెండో దఫా పూలింగులో సమీకరించే భూమిని అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వేట్రాక్ నిర్మాణం, స్మార్ట్ పరిశ్రమలు, క్రీడా నగరం, ఇన్నర్ రింగ్‌రోడ్ నిర్మాణానికి వినియోగిస్తారు.

నేడు టీడీపీ కార్యాలయంలో ముగ్గుల పోటీలు

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నామని తెలుగు మహిళా నేతలు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచినవారు తమ పేర్లు నమోదుచేసుకోవాలని కోరారు. తెలుగు మహిళలు సంక్రాంతి ముగ్గుల పోటీలలో పాల్గొని పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గంటా మౌలిక, శివజ్యోతి, నంది సరస్వతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ సమస్యలపై అవగాహన సభ

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం దంత, చెవి, ముక్కు, గొంతు సమస్యలపై అవగాహన సభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ఈఎన్‌టీ వైద్యురాలు డాక్టర్ శ్రావ్య కొమ్మినేని హాజరై సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారన్నారు.



ఉపాధ్యాయులతో డీఈవో సలీం బాష

స్కౌట్స్‌గైడ్స్ శిక్షణ తరగతులు డీఈవో పరిశీలన

గుంటూరు విద్య జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) షేక్ సలీం బాష పరిశీలించారు. గుంటూరు పీఎం శ్రీ మోడల్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు ఏడు రోజుల బేసిక్, అడ్వాన్స్ కోర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఈవోతో పాటు జిల్లా సెక్రటరీ ఎం.ఏడుకొండలు, జాయింట్ సెక్రటరీ కామాక్షి, రిసోర్స్ పర్సన్స్ మహాదేవమ్మ శకుంతల, గిరిజాకుమారి, వర కమలాదేవి, ఎస్‌వోసీ శ్రీనివాసరావు, స్కౌట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంజుమన్ స్థలాలపై ఏకపక్ష నిర్ణయాలు తగవు

● వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంజుమన్ ఇ ఇస్లామియా సంస్థకు చెందిన భూములపై ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే సహించేదిలేదని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ అన్నారు. దీనిపై రాష్ట్రస్థాయిలో నిరసనకు సిద్ధమవుతామని ఆయన పేర్కొన్నారు. అంజుమన్ సంస్థకు చెందిన 71.57 ఎకరాల భూములను ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో స్వాధీనం చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలన్నారు. ఇందులో భాగంగా అంజుమన్ భూముల వ్యవహారాన్ని గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. అంజుమన్ ఆస్తుల సంరక్షణకు అండగా ఉంటామని జగన్ హామీ ఇచ్చారన్నారు.

నేడు డాక్టర్ డీఎల్ఎన్ ప్రసాద్ అంత్యక్రియలు



డాక్టర్ ప్రసాద్ (ఫైల్)

హైదరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బుధవారం కన్నుమూసిన ప్రముఖ వైద్యులు డాక్టర్ దొడ్డపనేని లక్ష్మీనారాయణప్రసాద్(95) అంత్యక్రియలు శుక్రవారం మహాప్రస్థానంలో జరగనున్నా యి. 1930లో గుంటూరు జిల్లా తెనాలిలో వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆయన 1961లో ఎంబీబీఎస్, 1964లో ఎంఎస్ జనరల్ సర్జరీని ఆంధ్ర మెడికల్ కాలేజీ విశాఖపట్నం నుంచి పూర్తిచేశారు. 1969లో ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన సఫ్దర్ జంగ్ ఆస్పత్రిలో ప్లాస్టిక్ సర్జరీలో శిక్షణ పొందారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆస్పత్రి, గుంటూరు, కర్నూలు మెడికల్ కాలేజీలలో ప్లాస్టిక్ సర్జరీ విభాగాల ఏర్పాటులో ఆయ న కీలకపాత్ర పోషించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయనపై అగంతకుడు కత్తితో దాడిచేయగా ఆయన చేతివేలుకు ప్లాస్టిక్ సర్జరీ చేశా రు. ఆయన భార్య ఇందిర తెనాలి నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, పెద్ద కుమార్తె గోగినేని ఉమ తెనాలిలో గైనకాలజిస్టుగా వైద్యసేవలందిస్తున్నారు. గతంలో ఆమె ఎమ్మెల్యేగా సేవలు అందించారు. చిన్నకుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారు.

పెమ్మసానిని చూసి గర్వపడుతున్నా

● సరస్ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు

గుంటూరు సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను చూసి తాను గర్వపడుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. స్థానిక నల్లపాడు రోడ్డులోని మిర్చి యార్డు సమీపంలో సరస్-2026ను గురువారం ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా తన ప్రసంగంలో పెమ్మసానితో పాటు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. పెమ్మసాని గుంటూరు ఇక్కడి నుంచి అమెరికా వెళ్లి చదువుకుని వ్యాపారాలు చేసి బాగా సంపాదించారన్నారు. దేశంలోని పార్లమెంట్ సభ్యుల్లో ఆయనే అత్యంత సంపన్నుడని తెలిపారు. మంచి పేరు రావాలన్నా, ప్రజలకు సేవ చేయాలన్నా రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించగానే పెమ్మసాని వచ్చారన్నారు. సునాయసంగా



సరస్ మేళాలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు

గెలిచి కేంద్ర మంత్రి కూడా అయ్యారన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తాత ఎంపీగా సేవలందించారని, ఇప్పుడు శ్రీనివాస్ తొలిసారి ఎమ్మెల్యే అయ్యి ఆ వెంటనే జాక్‌పాట్ కొట్టి మంత్రి అయ్యారన్నారు. ఆయన తన శక్తి, సామర్థ్యాలను నిరూపించుకోవాలన్నారు. పెమ్మసాని తన విజయానికి అనుసరించిన మార్గదర్శకాలను మహిళలకు చెప్పాలన్నారు. సెర్ప్ సీఈవో బీ కరుణ కూడా గట్టిగా పని చేస్తున్నారన్నారు. ఈ ముగ్గురికి 'ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యాలను నిర్దేశిస్తున్నానని చెప్పారు.

ముఖ్యమంత్రికి స్వాగతం..

సరస్ మేళాకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. గుంటూరు పెరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు వెళ్లి గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ ముఖ్యమంత్రికి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.



జీటీ రోడ్డులో పోల్స్ షిఫ్టింగ్ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ రమేష్ తదితరులు

సరస్‌కు నిరంతర విద్యుత్ సరఫరా

● ప్రత్యేక బృందాలతో కంట్రోల్‌రూమ్

● కొత్తగా 5 డీటీఆర్‌లు, అదనపు లైన్‌ల ఏర్పాటు

● గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ రమేష్

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రోడ్డులోని రెడ్డి కళాశాల ఎదుట జరుగుతున్న సరస్ డ్వాక్రా బజార్ జాతీయ స్థాయి మేళాకు నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఈఈ పీహెచ్ ఖాన్ ఆధ్వర్యంలో డ్వాక్రా బజార్ ప్రాంతంలో కొత్తగా ఐదు 100 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్)లను ఏర్పాటు చేసి అవసరమైన మేరా కొత్తగా 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ అధికారులతో పాటు ఆపరేషన్ సిబ్బందితో మూడు షిఫ్ట్‌లుగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడా ఎటువంటి అంతరాయాలు లేకుండా సిబ్బంది పర్యవేక్షించనున్నారు. డ్వాక్రా బజార్‌లో స్టాల్స్ చూసేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చే అవకాశముంది. ఎక్కడా విద్యుత్ పరమైన ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఈ రమేష్ తెలిపారు. డ్వాక్రా బజార్ ప్రదర్శన జరిగే పది రోజుల పాటు ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు.

భారతీయ సంస్కృతిని విద్యార్థులకు తెలియజేయాలి

● ఎమ్మెల్యే గళ్లా మాధవి



విద్యార్థులతో ఎమ్మెల్యే మాధవి

గుంటూరు (విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిని విద్యార్థులకు తెలియజేయాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. అన్నపూర్ణ నగర్‌లోని విజేత ఐఐటీ ఫౌండేషన్ స్కూల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు(తూర్పు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఆదేశించారు. గురువారం స్థానిక సంగడిగుంట తిరుమలచారి కాలనీ, జున్నుషాహిద్ నగర్ కాలనీలలో రూ 3.50కోట్లతో చేపడుతున్న డ్రెయిన్ల, పైపులైన్ల పనులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా మొండిగేటు విస్తరణ లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ క్రమంలో రైల్వే అధికారులతో చర్చించి రూ.8కోట్ల నిధులు విడుదల చేయించామని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. పాత గుంటూరు ప్రాంతాన్ని అభివృద్ధిలో కొత్త రూపు తీసుకొస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



డ్రెయిన్లు, పైపులైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ఉపాధి హామీ పేరుపై కేంద్రం పునః పరిశీలించాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించటంపై కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పున:సమీక్షించుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని ఓ హోటల్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, రానున్న ప్రభుత్వ బడ్జెట్‌లో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ. వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు కిషోర్ ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ తదితరులు

ఘనంగా ముగిసిన త్యాగరాజ ఆరాధన మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సాంస్కృతి సంఘం ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన సంగీత మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ త్యాగరాజస్వామికి శ్రీకాంత్ బృందం నాదస్వరం, పంచామృతాభిషేకార్చనతో ప్రారంభించారు. పల్లకిలో శ్రీ త్యాగరాజ స్వామి శోభాయాత్రను తిరువీధులలో ఘనంగా నిర్వహించారు. నాట్యాచార్య డాక్టర్ ఖాజా వెంకట సుబ్రహ్మణ్యం శిష్యబృందం ప్రహ్లాద భక్తి విజయం నృత్య రూపకాన్ని కనుల పండువగా నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవాదాయశాఖ గౌరవ సలహాదారుడు చుండూరి సీ తారామాంజనేయ ప్రసాదు, ప్రముఖవక్తగా ఆ ధ్యాత్మికవేత్త శ్రీమాన్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి పాల్గొని చిన్నారులను ప్రశంసించి, త్యాగరాజ స్వామి విశిష్టతను వివరించారు. సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్, ఉపాధ్యక్షుడు ఎస్ గిరిజాశంకర్, రవీంద్రనాథ్, నేతి విశ్వేశ్వరరావు అతిథులను, కళాకారులను సత్కరించారు.



ప్రహ్లాద విజయం నృత్య రూపకంలో ఓ సన్నివేశం

ప్రతిష్ఠాత్మకంగా కొండవీటి ఉత్సవాలు

క్షేత్రస్థాయి పరిశీలనలో ఆర్డీవో మధులత

యడ్లపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వారసత్వానికి నెలవైన కొండవీడుకోట ఉత్సవాలను వచ్చే నెల 7, 8 తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో మధులత తెలిపారు. ఆమె గురువారం వివిధ శాఖల అధికారులతో కలసి కొండవీడుకోటను సందర్శించారు. కోటలోని వివిధ ప్రదేశాలను, కట్టడాలను పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే పర్యాటక ప్రేమికులకు కనువిందు కలిగించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా కళాకారులతో ప్రదర్శనలు ఇప్పించేందుకు తగిన వేదికను సిద్ధం చేయడం, సాహస ప్రియుల కోసం ట్రెక్కింగ్, హార్స్ రైడింగ్, బోటింగ్, కోట అందాలను తిలకించేందుకు వ్యూపాయింట్ డెక్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు, వివిధ శాఖల ప్రాభవాన్ని తెలిపే స్టాల్స్, అందమైన పూ ల అలంకరణలు, వాహనాల పార్కింగ్, వివిధ రకాల రుచులతో కూడిన ఫుడ్ కోర్టుల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలపై కలెక్టర్‌కు వివరిస్తానని ఆర్డీవో విలేకర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ జిల్లా మేనేజరు నాయుడమ్మ, తహసీల్దారు విజయశ్రీ, ఎంపీడీవో హేమలతాదేవి, ఆర్టీసీ, అగ్నిమాపక, అటవీ, సర్వే శాఖల అధికారులు ఉన్నారు.



కోట పరిసరాలను అధికారులతో కలసి పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత

సీతారామయ్య హైస్కూల్లో ఘనంగా ముగ్గుల పోటీలు

గుంటూరుకార్పొరేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల ప్రాంగణంలో గురువారం "మామ్ అండ్ మీ రంగోలి పోటీ" ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలో అనేక మంది తల్లులు తమ పిల్లలతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా రాజా వాసిరెడ్డి శ్రీలక్ష్మి, గన్నమనేని సుమిత్ర వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారిని అభినందిస్తూ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ, ఈ తరం పిల్లలకు పండుగల ప్రత్యేకతను, ఆచార-సంప్రదాయాలను వారసత్వంగా అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, సీనియర్ కోఆర్డినేటర్ ఘట్టమనేని రాధా మాధవి, ప్రైమరీ కో ఆర్డి నే టర్ సయ్యద్ దిల్ జహాన్, ప్రీ-ప్రైమరీ కోఆర్డినేటర్ తిరువీధుల శ్రీదేవి, ఇంచార్జి కొమ్మినేని హరిప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు వాసిరెడ్డి శ్రీలక్ష్మి, గన్నమనేని సుమిత్ర, తదితరులు

సీఎంఏ ఫౌండేషన్‌లో శ్రీ మేధా విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య) జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సీఎంఏ ఫలితాల్లో శ్రీ మేధా విద్యార్థులు ప్రతిభ చూపారు. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం ఫౌండేషన్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఫలితాల్లో శ్రీ మేధా విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చైర్మన్ అన్నా నందకిషోర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థి ఏ.నాగసాయి 400 మార్కులు గాను 338, చంద్రశేఖర్ 332, టి.సౌర్య సాయి సాకేత్, కె.జాహ్నవి 300 మార్కులు సాధించారని వెల్లడించారు. విద్యార్థులను చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు



విద్యార్థులను అభినందిస్తున్న అన్న నందకిషోర్

సుమేధలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

గుంటూరు (విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో కాలనీలోని సుమేధా స్కూల్లో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై వివిధ పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణను రంగురంగుల ముగ్గులతో అలంకరించి, భోగి పళ్ళు పోశారు. కార్యక్రమంలో డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

రహదారి నిబంధనలను బాధ్యతగా పాటించాలి

● ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనర్ శ్రీహరి

గుంటూరు (తూర్పు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రహదారి నిబంధనలో పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనర్ శ్రీహరి అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా గురువారం నగరంలో పలు ప్రాంతాలలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ, కుటుంబం భద్రత, సురక్షతను ఆలోచించాలన్నారు. ఒక వ్యక్తి మరణించినా, గాయపడిన ఆ కుటుంబానికి తీవ్ర ఆవేదన మిగులుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వాహనాన్ని జాగ్రత్తగా నడపాలన్నారు. వేగం కంటే ప్రాణం మిన్న అనే సూత్రం ప్రాధాన్యాన్ని గుర్తించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, రవాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నో ప్లాస్టిక్ జోన్‌గా పక్షి సంరక్షణ కేంద్రం

పెదకాకాని, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఉప్పలపాడు పక్షి సంరక్షణ కేంద్రాన్ని నో ప్లాస్టిక్ జోన్‌గా తీర్చిదిద్దడానికి సహకరించాలని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎండీ నజీనా బేగం కోరారు. ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మార్చే ఉద్దేశంతో గురువారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పక్షి సంరక్షణ కేంద్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి, పూర్తిగా ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా ప్రకటించేందుకు డీఎఫ్‌వోకు సూచనలు జారీ చేశామని తెలిపారు. పక్షి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించే వారు ఎలాంటి ప్లాస్టిక్ వస్తువులను లోపలికి తీసుకురావద్దని అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే దుష్ప్రభావాలను వివరించారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరీ



మాడభూషి నరసింహచార్యులను సత్కరిస్తున్న నాగార్జున కల్చర్ సెంటర్ సభ్యులు

గుంటూరు (తూర్పు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట సంగీత కళాశాల ఆవరణలో గురువారం మాడభూషి నరసింహ చార్యులు శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించారు. నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున కల్చర్ సెంటర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పలు త్యాగరాజ స్వామి కృతులను నరసింహ చార్యులు ఆలపించి సంగీతాభిమానులను ఆకట్టుకున్నారు. అనంతరం మాడభూషి నరసింహ చార్యులును కల్చరల్ సెంటర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ ఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ థర్మల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న దళిత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో గురువారం మంత్రి గొట్టిపాటిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాయలసీమ థర్మల్ ప్లాంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను ఓ అధికారి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారని అరుణ్‌కుమార్ తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ నాయకుడు దారా అంబేద్కర్ తదితరులున్నారు.



మంత్రి గొట్టిపాటికి వినతిపత్రం అందజేస్తున్న గోళ్ళ అరుణ్‌కుమార్, తదితరులు

బస్టాండ్‌లో అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు

● ఏదైనా అనుకోని సంఘటన జరిగితే అంతే...

● కనీసం రికార్డ్ కాని సీసీ కెమెరాల వ్యవస్థ

● పట్టించుకోని ఆర్టీసీ యంత్రాంగం....

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో సీసీ కెమెరాల వ్యవస్థ అలంకార ప్రాయంగా మారింది. అనేక నేర పరిశోధనల్లో ఎంతో కీలకంగా నిలిచే సీసీ కెమెరాలపై ఆర్టీసీ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల గుంటూరు నుంచి అద్దంకి వెళ్ళేందుకు బస్సు ఎక్కే సందర్భంలో ఓ ప్రయాణికుడి జేబు నుంచి రూ.45వేలు చోరీకి గురయ్యాయి. దాంతో ఆందోళన చెందిన ప్రయాణికుడు బస్టాండ్‌లోని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాలలో రికార్డింగ్‌లను పరిశీలించాలని కోరాడు. అప్పుడే బస్టాండ్‌లోని సీసీ కెమెరాల వ్యవస్థ డొల్లతనం బయటపడింది. ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో 20కు పైగా ప్లాట్ ఫాంలు ఉన్నాయి. నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక పండుగ సమయాల్లో అయితే వేలాదిమంది ప్రయాణికులతో మరింత రద్దీగా ఉంటుంది. ఎటువంటి సంఘటనలు జరిగినా, చోరీలతో పాటు ఎటువంటి నేర ఘటనలు జరిగినా సీసీ కెమెరాలు ఎంతో కీలకంగా పనిచేస్తాయి. అయితే బస్టాండ్‌లో కొన్ని ప్లాట్‌ఫాంలలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి నామమాత్రంగా ఉన్నాయే తప్ప కనీసం రికార్డ్ కూడా అయ్యే పరిస్థితి లేదు. గతంలో ఆర్టీసీ యంత్రాంగం సొంతంగానే ఓ ఏజన్సీకి అప్పగించి సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేసింది. అయితే టెండర్ కాలం ముగియడంతో అవి అలంకారప్రాయంగా మారాయి.



ఏటీఎం కార్యాలయంలో అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు

సీసీ కెమెరాలు ఎంతో కీలకం....

నగరంలోని రద్దీ ప్రాంతాలతో పాటు ముఖ్య కూడళ్ళలో పోలీసు యంత్రాంగం ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. వాహన చోదకులతో పాటు నేర సంఘటనల్లో సీసీ కెమెరాల రికార్డులు ఎంతో కీలకంగా పనిచేస్తున్నాయి. ఆయా సీసీ కెమెరాల రికార్డులతో ఇప్పటికే అనేక కేసులను పోలీసులు ఛేదించిన సంఘటనలు ఉన్నాయి. అలాగే ప్రయాణికులతో కిటకిటలాడే ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోనూ సీసీ కెమెరాల వ్యవస్థను కట్టుదిట్టం చేయాల్సి ఉందని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. అనుకోని సంఘటనలు కాని, ఏమైనా నేర సంబంధిత కార్యకలాపాలు జరిగినా సీసీ కెమెరాలు లేకపోతే ఏంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా ఆర్టీసీ యంత్రాంగం బస్టాండ్‌లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బాబు.. బంగారం

- మహిళల ఆనందం
- సరస్‌లో సామాన్యుడిగా సీఎం
- ప్రతి స్టాల్‌కూ వెళ్లి డ్వాక్రా మహిళలకు కుశల ప్రశ్నలు
- మాడుగుల హల్వా రుచిచూసి.. సెల్ఫీలకు సై..
- చేతివృత్తి దారునికి రూ. ఆరు లక్షల ఆర్థిక సాయం

'సీఎం అంటే నాలుగు గోడల మధ్య కూర్చునే పెత్తం దారు కాదు. అన్నగా అండగా ఉండటానికే ఇష్ట పడతా'

-సీఎం చంద్రబాబు నాయుడు

దేశంలో అత్యంత భద్రత వలయంలో ఉండే అతి ముఖ్య రాజకీయ నేతల్లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఒకరు. అటువంటి నేత భద్రత వలయాన్ని పూర్తిగా ఛేదించుకొని సామాన్య ప్రజల చెంతకు చేరుతున్నారు. గతానికి భిన్నంగా ప్రతి ఇంటి సంగతులు అడిగి తెలుసుకుంటున్నారు. ఏం చేస్తున్నారు.. ఎంత సంపాదిస్తున్నారు.. ఏం కావాలని కోరుతున్నారు.. ఇలా అనేక ప్రశ్నలు వేసి జవాబులు రాబడుతున్నారు. గురువారం గుంటూరు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన ఆసాంతం ఆహ్లా దంగా సాగింది. ఇంటికి 'అన్న' వస్తే.. మహిళ ఎంత ఆనంద పడతారో అంత కంటే మించిన సంతోషం చేరివచ్చిన వారిలో కనిపించింది. సీఎం చంద్రబాబు సరస్ స్టాల్స్ పర్యటన మాడుగుల హల్వా వద్ద మొదలై చేతి వృత్తిదారుని మట్టి కుండలు వద్ద ముగిసింది. అక్కడ జరిగిన సంభాషణలు యథాతదంగా..

మాడుగుల హల్వా...స్టాల్

సీఎం : ఏమ్మా రోజుకు ఎన్ని కేజీలు అమ్ముతారు?
మహిళ: 40 కేజీలు అమ్ముతాం సార్
సీఎం: ఎంత మంది పని చేస్తారు?
మహిళ: నలుగురు పనిచేస్తారు సార్..
సీఎం: నెలకు ఎంత సంపాదిస్తారు?
మహిళ: రూ.లక్ష సంపాదిస్తాను సార్..
సీఎం: అందరికి ఇవ్వగా ఎంత ఉంటుంది?
మహిళ: నాకు 50 వేలు మిగులు తాయి సార్, మీ కోసం హల్వా ఉంచాను. తినండి సార్.
సీఎం: ఓకే ఇవ్వండి. నాకే కాదు మంత్రి గారికి (పెమ్మసానికి) కూడా ఇవ్వండి.(హల్వా తిన్న తర్వాత సీఎం తన సెక్యూరిటీ ని పిలిచి స్టాల్ యజమానికి రూ. ఐదు వేలు ఇవ్వాలని ఆదేశించారు)

మీతో ఫొటో కావాలంట సార్..

సీఎం సరస్ పర్యటన సందర్భంగా ఆసక్తికరమైన ఘటన చోటు చేసుకుంది. సీఎం స్టాల్స్ సందర్శిస్తున్న సందర్భంగా ఒక డ్వాక్రా మహిళ ఆయనకు దగ్గరకు వచ్చి మరో మహిళను చూపిస్తూ సార్, ఈమె మీతో ఫొటో దిగాలని ఇందాకటి నుంచి అల్లాడిపోతుంది. ఒక్క ఫొటో ఆమెతో దిగండి సార్ అని అనడంతో సీఎం చంద్రబాబు నవ్వుతూ ఫొటో దిగారు.

ఇదే విగ్రహం శాండిల్ వుడ్ (ఎర్ర చందనం)తో చేస్తే..

చంద్రగిరి నియోజకవర్గం నుంచి తీసుకువచ్చిన వెంకటేశ్వరుని చెక్క విగ్రహం సీఎం చంద్రబాబును అమితంగా ఆకర్షించింది. ఆ విగ్రహం ఏ వుడ్ (కర్ర)తో తయారు చేశారు అనే విషయాన్ని ఆరా తీసిన సీఎం స్టాల్ యజమానికి ప్రశ్నలు సంధించారు. ఇదే విగ్రహం శాండిల్ ఉడ్ (ఎర్ర చందనం)తో చేస్తే ఎంతకు అమ్మ వచ్చు అని అడిగారు. అందుకు స్టాల్ యజమాని స్పందిస్తూ ఇదే విగ్రహం శాండిల్ తో చేస్తే రూ. 2 వేలకు అమ్మ వచ్చు అని బదులిచ్చారు.

అప్పటికప్పుడే ఆర్థిక సాయం

మట్టితో కుండలు, ఇతర వస్తువులు తయారు చేసే వెంకట్రావు అనే వ్యక్తిపై సీఎం చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. స్టాల్ సందర్శన సందర్భంగా వెంకట్రావు భార్య తన భర్త అనారోగ్యం గురించి సీఎంకు విన్నవించారు. వెంటనే స్పందించిన సీఎం వైద్యానికి ఎంత కావాలి అని అడుగగా మహిళ రూ. 10 లక్షలు అవుతుందని చెప్పారు. రూ.6 లక్షలు ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. సీఎం స్పందనతో చేతి వృత్తిదారులు అమితానందం పొందారు.

-గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి



స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని

సరస్.. శుభారంభం

(5వ పేజీ తరువాయి)

సంకల్పంతోనే డ్వాక్రా ఉద్యమాన్ని ప్రారంభించామని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఒక్కో రూపాయి పొదుపు చేస్తూ, లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించారని ప్రశంసించారు. డ్వాక్రా, మెప్మా స్వయం సహాయక సంఘాలు దేశవ్యాప్తంగా చరిత్ర సృష్టించాయన్నారు. సరస్ మేళాను చూస్తుంటే మినీ ఇండియా కళ్లముందు నిలిచినట్లుగా ఉందని, సంప్రదాయ హస్తకళలు, స్థానిక ఆహార ఉత్పత్తులు, మహిళల నైపుణ్యం ఒకే వేదికపై కనిపిస్తున్నాయన్నారు. సంక్రాంతి పండుగ వాతావరణాన్ని తలపించేలా సరస్ మేళా రూపకల్పన చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రదర్శన ఏర్పాటు లో కీలక పాత్ర పోషించిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను సీఎం అభినందించారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు



స్టాల్ వద్ద మహిళతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

మార్కెటింగ్, బ్రాండింగ్, విక్రయ వ్యవస్థను బలోపేతం చేస్తే మహిళలకు స్థిర ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, సెర్ప్ ముఖ్య కార్యనిర్వహక అధికారి వాకాటి కరుణ, అదనపు ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఆర్.శ్రీరాములు నాయుడు, గుంటూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, నాబార్డు సీఏజీఎం ఎన్.జి. గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల క్రితమే పునాదులు : కొండపల్లి

30 ఏళ్ల క్రితమే ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాల పునాదులు వేశారని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. నేడు మహిళా సంఘాలు లక్ష కోట్ల రూపాయల టర్న్ ఓవర్ సాధిం చడం గర్వకారణమన్నారు. మహిళలకు ఆర్థికంగా మాత్రమే కాకుండా రాజకీ యంగా కూడా ప్రోత్సాహం ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రిదేనన్నారు. డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు.

ఏడాదికి లక్ష సంపాదించాలి : మాధవి

ప్రతీ మహిళ ఏడాదికి కనీసం రూ.లక్ష ఆదాయం సంపాదించాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ మహిళల సాధికారత కోసం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సాధికారతతో, విజయాలతో ముందుకు సాగుతున్న మహిళలకు ఆధునిక పూలే చంద్రబాబు నాయుడు అని అభివర్ణించారు.



సీఎం చంద్రబాబుతో డ్వాక్రా మహిళలు

ఇక పర్యాటకం పీక్స్

- సూర్యలంక బీచ్‌కు మహర్దశ
- ఇప్పటికే స్వదేశీ దర్శన్ కింద పనులు
- కొత్తగా మూడు స్టార్ హోటళ్లకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- చీరాలలో పర్యాటక రంగానికి మరింత ఊతం
- పనుల పూర్తికి నిర్దిష్ట గడువు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పర్యాటక రంగానికి జిల్లాలోని తీర ప్రాంతాన్ని గమ్యస్థానంగా మార్చే విధంగా ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా అడుగులే స్తోంది. కూటమి ప్రభుత్వం సూర్యలంక బీచ్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. దానిలో భాగంగా స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద తీరంలో మౌలిక వసతుల కల్పనకు రూ.97.52 కోట్ల పనులకు ఆమోదం లభించింది. పాటు పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. కేరళ తరహా హౌస్ బోట్ టూరిజంతో పాటు హోంస్టే ఆతిథ్యానికి సంబంధించి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు మార్గని ర్దేశనం చేశారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో రిసార్టులను అందుబాటులోకి తేవాలని ఆ సదస్సు వేదికగానే సీఎం చెప్పారు. దానిలో భాగంగానే సూర్యలంక తీరంలో మూడు స్టార్ హోటళ్ల ఏర్పాటుకు రాయితీలపై గురువారం జరిగిన కేబినెట్ సమావేశం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తీరంలో అత్యాధునిక సదుపాయా లతో ఫైవ్‌స్టార్ హోటల్ సర్వీసులు ఇటీవలే పర్యాటకులకు అందుబాటులోకి రాగా.. మరో మూడు హోటళ్లు కొలువుదీరనున్నాయి. వీటితో పాటు సంక్రాంతి నుంచే కారవాన్ టూరిజం ను పర్యాటకులకు అందుబాటులోకి తేవడా నికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. హోటళ్లను కొలువుదీర్చడంతోపాటు హౌస్ బోటింగ్, హోం స్టే వంటివన్నీ ఆరు నెలల వ్యవధిలోనే అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం ప్రణా ళికలు రచిస్తోంది. పనుల పురోగతిని జిల్లా యంత్రాంగంతోపాటు ఏపీ టీడీసీ కూడా నిత్యం పర్యవేక్షించి నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.



స్వదేశీ దర్శన్ కింద సూర్యలంక తీరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు



సూర్యలంక తీరంలో ఇటీవల కొలువుదీరిన స్టార్ హోటల్

సూర్యలంక వైపే మొగ్గు...

తీర ప్రాంతంలో స్టార్ హోటళ్ల నిర్మాణానికి సంబంధించి ఆయా సంస్థలకు ఇవ్వాల్సిన రాయితీల విషయంలో ప్రభుత్వం అనేక మార్లు చర్చలు జరిపింది. ఇటీవల జరిగిన ఎస్ఐపీబీ(స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు) సమావేశంలో భూ కేటాయింపులు, రాయితీల విషయంలో ఓ అంచనాకు రావడంతో పాటు సూర్యలంక బీచ్ వైపే బోర్డు మొగ్గు చూపింది. ఈ నిర్ణయాలకే గురువారం సీఎం అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం ఆమోద ముద్ర వేసింది. సూర్యలంక తీరం వేదికగా మూడు కొత్త హోటళ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు చీరాలలో కూడా పర్యాటక రంగాన్ని మరింతగా ప్రోత్సహించాలని మంత్రివర్గం నిర్ణయించింది

వారాంతాల్లో భారీగా...

తెలంగాణతో పాటు ఏపీలోని అన్ని ప్రాంతాల నుంచి బీచ్ పర్యాటకానికి గమ్యస్థానంగా బాపట్లలోని సూర్యలంకతో పాటు చీరాల కూడా ఉంటున్నాయి. తీర ప్రాంతంలో అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 80 వరకు రిస్టార్టులు ఉండగా, ఏపీటీడీసీ కింద హరిత రిసార్టు పర్యాటకులకు సేవలందిస్తోంది. ప్రత్యేకించి వారాంతాల్లో టెకీలతో పాటు మినీ వేడుకలకు తీర ప్రాంతం వేదికగా నిలుస్తోంది. ప్రతి వారాంతంలో దాదాపు 20,000 మంది పర్యాటకులు జిల్లాలోని బీచ్‌లకు వస్తున్నా రనేది అంచనాగా ఉంది.

అందరికీ అందుబాటులో..

ఎఫర్ట్ చేయగలిగే పర్యాటకులకు ప్రపంచ స్థాయి ఆతిథ్యాన్ని అందుబాటులోకి తెచ్చి అందుకు తగ్గ హోటళ్లను కొలువుదీర్చనుంది. సమాంతరంగా దిగువ, మధ్య తరగతి వర్గాలకూ పర్యాటకాన్ని మరింత దగ్గర చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే తీరంలో ఇబ్బడిముబ్బడిగా వెలసిన రిసార్టుల యాజమాన్యాలు డిమాండ్‌ను బట్టి గదుల విషయంలో సొమ్ము చేసుకుంటున్నాయి. ఇకపై ఈ విధానానికి స్వస్తి పలికి గదుల టారిఫ్‌లను ప్రభుత్వం రెగ్యులేట్ చేసి వాటిని ఆయా యాజమాన్యాలు పాటించేలా ఆదేశాలు జారీ చేయనుంది.

ఇవన్నీ అందుబాటులోకి వస్తే...

సూర్యలంక తీరంతో పాటు చీరాలలో ప ర్యాటకానికి సంబంధించి ప్రభుత్వ ప్రణాళి కలన్నీ కార్యరూపం దాలిస్తే ఆతిథ్య రంగంలో అపార ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు జిల్లా అభివృద్ధికి గ్రోత్ ఇంజన్‌లా ఈ రంగమే మారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదా పు ఐదు వేల మందికి ఉపాధి అవకాశాలు దొరకడంతో పాటు పర్యాటకుల సంఖ్య వీకెండ్స్‌లో 50,000 వరకు పెరిగే అవకాశం ఉంది. అత్యాధునిక సౌకర్యాలతో స్టార్ హోటళ్లు అందుబాటులోకి తేవడం వెను క ప్రభుత్వానికి దీర్ఘకాలిక లక్ష్యాలే ఉన్నాయి. ముఖ్యంగా సూర్యలంక బీచ్‌పై ప్రపంచ పర్యాటకుల దృష్టి కూడా పడాలంటే రిసార్టు ఆతిథ్యం ప్రమాణాలు ఇంటర్నేషనల్ స్థాయి లో ఉండాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. దీనిలో భాగంగా రిసార్టుల నిర్మాణానికి సంబంధించి రాయితీలకు పచ్చజెండా ఊపడంతో పాటు త్వరితగతిన వీటిని పట్టాలెక్కించనుంది.

సంక్రాంతి నాటికే కారవాన్ సౌకర్యం

సంక్రాంతి పండుగ నాటికే సూర్యలంక తీరంలో కారవాన్ పర్యాటక అనుభూతిని పర్యాటకులకు పంచడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా ఇప్పటికే ప్యాకేజీ ధరలపై కూడా నిర్వాహకులు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. హౌస్ బోటింగ్ సేవలను ఈ ఏడాది మే నాటికి పర్యాటకులకు అందుబాటులోకి తేవడానికి ఏపీ టీడీసీ కసరత్తు చేస్తోంది. తీరంలో స్వదేశీ దర్శన్ పనులు మొదలవగా, తొలి దశ పనుల పూర్తికి ప్రభుత్వం నిర్దేశిత గడువు విధించింది. మౌలిక వసతుల కల్పనతో పాటు పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

శరవేగంగా వెస్ట్ బైపాస్



కాజ సమీపంలో ఎన్‌హెచ్- 16, వెస్ట్ బైపాస్ జంక్షన్‌లో తారురోడ్డుతో అనుసంధానం

- ఏడు నెలల క్రితమే కృష్ణానదిపై వంతెన పూర్తి
- సాగుతున్న కాజ జంక్షన్ అనుసంధాన పనులు
- నెలాఖరునాటికి ఒకవైపు రాకపోకలు సిద్ధం

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ వెస్ట్ బైపాస్‌గా ఎన్‌హెచ్-16 రహదారి నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గుంటూరు జిల్లాలోని కాజ టోల్ గేటు వద్ద జరుగుతున్న అనుసంధాన పనులు వేగం పుంజుకున్నాయి. వాస్తవానికి ఈ ఏడాది జనవరి ఒకటి నాటికే అనుసంధాన పనులు పూర్తయ్యి.. రోడ్డు అందుబాటులోకి వస్తుందని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెప్పినప్పటికీ.. పనులు మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. దీంతో ప్రస్తుత ఎన్‌హెచ్- 16తో బైపాస్ అనుసంధాన పనులు పూర్తి కాలేదు. ఈ నెలాఖరునాటికి పనులు పూర్తయ్యి.. రోడ్డు అందుబాటులోకి వస్తుందని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు. విజయవాడ, గుంటూరు నగరాల ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతోపాటు రాజధాని అమరావతిని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు అనుసంధానించడం, హైదరాబాద్ ప్రయాణాన్ని సులభతరం చేయడంలో వెస్ట్ బైపాస్ అత్యంత కీలకమైంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలతోపాటు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల రాకపోకలకు ఈ రోడ్డు ఎంతో ముఖ్యమైంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే విజయవాడ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరడంతోపాటు, అన్ని ప్రాంతాలవారికి అమరావతి రాకపోకలు సులభమవుతాయి. అందువల్ల ఈ రోడ్డు నిర్మాణం పట్ల ప్రభుత్వం, ప్రజలు అత్యంత ఆసక్తితో ఉన్నారు. అయితే ఈ రోడ్డు నిర్మాణం మాత్రం ఆశించినంత వేగంగా జరగడం లేదు. విజయవాడ వెస్ట్ బైపాస్ ప్యాకేజీ- 4 కింద 18.2 కిలోమీటర్ల మేర ఆరు వరుసల్లో నిర్మిస్తున్నారు. ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లా చిన్నవుటుపల్లి వద్ద టోల్‌గేట్ నుంచి కాజ టోల్‌గేట్ వరకు నిర్మించే ఈ రోడ్డు రాజధాని అమరావతిని అనుసంధానిస్తూ ఉంటుంది. రాజధానిని గుంటూరు, విజయవాడ, మంగళగిరితో అనుసంధానించే అత్యంత కీలకమైన రోడ్డు కావడంతో ఈ రోడ్డు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా అని ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి ఈ రోడ్డుకు సంబంధించిన 90 శాతం పనులు ఆరునెలల క్రితమే పూర్తయ్యాయి. వెస్ట్ బైపాప్ నిర్మాణంలో భాగంగా కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యి.. ఏడు నెలల క్రితమే అందుబాటులోకి వచ్చింది. గతేడాది మే 2న అమరావతిలో జరిగిన రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో.. ప్రధాన మంత్రి సభకు ఈ బ్రిడ్జిపై నుంచి వీఐపీల రాకపో కలకు అనుమతించారు. అయితే ఆ మరుసటి నెల నుంచే రోడ్డు అందుబాటులోకి వస్తుందని అందరూ భావించారు కానీ, ఇప్పటికీ అది జరగలేదు.



గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే రోడ్డులో జరుగుతున్న పనులు

● అనుసంధాన ప్రక్రియలో జాప్యం

వెస్ట్ బైపాస్ రోడ్డును చినకాకాని సమీపంలో ఎన్‌హెచ్-16తో అనుసంధాన పనులు మొదలై ఇప్పటికీ ఆరు నెలలు దాటింది. కానీ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. జూలైలో పనులు ప్రారంభం కావడంతో.. సెప్టెంబరు నాటికి అందుబాటులోకి వస్తుందని తొలుత అధికారులు చెప్పారు. ఆ తరువాత అక్టోబరుకు, డిసెంబరుకు, ఈ ఏడాది జనవరికి వాయిదా వేశారు. అయితే ఇప్పటికీ పనులు మాత్రం కాలేదు. ప్రస్తుతం పనులు వేగం పుంజుకున్నాయి. గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే 3 లేన్ల పనులు తుది దశకు చేరాయి. ఈ నెలాఖరుకు ఈ వైపు రోడ్డు అందుబాటులోకి వస్తుందని సమాచారం. విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్లే 3 లేన్లు మాత్రం పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఈ వైపునకు సంబంధించి ఇప్పటికీ చాలావరకు పనులు పెండింగులో ఉన్నాయి. ఈ పనులు పూర్తి కావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది.



అభిరామ్ చావా రూపొందించిన హెలికాప్టర్ నమూనా

ఎయిర్ ట్యాక్సీ ఆవిష్కరణలో మరో ముందడుగు

- మ్యాగ్నమ్ వింగ్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అభిరామ్ చావా

గుంటూరు(తూర్పు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా మ్యాగ్నమ్ వింగ్స్ చేపట్టిన ఎయిర్ ట్యాక్సీ నిర్మాణ ఫ్రేమ్ టెస్టింగ్ కీలక ప్రక్రి యను ద్విగిజయంగా పూర్తి చేసినట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అభిరామ్ చావా తెలిపారు. గుంటూరు, ఏటుకూరు రోడ్డులోని సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. దాదాపు మూడేళ్ల నుంచి ఈ ట్యాక్సీని రూపొందించినట్టు చెప్పారు. అనేక పరీక్షలు నిర్వహించి పూర్తిస్థాయిలో ఎయిర్‌ట్యాక్సీను ఆవిష్కరించామన్నారు. రాబోయే నెలల్లో విస్తృతమైన ఫ్లైట్ టెస్టులు ఈ సంస్థ చేపట్టనున్నట్టు చెప్పారు. ఇటీవల వైజాగ్‌లో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో వచ్చే రెండేళ్లలో భారత్‌లో ఎయిర్ ట్యాక్సీల కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన మాకు సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అమెరికాలో రోబోటిక్స్ ఇంజినీరింగ్, మాస్టర్స్ పూర్తిచేసిన అనుభవంతో ఈ ఆవిష్కరణను రూపొందించామన్నారు.




ఎయిర్ ట్యాక్సీని టెస్ట్ చేస్తున్న అభిరామ్ చావా

వేడుక

గిరిజనుల గుండెల్లో ఎన్నో తరాలుగా ఇలవేల్పుగా నిలిచిన నాగదేవతకు అంకితమైన మహోత్సవం... నాగోబా జాతర. అమావాస్య అర్ధరాత్రి చిమ్మచీకట్లో దీపాలు వెలిగిస్తూ, తమ జీవితాల్లో వెలుగు నింపాలని నాగదేవతను వేడుకొనే గిరిజనుల నడక... ఈ జాతరకు ఆత్మ. ఈ నెల 18వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు కేస్లాపూర్ సిద్ధమవుతోంది.

తరతరాల విశ్వాసానికి ప్రతీక

గిరిజనుల జీవన విధానం, వారి నమ్మకం, వారి పోరాట చరిత్రకు నిలువెత్తు నిదర్శనం నాగోబా జాతర. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామం... నాగోబా జాతరకు కేంద్రం. నిజాం పాలకుల అణచివేతను ఎదిరించి, అడవి బిడ్డల ఆత్మగౌరవం కోసం పోరాడిన కొమురం భీం ప్రాణాలర్పించిన గడ్డ ఇది. ఈ గ్రామ జనాభా నాలుగు వందలకు మించదు. కానీ ప్రతి పుష్యమాసంలో జరిగే జాతర రోజుల్లో లక్షలాది భక్తులతో జనారణ్యంగా మారుతుంది. రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన ఈ జాతరకు విశేష ప్రాధాన్యం ఉంది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. పుష్య మాస అమావాస్య రోజున జాతర ప్రారంభమవుతుంది. నాగోబాను కొలిస్తే పంటలు బాగా పండుతాయని, గ్రామాల్లో శాంతి విరాజిల్లుతుందని గిరిజనుల నమ్మకం. రోగాలు మటుమాయమవుతాయని భక్తుల విశ్వాసం. అందుకే ఈ జాతర వారి జీవితంలో అత్యంత పవిత్రమైనదిగా మారింది.



నాగోబా ఆవిర్భావ గాథ...

ప్రాచుర్యంలో ఉన్న కథ ప్రకారం... మెస్రం వంశానికి చెందిన నాగాయిమోతి రాణికి నాగేంద్రుడు కలలో దర్శనమిచ్చాడు. ఆమె గర్భాన సర్పరూపంలో జన్మిస్తానని చెప్పి, ఆ ప్రకారం అవతరించాడు. గౌరితో ఆయన వివాహం జరిగింది. అయితే గిరిజనులు సంప్రదాయాలను విస్మరించడంతో నాగేంద్రుడు కేస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లిపోయాడు. ఆ గుట్టల వద్దే నాగోబా దేవాలయం నిర్మించారు. గౌరీ గోదావరిలో సత్యవసి గుండంలో కలిసిపోయింది.

సంప్రదాయమే చట్టం

నాగోబా జాతరలో ప్రతి ఆచారం ఒక నియమం. వీటి వెనుక వందల ఏళ్ల చరిత్ర ఉంది. మెస్రం వంశీయులే నాగోబా దేవుని పూజలు నిర్వహిస్తారు. గుగ్గిళ్ల వంశీయులే సిరికుండలు తయారుచేస్తారు. సుమారు 130కి పైగా కుండల్లో గోదావరి జలాన్ని తీసుకువస్తారు. వంటలు కూడా అవే కుండల్లోనే చేస్తారు. జాతరకు లక్షలాదిమంది 22 పొయ్యిల మీదే వంటలు జరుగుతాయి. ఈ పొయ్యిలను ఆలయ ప్రాంగణంలోనే ఏర్పాటు చేస్తారు. దీపాల కాంతుల్లో వంటలు చేయడం ఆనవాయితీ. ఈ సంప్రదాయాలను ఇప్పటికీ కఠినంగా పాటిస్తున్నారు. అలాగే కొత్త కోడళ్లు తప్పని సరిగా జాతర సమయంలో నాగోబాను దర్శించుకుంటారు.

గోదావరి యాత్ర...

నాగోబా జాతరలో గోదావరి జలానికి విశేష ప్రాధాన్యం ఉంది. పుష్య మాస పౌర్ణమి సమయంలో గిరిజనులు కాలినడకన గోదావరి నదికి బయలుదేరుతారు. అడవులు, కొండలు దాటి 80 కిలోమీటర్ల ప్రయాణిస్తారు. అస్తమడుగు వద్ద పవిత్ర జలాన్ని తీసుకుంటారు. ఆ జలాన్ని కలశాల్లో నింపి అత్యంత భక్తితో తీసుకొస్తారు. ఆ జలంతో నాగోబా దేవునికి అభిషేకం చేస్తారు. ఎంతో శ్రమతో కూడిన ఈ ప్రయాణాన్ని వారు తపస్సులా భావిస్తారు. పుష్య అమావాస్య అర్ధరాత్రి జరిగే పూజలు నాగోబా జాతరలో అత్యంత పవిత్ర ఘట్టం. గోదావరి జలంతో నాగోబా విగ్రహాన్ని శుద్ధి చేస్తారు. ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తారు. నవధాన్యాలు, మొలకలు సమర్పిస్తారు. రాగి చెంబులో పాలను ఉంచుతారు. నాగదేవుడు ఆ పాలు తాగుతాడనే విశ్వాసం ఉంది. పుట్టపై ఉంచిన రుమాలు పైకెత్తినట్టు కనిపిస్తే దేవుడు ప్రత్యక్షమైనట్టేనని భావిస్తారు. ఈ క్షణాల్లో గిరిజనులు నిశ్శబ్దంగా భక్తిలో లీనమవుతారు.

నాగోబా దర్బార్.. ప్రజాస్వామ్య సంప్రదాయం

నాగోబా జాతరలో మూడో రోజు దర్బార్ నిర్వహిస్తారు. 1942లో ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ తొలిసారి ఈ దర్బార్‌ను ప్రారంభించారు. అప్పట్లో అడవుల్లోకి అధికారులు వెళ్లని పరిస్థితి ఉండేది. గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ వేదిక రూపుదిద్దుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇది కొనసాగుతోంది. గిరిజనులు తమ గోడును ఇక్కడే వినిపిస్తారు. అధికారులు అక్కడికక్కడే పరిష్కారాలు సూచిస్తారు. కాబట్టి ఇది అరుదైన ప్రజాస్వామ్య సంప్రదాయంతో కూడిన వేడుక.

• కసువు వెంకటరమణ
నిజామాబాద్

సహజయోగ



సంక్రాంతి శుభక్రాంతి

సూర్యుడు ఒక రాశి నుంచి మరొక రాశికి మారడాన్ని 'సంక్రమణం' అంటారు. అలా మకర రాశిలో ప్రవేశించే శుభ సందర్భం... మకర సంక్రమణం. ఆ రోజు నుంచే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం అవుతుంది. సంక్రాంతి అనే పదంలో 'సం' అంటే శుభం, 'క్రాంతి' అంటే పరివర్తన లేదా విప్లవం. 'సంక్రాంతి' అంటే శుభ పరివర్తన కలిగే రోజు.

సకల జీవరాశికి ప్రాణాధారం సూర్యుడు. ఆయన అనుగ్రహం లేకపోతే ప్రాణికోటికి మనుగడ లేదు. కాబట్టి ఆయనకు నిరంతరం మనం కృతజ్ఞతలు తెలుపుకొంటూ ఉండాలి. మకర సంక్రాంతి రోజున... అప్పటివరకూ దక్షిణంవైపు ప్రయాణించిన సూర్యుడు తన దిశను మార్చుకొని ఉత్తరంవైపు సంచారం ఆరంభిస్తాడు. సూర్యుడి గమనం మారడం వల్ల వాతావరణంలో మార్పులు సంభవిస్తాయి. సూర్యుడు నిరంతరం జ్వలిస్తూ సమస్త విశ్వానికి మేలు చేకూరుస్తాడు. అందరికీ ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు. ఇదంతా చేసేది తానే అనుకోకుండానే... దీన్నంతటినీ ఆయన నిర్వహిస్తాడు. ఈ గుణాలను మనలో పెంపొందించుకుంటే అహంకారానికి తావు ఉండదు.

సమతుల్యత కావాలి...

మకర సంక్రాంతి విశిష్టమైన పండుగ. పండిన పంటలు ఇంటికి చేరే సమయంలో... నిర్వహించుకొనే వేడుక. మనకు ఆహారాన్ని ప్రసాదించే నేల తల్లికి కృతజ్ఞతలు తెలుపుకొనే సందర్భం. మిగిలిన పండుగలన్నిటినీ మనం చంద్రుడి గమనం ఆధారంగా... చాంద్రమాన పద్ధతిలో జరుపుకొంటాం. కానీ సంక్రాంతి సూర్య గమనం ఆధారంగా, సౌరమానం ప్రకారం జరుపుకొనే పండుగ. సూర్య చంద్రుల గమన ప్రభావం మనమీద బాహ్యాపరంగానే కాదు... మన అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థ మీద కూడా ఉంటుంది. మనలో ఎడమవైపు ఇడానాడి అంటే చంద్రనాడి, కుడివైపు పింగళనాడి అంటే సూర్యనాడి ఉంటాయి. సూర్యనాడి క్రియా శక్తిని, చంద్రనాడి ఇచ్ఛాశక్తిని సూచిస్తాయి. మనం మన శక్తికి మించిన పని చేసినప్పుడు లేదా అతిగా ఆలోచిస్తున్నప్పుడు... కుడిపార్శ్వం మీద... అంటే సూర్యనాడి మీద భారం పడుతుంది. అలాగని ఏ పనీ చేయాలనే కోరిక లేకుండా, ఎప్పుడూ సోమరితనంతో ఉండేవారిలో ఎడమ పార్శ్వానికి అంటే చంద్రనాడికి సమస్యలు వస్తాయి. ధ్యానం ద్వారా సూర్యనాడిని, చంద్రనాడిని సమతుల్య స్థితిలో ఉంచుకోవాలి. ఇది సహజయోగ ధ్యానం ద్వారా సాధ్యమవుతుంది.

ఆప్యాయతను పంచే సంకేతం

మన దేశంలోని పలు రాష్ట్రాల్లో, ప్రత్యేకించి పల్లె ప్రాంతాల్లో సంక్రాంతిని ప్రధానమైన పండుగగా ఘనంగా నిర్వహిస్తారు. మొదటిరోజున భోగి, రెండో రోజున మకర సంక్రాంతి, మూడో రోజున కనుమ పండుగలను జరుపుకొంటారు. ఏడాదంతా కష్టపడి పండించిన ధాన్యం సంక్రాంతి సమయానికి పొలాల నుంచి ఇళ్ళకు చేరుకుంటుంది. ధాన్య లక్ష్మికి స్వాగతం చెప్పేందుకు ఇంటి గుమ్మాలను మామిడి తోరణాలతో, పూల దండలతో అలంకరిస్తారు. వాకిళ్లలో అందమైన రంగవల్లులు దిద్దుతారు. ఆ ముగ్గులలో ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను పెడతారు. కొత్త బియ్యంతో పొంగలి చేసి, నైవేద్యాలు పెడతారు. అందుకే ఈ పండుగను 'పొంగల్' అని కూడా పిలుస్తారు. సంక్రాంతి పండుగ రోజున చాలా రాష్ట్రాల్లో నువ్వులు, బెల్లంతో పిండి వంటలు చేస్తారు. ఇది ఎంతో శాస్త్రీయమైన సంప్రదాయం. సూర్యరశ్మిలోని అతి ఉష్ణం కోపాన్ని పెంచుతుంది, దానివల్ల మాటల్లో కరుకుదనం ఏర్పడుతుంది. కాబట్టి తియ్యని బెల్లాన్ని నువ్వులతో కలిపి ఇతరులకు పంచడం వల్ల ఆత్మీయత పెరిగి, మాటల్లో మాధుర్యం వెల్లివిరుస్తుందని పెద్దలు చెప్పారు. అంటే ఇతరులకు ఆప్యాయతను పంచే ఒక సంకేతం ఇది. జానపద కళా సంప్రదాయాలైన గంగిరెద్దుల ఆట, హరిదాసుల కీర్తనలు లాంటివి ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి. కనుమ రైతులకు అత్యంత ప్రీతిపాత్రమైనది. కృషి వ్యవస్థకు మూలాధారమైన పశువులకు కృతజ్ఞతతో పూజలు చేయడం ఆనవాయితీ. మన శరీరం పంచభూతాలతో నిర్మితమైనది కాబట్టి... సహజయోగ సాధన ద్వారా మనం సమతుల్య స్థితిలో ఉంటూ, ప్రకృతితో మమేకం కావాలి. ప్రకృతి ధర్మాలను అనుసరించాలి. మనలో ఆధ్యాత్మికతను అభివృద్ధి చేసుకోవాలి.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

చింతన

నాదమే యోగముగా...

జీవించిన కాలంలో గుర్తింపు లేనివారు కొందరైతే, సంపద, పదవుల వల్ల వచ్చిన అధికారం ఉన్నంత కాలం మాత్రమే కీర్తిప్రతిష్ఠలకు నోచుకొనేవారు మరి కొందరు. ఈ లోకాన్ని వదిలి వెళ్ళిన తరువాత కూడా తమ కీర్తికాయంతో ఎన్నేళ్ళయినా జీవించేవారు ఇంకొందరు. వారిలో త్యాగరాజస్వామి ముందువరుసలో ఉంటారు.

త్యాగరాజు తండ్రి పేరు రామబ్రహ్మం. ఆయనకు పుట్టిన మొదటి ఇద్దరికీ 'దుండగీళ్ళు' (అల్లరి చిల్లరిగా తిరిగేవాళ్ళు) అనే పేరు ఉండేది. నిరంతర రామ పంచాయతన అభిషేకపరుడు, పరమ మృదుస్వభావి అయిన రామబ్రహ్మానికి ఇది చెప్పలేని మనోవ్యధ కలిగించింది. ఒక రోజు అభిషేక కాలంలో రామ పంచాతయనం (సీతారామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, ఆంజనేయ విగ్రహాల) ముందు ఆయన భోరున ఏడ్చారు. దీన్నే 'అనన్య చింతా క్రోశం' (మరెవరూ దిక్కులేరనే బాధతో పెట్టుకున్న మొర) అంటారు. ఆ రాత్రి ఆయనకు, ఆయన భార్యకు కలలో వాల్మీకి, సరస్వతి కనిపించారు. సంగీత, సాహిత్యనిధి అయిన సుపుత్రుడు పుడతాడని, త్యాగరాజు అని పేరు పెట్టాలని చెప్పారు. ఆ కల నిజమయింది. సరిగ్గా ఏడాదికి వారికి బిడ్డ పుట్టాడు.



శ్రీరామ దర్శనం

త్యాగరాజు అయిదేళ్ళ వయసు వచ్చేసరికి మాతామహుని (తల్లికి తండ్రి) దగ్గర వీణ, కాళహస్తి అయ్యగారి దగ్గర సంస్కృతం నేర్చుకున్నారు. తల్లి దగ్గర జయదేవుడి అష్టపదులు, పురందరదాస, రామదాస కీర్తనలను శ్రావ్యంగా, స్పష్టంగా, శుద్ధంగా, రాగయుక్తంగా నేర్చుకొని పాడడం ప్రారంభించారు. కేవలం మానవ ప్రయత్నం వల్ల సిద్ధి కలుగదని స్వానుభవంతో గ్రహించిన శ్రీరామకృష్ణానంద స్వామి యతీశ్వరుడు.... 'రామ షడాక్షరీ' మంత్రాన్ని త్యాగరాజుకు ఉపదేశించారు. దాన్ని మననం చేస్తున్న త్యాగరాజు "యతీశ్వరా! కొన్ని సంగీత గ్రంథాల్లో సంశయాలు ఉన్నాయి. తీర్చండి" అని ప్రార్థించారు. అప్పుడు రామకృష్ణానందుడు 'నారదోపాస్తి'ని (సంగీత అధిపతి అయిన నారదుణ్ణి సాక్షాత్కరింపజేసుకోగలిగే మంత్రాన్ని) అనుగ్రహించారు. ఒక రోజు పంచనదీశ్వర ఆలయం దగ్గర ఉన్న త్యాగరాజు దగ్గరకు నారదుడి వేషంలో ఒక యతీంద్రుడు వచ్చి ఒక సంగీత గ్రంథాన్ని ఇస్తూ "దీన్ని చదువుకో! మంత్ర మననాన్ని మానకు" అని చెప్పాడు. ఆ గ్రంథాన్ని త్యాగరాజు కళ్ళకు అద్దుకుంటున్న వేళ ఆ యతీంద్రుడు అంతర్ధానమయ్యాడు. మరింత ఆనందపరవశుడైన త్యాగరాజు ఆ మంత్రానుష్ఠానంతో నిత్య సంధ్యావందన క్రియలను ఆచరిస్తూ మననం చేసే సరికి, శరీరం పులకలెత్తిపోతూ ఉండగా శ్రీరామదర్శనం అయింది. అప్పుడు పాడినదే... 'బాల! కనకమయచేల!' అనే కీర్తన. ఎవరూ స్వరపరచకుండానే అలా రాముణ్ణి దర్శిస్తూ పాడగలగడానికి కారణం... శ్రీ రామ షడాక్షరి, నారదోపాస్తి మంత్రాలను 96 కోట్ల సార్లు త్యాగరాజు మననం చేసి ఉండడమే.

మహనీయ వాగ్గేయకారుడు

త్యాగరాజు 24 వేల కీర్తనలను రచించారు, గానం చేశారు. వాటిలో కొన్ని మాత్రమే లభిస్తున్నాయి. త్యాగరాజు తిరుపతి వెళ్ళినప్పుడు అర్చకులు దైవం కనిపించకుండా తెర వేసేస్తే... 'తెరతీయగరాదా...' అని పాడగానే తెర తొలగి స్వామి దర్శనం కావడం, రామ పంచాయతనాన్ని తన జ్ఞాతులు కావేరిలో పడేస్తే... రాత్రంతా త్యాగరాజు చేసిన గానానికి ఆ పంచాయతనం ఒడ్డుకు కొట్టుకురావడం... ఇవన్నీ మంత్రబలం కారణంగానే! అంతటి గొప్పవాడై ఉండి కూడా 'ఎందరో మహానుభావులు' అని పాడిన త్యాగరాజు ఎంతటి మహనీయుడు! పంచరత్న కీర్తనలతో పాటు 'ఏలా నీ దయరాదు', 'నగుమోము గనలేని', 'నాదతనుమనిశం' లాంటి ఎన్నో కీర్తనలు ఇప్పటికీ సంగీతాభిమానులు, భక్తుల నోళ్ళలో నానునుతూనే ఉన్నాయి. ఏడాదికి ఒక సారి త్యాగరాజు విగ్రహానికి దండ వేయడం కాదు... ఆ కీర్తనలలో కొన్నిటినైనా మన ఇళ్ళలో జరిగే శుభకార్యాలలో పాడించుకున్నా, మంగళవాయిద్యాలతో కచేరీ చేయించుకున్నా... ఋషిలాంటి త్యాగయ్య ఋణాన్ని కొంతైనా తీర్చుకున్నట్టే.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
9866700425

తెలుసుకుందాం

స్వామి చెంత భక్తుల కొలువు

వైదిక సంప్రదాయమంతా గురు పరంపరతోనే సాగుతుంది. మంత్రం చెప్పినా, జపం చేసినా, పూజ చేసినా, హోమం చేసినా... ఆచార్య స్మరణతోనే ఆరంభించాలి. ఆచార్య కృపతోనే జ్ఞానాన్ని సంపాదించగలమనీ, తద్వారా భగవంతుణ్ణి చేరుకోగలమనే విశ్వాసం అనాదిగా ఉంది. అలాగే భగవంతుడి పట్ల అపరిమితమైన భక్తితో ఉండే భాగవతుల అనుగ్రహం కూడా... పరమాత్మను సులభంగా చేరుకోవడానికి దోహదపడుతుందనే విశ్వాసం బలీయంగా ఉంది. అందుకే భగవత్ కృప కోసం భాగవత కృప, ఆచార్య కృప ఉండాలనే భావనతో... ఆచార్యులను పూజిస్తారు.




నాలుగు రకాలు

ఆలయాల్లో ప్రతిష్ఠితమైన భక్తుల ప్రతిమలను మనం చూస్తూ ఉంటాం. వైష్ణవాలయాల్లో ఆళ్వార్లు, శివాలయాల్లో నాయనార్ల విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. అలాగే త్రిమతాచార్యులైన శ్రీ శంకర భగవత్పాదులు, భగవద్ రామానుజాచార్యులు, మధ్వాచార్యస్వామి విగ్రహాలను ఆలయాల్లో మనం దర్శించవచ్చు. సంప్రదాయ పరిరక్షణలో బలీయమైన ముద్ర వేసిన ఆచార్యులను, ఆలయాలను నిర్మించిన రాజులు, చక్రవర్తులు, వాటికి సర్వస్వం సమర్పించిన మహా దాతలు, తమ అసమాన శిల్ప కళానైపుణ్యంతో ఆ ఆలయాలను అద్భుతంగా సృష్టించిన శిల్పాచార్యులు, స్థపతుల విగ్రహాలను కూడా ప్రాచీన ఆలయాల్లో మనం సందర్శించవచ్చు. అలాగే మానవాళికి సన్మార్గం చూపించిన మహాత్ములు, తత్త్వ జ్ఞానులు, సాధువులు, పండితులు, సంకీర్తనాచార్యులు, కళాకారులు తదితర నిత్య స్మరణీయుల విగ్రహాలు సైతం కొన్ని చోట్ల కనిపిస్తాయి. ఆగమోక్త దేవతా విగ్రహాలతోపాటు భక్త ప్రతిమలను ఎలా నిర్మించాలనే విషయాన్ని శిల్ప శాస్త్రాలు ప్రత్యేకంగా వివరించాయి. ఈ విగ్రహాలకు భగవంతుని విగ్రహాలకు ఉండే కళాసౌందర్యం ఉండదు. ఆభరణాలు కూడా చాలా పరిమితంగా ఉంటాయి. వారివారి స్థితుల ఆధారంగా భక్తుల విగ్రహాలను నాలుగు రకాలుగా వర్గీకరించారు. అవి: సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం. ఈ ప్రతిమలను వివిధ తాళ మానాల్లో తయారు చేయాలి.

స్థితులకు అనుగుణంగా...

భక్తి, జ్ఞానం, వైరాగ్యం అనే మూడు గుణాలతో విలసిల్లే భక్తులు సాలోక్య స్థితికి చెందినవారు. దివ్య లోకాల్లో ఉండే వీరు ఎప్పుడూ పరమాత్మను కీర్తిస్తూ ఉంటారు. వారి విగ్రహాలను చూస్తే ఆ లక్షణాలు కనిపించాలి. కాబట్టి ఉత్తమ నవతాళంలో వాటిని రూపొందించాలి. జ్ఞానం, వైరాగ్యం ఉన్నవారు సామీప్య స్థితికి చెందినవారు. వీరికి భగవంతుడి పాదాల దగ్గర ఉండే స్థితి కలుగుతుంది. ఈ ప్రతిమలను అధమ దశతాళంలో చేయాలి. లోకాన్ని మరచి, పరమాత్ముడి సగుణ రూపం మీద మనస్సు నిలిపి, దేవుని రూపాలను మాత్రమే చింతన చేస్తూ, ఆ రూపాలనే పొందిన భక్తులు సారూప్య స్థితి కలిగినవారుగా ప్రశంసలు పొందుతారు. భగవంతుడి గురించి జ్ఞానం, నిష్కల్మషమైన గుణం ఉండడం వల్ల వీరికి సారూప్యం కలుగుతుంది. ఉదాహరణకు శ్రీవిఖనస మహర్షి రూపం. ఆయన ప్రతిమ శంఖు చక్రాది ఆయుధాలతో, కిరీటంతో ఉంటుంది. సారూప్య ప్రతిమలను మధ్యమ దశతాళంలో చేయాలి. లోకంలో ఎక్కడైనా పరమేశ్వరుణ్ణి చూడగలిగి, చూపించగలిగి, ఆ పరమేశ్వరునిలో లీనమై ఉండేవారు సాయుజ్యాన్ని అనుభవించే పరమ పురుషులు. సాయుజ్య ప్రతిమలను ఉత్తమ దశతాళంలో చేయాలని పూర్వులు చెప్పారు.



డి.యన్.వి. ప్రసాద్,
స్థపతి, 9440525788

యోగా



మార్పు కోసమే ఈ ప్రేమతత్త్వం

మానవ భావోద్వేగాలు అన్నిటిలో అత్యంత అపార్థానికి, వక్రీకరణకు, దుర్వినియోగానికి గురయిన భావన ప్రేమ. సర్వవ్యాపకమైన ప్రేమ క్రమంగా కుదించుకుపోయింది. మొదట సినిమారంగం దాన్ని కేవలం శృంగారపరమైన ఆకర్షణగా చేస్తే... ఆ తరువాత సోషల్ మీడియా దాన్ని కేవలం క్షణికమైన ప్రదర్శనలు, ప్రకటనలు, లావాదేవీల స్థాయికి దిగజార్చి మరింత సంకుచితం చేసింది.

ప్రేమ విషయంలో మనకు ఉన్న అనుభవం సాధారణంగా కొన్ని దశల్లో పరిణతి చెందుతుంది. బాల్యంలో తల్లిదండ్రుల నిస్వార్థమైన ప్రేమను పొందుతాం. యవ్వనంలో ప్రేమ తరచుగా ఆకర్షణతో కూడిన భావోద్వేగంగా మారుతుంది. ఆ తరువాత తల్లిదండ్రులుగా మన పిల్లల ద్వారా ఆ ప్రేమను మళ్ళీ అనుభూతి చెందుతాం. కొందరు దీన్ని ఇంకొంచెం విస్తరించి... బంధువులు, సన్నిహితులు, అప్పుడప్పుడు ఉద్యోగ సహచరులవరకూ తీసుకువెళతారు. ప్రేమ తాలూకు పరిపూర్ణ వ్యక్తీకరణ ఇదేనని చాలామందికి అనిపిస్తుంది. అయినప్పటికీ... విస్తరించిన ఈ ప్రేమ కూడా 'నేను, నాది, నావాళ్ళు' అనే పరిధిలోనే బందీ అయి ఉంటుంది. ఇక్కడే ఒక లోతైన పరిశీలన అవసరం అవుతుంది. అదే ప్రేమ తాలూకు ఆధ్యాత్మిక కోణం. సరళమయినవే కానీ... ఒక సందర్భంలో రెండు గంభీరమైన వాక్యాలు నాలో ఆసక్తి రేకెత్తించాయి. అవి: అందరినీ ప్రేమించే ఆయనను ప్రేమించు. ఆయన ప్రేమించేవారందరినీ ప్రేమించు.

కొత్త అవగాహన


'అందరినీ ప్రేమించే ఆయనను ప్రేమించడం' అనేది కేవలం ఒక సంక్షిప్తమైన, భిన్నమైన, ఆచరణ సాధ్యంకాని సిద్ధాంతంలా అనిపించింది. కంటికి కనిపించనిదాన్ని ప్రేమించడం ఎలా? నాతో సహా చాలా మందికి మొదట్లో అది అసాధ్యంగా అనిపించింది. అయితే... ఆయన 'ప్రేమించేవారందరినీ ప్రేమించు' అనే వాక్యం ఒక కొత్త అవగాహనకు తెరతీసింది. ప్రేమ అనేది కొందరికే పరిమితం కాదనీ, అది విశ్వజనీనమనీ, షరతులు లేనిదనీ, లావాదేవీలకు అతీతమనీ, దానికి ఎలాంటి అంచనాలు, హక్కులు లేదా కారణాలు ఉండవని ఇది తెలిపింది. 'హార్ట్‌ఫుల్‌నెస్' పద్ధతి సూచించినట్టు... అంతర్లీన దివ్యత్వం గురించి ధ్యానం చేయడం ప్రారంభించినప్పుడు నా ప్రయాణం మరింత లోతుగా సాగింది. నెమ్మదిగా, నాకు తెలియకుండానే నాలో ఉన్న సంస్కారాల పొరలు కరగడం మొదలైంది. అప్పుడు నాలో కలిగినది దేని మీదో నిర్దేశితమైన భావోద్వేగం కాదు, నేను ప్రవేశించిన ఒక అత్యుత్తమమైన అస్తిత్వ స్థితి.

నేర్వడం కాదు, ఎదగాలి

గాఢమైన ధ్యానంలో... మన ధ్యాన వస్తువు పట్ల (అది భగవంతుడు కావచ్చు, దైవత్వం కావచ్చు, స్వచ్ఛమైన అంతర్గత శక్తి కావచ్చు) అపారమైన ప్రేమతో కూర్చున్నప్పుడు... సూక్ష్మమైనదే అయినా చాలా విప్లవాత్మకమైన పరివర్తన జరుగుతుంది. ఆ తత్త్వంతో ఒక పరస్పర అనుసంధానం (ఆస్మోసిస్) జరుగుతుంది. ఆ క్షణంలో 'అందరినీ ప్రేమించే ఆయనను ప్రేమించు' అనే దానికి అర్థం కేవలం ఒక ఆలోచనగా కాకుండా... ఒక ప్రత్యక్ష అనుభవంగా మారుతుంది. అప్పుడు ప్రేమ అనేది మనం చేసే ఒక పని కాకుండా... మనమే ప్రేమ స్వరూపం అవుతాం. ఆ స్థితిలో ప్రేమ అనేది లక్ష్యం లేనిదిగా, ప్రయత్నం అవసరం లేనిదిగా, ఉద్దేశం లేనిదిగా ఉన్నప్పటికీ ఎంతో సజీవంగా ఉంటుంది. ఇది మతం, కులం, జాతి, వృత్తి లేదా సిద్ధాంతాలకు అతీతంగా... ప్రతి ఒక్కరినీ, ప్రతి దాన్నీ మనతో సహజంగా కలుపుతుంది. దాన్ని ప్రత్యేకంగా వ్యక్తపరచాల్సిన అవసరం లేదు. మన ప్రతి ఆలోచన, మాట, చర్య ద్వారా దానంతట అదే వ్యక్తమవుతుంది. ఒక వ్యక్తి ఈ స్థితిలో ఉన్నప్పుడు... ఈ ప్రేమ కుటుంబ జీవితం, సామాజిక సంబంధాలు, వృత్తిపరమైన ప్రవర్తనలో అంతర్భాగమైపోతుంది. ఇలాంటి అస్తిత్వ స్థితిలో పని చేస్తున్న ఒక వైద్యుణ్ణి ఊహించుకోండి. డబ్బు, అహంకారం లేదా స్వార్థం అతని నిర్ణయాలను ప్రభావితం చేయగలవా? అసంభవం. ప్రేమ నిండిన ఆ స్థితి ఇచ్చే స్పష్టత... సరైన దాన్ని మాత్రమే వ్యాప్తి చేస్తుంది. అలాగే నాయకులు, రాజకీయవేత్తలు, అధికారులు, నిపుణులు సైతం అదే అంతరంగ స్థితిలో ఉండి పని చేస్తున్నట్టు ఊహించండి. అప్పుడు మనం నివసించే ప్రపంచం ఎలా ఉంటుంది? అలాంటి మార్పు రావాలంటే... ప్రేమను అపార్థాల నుంచి, సంకుచిత నిర్వచనాల నుంచి విడిపించాలి. ప్రేమను కేవలం తెలుసుకోవడమే కాకుండా.... నిస్వార్థంగా, స్వచ్ఛంగా అనుభూతి చెందే పద్ధతులను మనం అన్వేషించాలి. బహుశా మానవాళి భవిష్యత్తు మరింతగా నేర్చుకోవడంలో లేదు. నిజమైన ప్రేమను చేరుకొని, అందులో మరింత ఉన్నతంగా ఎదగడంలో ఉంది.



డాక్టర్ శరత్‌రెడ్డి, కార్డియాలజిస్ట్, ట్రైనర్, హార్ట్‌ఫుల్‌నెస్. 9440087532



ముత్యాల ముగ్గు

కంభంపాటి ఇందిర
ఈపూరు,
పల్నాడు జిల్లా





15 చుక్కలు
8 వచ్చే వరకు
మధ్య చుక్క

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

విమానాల తయారీలోకి అదానీ

బ్రెజిల్ కంపెనీ ఎంబ్రాయర్‌తో జట్టు

రీజినల్ జెట్ల ఎఫ్ఏఎల్ ఏర్పాటుకు ఒప్పందం

విమాన రంగంలో మేకిన్ ఇండియాకు ఊతం



న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ధనిక పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ విమానాల తయారీ విభాగంలోకి ప్రవేశించబోతోంది. ఇందుకోసం బ్రెజిల్ ఏరోస్పేస్ కంపెనీ ఎంబ్రాయర్‌తో జట్టు కట్టింది. భారత్‌లో తన రీజినల్ ప్యాసింజర్ జెట్ విమానాల తయారీకి అవసరమైన ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్)ను ఏర్పాటు చేసేందుకు అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్‌తో ఎంబ్రాయర్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విమానయాన రంగంలో మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలకు ఈ ఒప్పందం ఊతమివ్వనుందని వారన్నారు. 70 నుంచి 146 సీట్ల వరకు సామర్థ్యంతో కూడిన ఎంబ్రాయర్ రీజినల్ జెట్ విమానాలు స్వల్ప, మధ్య స్థాయి దూర మార్గాల్లో ప్రయాణించేందుకు పనికొస్తాయి.

భారత్‌లో తొలి యూనిట్..

ఫైనల్ అసెంబ్లీ యూనిట్‌లో విడిభాగాలన్నింటినీ కూర్చి పూర్తి విమానాన్ని తయారు చేస్తారు. ఫిక్స్‌డ్ వింగ్ ప్యాసింజర్ విమానాల తయారీకి సంబంధించి దేశంలో ఇదే తొలి అసెంబ్లింగ్ యూనిట్ కానుంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టుల అభివృద్ధి, నిర్వహణ, విమానాల ఎంఆర్ఓ (నిర్వహణ, మరమ్మతు, సర్వీసింగ్), పైలట్ల శిక్షణ విభాగాల్లోకి ప్రవేశించిన అదానీ గ్రూప్ తాజాగా ఈ ఒప్పందంతో విమానాల తయారీలోకీ అడుగుపెట్టినట్లవుతుంది.

ఇండియాపై ఎంబ్రాయర్ ఫోకస్

భారత విమానయాన మార్కెట్లోని అపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఎంబ్రాయర్ గత ఏడాది అక్టోబరులోనే ఢిల్లీలో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. కంపెనీకి చెందిన ఈ-జెట్ విమానాలు 2005లోనే భారత్‌లోకి ప్రవేశించాయి. దాదాపు 50 విమానాలు భారత వైమానిక దళం, ప్రభుత్వ ఏజెన్సీలు, బిజినెస్ జెట్ ఆపరేటర్లతో పాటు స్టార్ ఎయిర్‌కు సేవలందిస్తున్నాయి.

ఏవియేషన్ షోలో ఒప్పంద వివరాల వెల్లడి..?

ఈ ప్రతిపాదిత ఎఫ్ఏఎల్‌ను ఎక్కడ ఏర్పాటు చేస్తారు..? పెట్టుబడులెంత..? ఎప్పటికల్లా అందుబాటులోకి వస్తుంది..? వంటి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై వ్యాఖ్యానించేందుకు ఇరువర్గాలు నిరాకరించాయి. అయితే, ఈ నెలాఖరున హైదరాబాద్‌లో జరగనున్న ఏవియేషన్ షోలో ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,38,000	1,26,500	2,72,000
విజయవాడ	1,39,800	1,29,000	2,42,000
విశాఖపట్నం	1,39,850	1,26,750	2,72,000
రాజమండ్రి	1,38,000	1,26,500	2,43,000
ప్రొద్దుటూరు	1,39,200	1,28,060	2,43,500
ముంబై	1,35,773	1,24,368	2,35,826

సుంకంపం!



- సెన్సెక్స్ 780 పాయింట్లు డౌన్
- మళ్లీ 26,000 కింది స్థాయికి నిఫ్టీ
- స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లు విలవిల
- రూ.7.74 లక్షల కోట్ల సంపద ఉఫ్
- 4 రోజులుగా నష్టాల్లోనే సూచీలు

ముంబై: దలాల్ స్ట్రీట్ సుంకాల భయంతో కంపించింది. గురువారం ఒక దశలో సెన్సెక్స్ 851 పాయింట్లు పతనమై 84,110.10 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 780.18 పాయింట్ల నష్టంతో 84,180.96 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 263.90 పాయింట్లు క్షీణించి 25,876.85 వద్ద ముగిసింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్ సహా ఇతర దేశాలపై 500 శాతం సుంకాలు విధించే బిల్లుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలపడంతో పాటు అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరగడం, గ్లోబల్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ ఇందుకు కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రేడర్లు మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీ, ఐటీ రంగ షేర్లలో పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడ్డారని మార్కెట్ నిపుణులు తెలిపారు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 26 నష్టపోయాయి.

నాలుగు సెషన్లలో రూ.9.19 లక్షల కోట్లు ఆవిరి: అమ్మకాల హోరులో ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.7.74 లక్షల కోట్లు తగ్గి రూ.472.20 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. అంతర్జాతీయ ప్రతికూలతల కారణంగా గత నాలుగు రోజులుగా మార్కెట్ నష్టాల్లో కొనసాగుతోంది. గడిచిన 4 సెషన్లలో సెన్సెక్స్ 1,581.05 పాయింట్లు (1.84 శాతం), నిఫ్టీ 451.7 పాయింట్లు (1.71 శాతం) పతనమవగా.. మార్కెట్ వర్గాల సంపద రూ.9.19 లక్షల కోట్ల మేర కరిగిపోయింది.

రిలయన్స్‌కు రూ.1.65 లక్షల కోట్ల నష్టం: గత నాలుగు రోజుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) షేరు దాదాపు 8 శాతం నష్టపోగా.. కంపెనీ మార్కెట్ విలువ రూ.20 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. గురువారం సెషన్‌లో ఆర్ఐఎల్ షేరు ధర 2.25 శాతం క్షీణించి రూ.1,470.30 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ నాలుగు సెషన్లలో రూ.1,65,299.15 కోట్లు తగ్గి రూ.19,89,679.45 కోట్లకు పరిమితమైంది.

రూపీ డౌన్.. క్రూడ్ అప్: ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు తగ్గి రూ.89.90 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతో పాటు ముడి చమురు ధరల పెరుగుదల, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం ఇందుకు కారణం. కాగా, ఇంటర్నేషనల్ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 0.75 శాతం పెరిగి 60.42 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

జూన్ నుంచి పెరగనున్న మొబైల్ చార్జీలు?

న్యూఢిల్లీ: బంధుమిత్రుల యోగక్షేమాలు తెలుసుకోవడం భారంగా మారనుంది. దేశంలో మొబైల్ చార్జీలు రెండేళ్ల విరామం అనంతరం జూన్ నుంచి 15% పెరిగే ఆస్కారం ఉన్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రథమార్ధంలో జియో జారీ చేయనున్న తొలి పబ్లిక్ ఆఫరింగ్‌తో (ఐపీఓ) టెలికాం రంగం విలువలు పెరిగిపోతాయని, ఇది మొబైల్ చార్జీల పెంపునకు కూడా దారి తీయవచ్చని ఈక్విటీ ఎనలిస్ట్ అక్షత్ అగర్వాల్, ఈక్విటీ అసోసియేట్ ఆయుష్ బన్సల్.. జెఫ్రీస్ కోసం తయారుచేసిన నివేదికలో అభిప్రాయపడ్డారు. దేశంలో డేటా వ్యాప్తి, పోస్ట్ పెయిడ్ సర్వీసుల విస్తరణ, డేటా వినియోగం పెంపు వంటివి ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయాన్ని (ఆర్పు) పెంచడంతో పాటు ప్రధాన టారిఫ్‌ల పెరుగుదలకు దోహదపడనున్నాయని ఆ నివేదికలో తెలిపారు. ప్రధాన టారిఫ్ 15% పెరిగినట్టయితే ఆర్పు వార్షిక ప్రాతిపదికన 14% పెరుగుతుందని అంచనా వేశారు.

నెలాఖరులో యాక్సియం గ్యాస్ ఐపీఓ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆటో ఎల్‌పీజీ రంగంలోని యాక్సియం గ్యాస్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఎస్ఎంఈ విభాగంలో పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.40 కోట్ల నుంచి రూ.45 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈ నెలాఖరులో ఐపీఓ ఉంటుందని కంపెనీ ప్రమోటర్లలో ఒకరైన సాదిక్ అబ్దుల్ ఖాదర్ బనానీ చెప్పారు. ఇప్పటికే తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకల్లో కంపెనీ సొంతంగా 22 ఆటో ఎల్‌పీజీ ఔట్‌లెట్లను నిర్వహిస్తోంది. ఇందులో 12 హైదరాబాద్‌లో ఉన్నాయి. ఈ ఏడాది మే కల్లా హైదరాబాద్‌లో మరో నాలుగు ఔట్‌లెట్లు ఏర్పాటు చేస్తామని బనానీ చెప్పారు. వచ్చే ఏడాది మార్చి కల్లా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకల్లో మరో 30 ఔట్‌లెట్లు ఏర్పాటు చేయాలని చూస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో 12 ఔట్‌లెట్లు తెలంగాణలోని వివిధ నగరాలు, పట్టణాల్లో ఏర్పాటు చేస్తామని బనానీ చెప్పారు. ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్లో ఎక్కువ భాగాన్ని కంపెనీ ఔట్‌లెట్ల విస్తరణకు ఉపయోగించబోతున్నట్టు తెలిపారు.



తెలంగాణ, ఏపీ మార్కెట్లలోకి మహీంద్రా ఎక్స్ఈవీ 9ఎస్, 7ఎక్స్ఓ

హైదరాబాద్: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం).. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి సరికొత్త ఎక్స్‌యూవీ 7ఎక్స్ఓ, ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఎక్స్ఈవీ 9ఎస్‌ను తీసుకువచ్చింది. గురువారం నాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ లిమిటెడ్ (ఎంఈఏఎల్) జోనల్ మేనేజర్ అభిషేక్ కుమార్, రీజినల్ మేనేజర్ నవీద్ ఖాన్, ఆటో డివిజన్ రీజినల్ మేనేజర్ స్వాతిక్ ఈ కార్లను విడుదల చేశారు. 2021లో ఎక్స్‌యూవీ 700 విడుదల చేసిన నాటి నుంచి వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన లభించిందని, తాజాగా అత్యుత్తమ ఫీచర్లతో తీసుకువచ్చిన 7ఎక్స్ఓకు అదే స్థాయిలో ఆదరణ లభిస్తుందని భావిస్తున్నట్లు జోనల్ మేనేజర్ అభిషేక్ తెలిపారు. 7ఎక్స్ఓ ప్రారంభ ధర రూ.13.66 లక్షలు (ఎక్స్‌షోరూమ్). కాగా ఎక్స్ఈవీ 9ఎస్ ప్రారంభ ధర రూ.19.95 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉంది. ఈ కార్యక్రమంలో ఆటోమోటివ్ మహీంద్రా సీఈఓ నారాయణ, వీవీసీ మహీంద్రా ఎండీ వీరేన్, ల్యాండ్‌మార్క్ మహీంద్రా సీఈఓ మహేందర్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐలకు డీటీఏఏ మినహాయింపులు

విశాఖ ఐటీఏటీ కీలక తీర్పు

హైదరాబాద్: ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) దేశంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలకు అందించే కన్సల్టెన్సీ సేవల ఆదాయంపై విశాఖపట్నంలోని ఆదాయ పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఐటీఏటీ) కీలక తీర్పు ఇచ్చింది. ఈ కన్సల్టెన్సీ సేవలపై ఎన్ఆర్ఐలకు వచ్చే ఆదాయానికి మన దేశంలో ఆదాయ పన్ను వర్తించదని పేర్కొంది. అయితే ఈ వెసులుబాటు మన దేశంతో ద్వంద్వ పన్నుల నిరోధక ఒప్పందం (డీటీఏఏ) ఉన్న దేశాల్లోని ఎన్ఆర్ఐల కన్సల్టెన్సీ సేవలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. దుబాయ్‌లో స్థిరపడిన ఎన్ఆర్ఐ విజయ మరియ ప్పన్ ఆస్టిన్ ప్రకాశ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. తాను అందించిన కన్సల్టెన్సీ సేవలకు ప్రతిగా జీరోధా బ్రోకింగ్ లిమిటెడ్ చెల్లించిన రూ.8,30,64,982 మొత్తంపై ఆదాయ పన్ను శాఖ రూ.9,21,280 పన్ను విధించడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఐటీఏటీ విశాఖ బెంచ్ ఈ మేరకు తీర్పు చెప్పింది.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	156	విజయవాడ	152
వరంగల్	156	గుంటూరు	157
కరీంనగర్	156	ఒంగోలు	157
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	155
కర్నూలు	156	నెల్లూరు	160
విశాఖపట్నం	148	అనంతపురం	160
గోదావరి	152		



నా ఆస్తుల్లో 75 శాతం సమాజానికే

వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్



న్యూఢిల్లీ: తన ఆస్తుల్లో 75 శాతాన్ని సమాజానికి దానం చేయనున్నట్టు వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ ప్రకటించారు. తన కుమారుడు అగ్నివేష్ అగర్వాల్ (49)కు ఇచ్చిన వాగ్దానం మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఒక ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న అగ్నివేష్ అగర్వాల్ బుధవారం గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. దేశంలో ఏ చిన్నారి కూడా ఆకలితో పడుకోవటం, చదువుకోకుండా ఉండరాదని, అలాగే ప్రతి మహిళ తన స్వంత కాళ్ల మీద నిలబడేలా ఉండాలని అగ్నివేష్ ఎప్పుడు చెబుతూ ఉండేవాడని అనిల్ అగర్వాల్ అన్నారు. అంతేకాకుండా తన కుమారుడి ఆలోచనలకు అనుగుణంగా తాను సంపాదించిన ఆస్తిలో 75 శాతాన్ని సమాజానికి ఇవ్వటం ద్వారా ఎంతో కొంత మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తన కళ్ల ముందే కుమారుడు చనిపోవడం భరించలేని బాధ కలిగిస్తోందన్నారు. కాగా అగ్నివేష్ అగర్వాల్ మరణంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్బిట్రేషన్‌లో రాధా గ్రూప్‌నకు ఊరట

హైదరాబాద్: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) కంపెనీ డీలర్ రాధా గ్రూప్‌నకు ఆర్బిట్రేషన్‌లో పెద్ద ఊరట లభించింది. ఈ కంపెనీ డీలర్‌షిప్‌ను టీకేఎం 2022 జూన్ 1న అర్థాంతరంగా రద్దు చేయడాన్ని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌వీ రవీంద్రన్ నేతృత్వంలోని ఆర్బిట్రేటర్ కొట్టి వేశారు. అది అక్రమం, కాంట్రాక్ట్ ఒప్పందాన్ని ఏకపక్షంగా అతిక్రమించడమేనని స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం 90 రోజుల ముందస్తు నోటీస్ లేకుండా డీలర్‌షిప్‌ను రద్దు చేసినందుకు, ఆ కాలానికి 18 శాతం వడ్డీతో ఖర్చులను చెల్లించాలని ఆదేశించారు. రాధా గ్రూప్ తనకు రూ.200 కోట్లకు పైగా నష్టపరిహారం చెల్లించాలన్న టీకేఎం వాదననీ కూడా తోసిపుచ్చారు. ఆర్బిట్రేషన్‌లో ఇచ్చి న తీర్పు తమ నిబద్ధత, నిజాయితీకి నిదర్శనమని రాధా గ్రూప్ డైరెక్టర్ ఎంవీ శ్రీనివాస్ అన్నారు.

వెండి రూ.12,500 డౌన్

వెండి భారీగా తగ్గింది. ఢిల్లీ మార్కెట్లో కిలో ధర రూ.12,500 తగ్గుదలతో రూ.2,43,500 స్థాయికి దిగివచ్చింది. 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములపై రూ.900 తగ్గి రూ.1,40,500గా నమోదైంది. ఇన్వెస్టర్లు పెద్దఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడటంతో అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు తగ్గుముఖం పట్టడమే ఇందుకు ప్రధాన కారణం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 9వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	600
వరంగల్	562	గోదావరి	585
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	



స్పోర్ట్స్

తిలక్ వర్మకు గాయం

- రాజ్‌కోట్‌లో శస్త్రచికిత్స
- కివీస్‌తో మూడు టీ20లకు దూరం



ముంబై: టీ20 ప్రపంచ కప్‌నకు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. జట్టు ఆపద్బాంధవ బ్యాటర్ తిలక్ వర్మకు పొత్తి కడుపు గాయమైంది. దాంతో అతడికి శస్త్రచికిత్స నిర్వహించారు. ఫలితంగా అతడు కొద్ది రోజులు ఆటకు దూరం కానున్నాడు. గాయం దరిమిలా న్యూజిలాండ్‌తో జరిగే తొలి మూడు టీ20లలో తిలక్ వర్మ ఆడడంలేదని బీసీసీఐ కార్యదర్శి దేవజీత్ సైకియా గురువారం రాత్రి తెలిపాడు. 23 ఏళ్ల తిలక్ వర్మ ప్రస్తుతం రాజ్‌కోట్‌లో జరుగుతున్న విజయ్ హజారే టోర్నీలో ఆడుతున్నాడు. బెంగాల్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్ సందర్భంగా గాయపడ్డాడు. అయితే బుధవారం తిలక్‌కు హఠాత్తుగా పొత్తి కడుపులో తీవ్రంగా నొప్పి వచ్చింది. 'తిలక్‌ను రాజ్‌కోట్‌లోని ఆసుపత్రికి తరలించగా, వెంటనే ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించారు. ఆమేరకు అతడికి శస్త్రచికిత్స జరిగింది. ఆపరేషన్ తర్వాత అతడు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు' అని సౌరాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు జయదేవ్ షా వెల్లడించాడు. అతడు కోలుకొనే తీరు ఆధారంగా న్యూజిలాండ్‌తో మిగిలిన టీ20లు ఆడించే విషయంపై నిర్ణయం తీసుకుంటారన్నాడు.

ఎదురులేని నిఖత్



నోయిడా: జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు తేజం నిఖత్ జరీన్ పంచ్‌లకు ప్రత్యర్థులకు చుక్కలు కనపడుతున్నాయి. గురువారం గ్రేటర్ నోయిడాలో ముగిసిన క్వార్టర్స్‌లో నిఖత్ 5-0తో లాంచన్‌బీ చాను టోంగ్‌బ్రామ్ (మణిపూర్)పై గెలిచి, సెమీస్‌లో స్థానం దక్కించుకుంది. ఇతర బౌట్లలో మీనాక్షి (45-48 కిలోలు), ప్రీతి (51-54 కి), పురుషుల 65-70 కిలోల విభాగంలో హితేష్, 50-55 కి., కేటగిరీలో పవన్ బర్త్వాల్, 55-60 కి.,లో సచిన్ సెమీస్‌లో ప్రవేశించారు.

విశ్వకప్‌కు సన్నాహకంగా..

నేటి నుంచి మహిళల ప్రీమియర్ లీగ్

ఆరంభ పోరులో ముంబై × బెంగళూరు

రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

తొలిసారి వన్డే వరల్డ్‌కప్ గెలిచిన ఉత్సాహం ఇంకా తాజాగానే ఉండగా, భారత మహిళా క్రికెటర్లు మరో ఆసక్తికర పోరుకు సై అంటున్నారు. అంచనాలకు మించిన ఆదరణతో దూసుకెళుతున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) నాలుగో సీజన్‌కు శుక్రవారం తెర లేవనుంది.



నవీ ముంబై: ఐదు జట్లు పోటీపడనున్న మహిళల ప్రీమియర్ లీగ్ ఫిబ్రవరి 5 వరకు జరుగుతుంది. స్థానిక డీవై పాటిల్ స్టేడియంలో జరిగే నేటి ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. 2024లో ఆర్‌సీబీ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. దేశవాళీ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసేందుకు ఆరంభించిన ఈ లీగ్ ఇప్పటికే సత్ఫలితాలనిస్తోంది. దీనిద్వారా జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న షఫాలీ, రిచా, శ్రేయాంక, శ్రీచరణి, క్రాంతి, సైకా తదితరులు కీలక ప్లేయర్లుగా కొనసాగుతున్నారు. అందుకే మరింత మంది యువ ప్లేయర్లు తమ సత్తా నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నారు. దీనికి తోడు పొట్టి ఫార్మాట్‌లో జరిగే డబ్ల్యూపీఎల్ ద్వారా భారత్‌తో పాటు ప్రపంచ క్రికెటర్లకు కూడా జూన్-జూలైలో జరిగే టీ20 వరల్డ్‌కప్‌నకు చక్కటి ప్రాక్టీస్ లభించనుంది. తాజా సీజన్ కోసం గతేడాది నవంబరులో జరిగిన మెగా వేలం ద్వారా ఆయా జట్లు కొత్త ప్లేయర్లతో బరిలోకి దిగబోతున్నాయి. ఈనేపథ్యంలో ఢిల్లీని గత మూడు పర్యాయాలు ఫైనల్‌కు చేర్చిన కెప్టెన్ మెగ్ లానింగ్ ఇప్పుడు యూపీ వారియర్స్‌ను నడిపించబోతోంది. జెమీమా ఢిల్లీ కొత్త కెప్టెన్ అయ్యింది. అయితే ఎలిస్ పెర్రీ (ఆర్‌సీబీ), అన్నాబెల్ సదర్లాండ్ (డీసీ) వ్యక్తిగత కారణాలతో డబ్ల్యూపీఎల్‌కు దూరం కావడం ఆయా జట్లకు గట్టి ఎదురుదెబ్బగా చెప్పవచ్చు.

రెండు దశలు రెండే వేదికలు

గతేడాది మ్యాచ్‌లను నాలుగు నగరాల్లో నిర్వహించగా.. ఈసారి మాత్రం తొలి రెండు సీజన్ల మాదిరే రెండే వేదికలకు పరిమితం చేశారు. దీంతో రెండు దశల్లో జరిగే ఈ లీగ్‌కు మొదట నవీ ముంబై ఆతిథ్యమివ్వనుంది. ఇక్కడి డీవై పాటిల్ స్టేడియంలో జనవరి 17 వరకు 11 మ్యాచ్‌లు జరుగుతాయి. లీగ్‌లో ఏకైక డబుల్ హెడర్ మ్యాచ్‌లు (జనవరి 10న) ఇక్కడే నిర్వహిస్తారు. ఆ తర్వాత వేదిక వడోదరకు మారనుంది. ఇక్కడ 19 నుంచి వచ్చే నెల 5 వరకు ఎలిమినేటర్, ఫైనల్ సహా మరో 11 మ్యాచ్‌లతో లీగ్ ముగియనుంది.

సమవుజ్జీల పోరుతో..

డబ్ల్యూపీఎల్ ఆరంభ పోరే అభిమానులను ఉర్రూతలూగించనుంది. భారత మహిళా జట్టు ప్రధాన క్రికెటర్లయిన హర్మన్‌ప్రీత్ ఆధ్వర్యంలోని ముంబై ఇండియన్స్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన నేతృత్వంలోని రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బోణీ కోసం ఆరాటపడుతున్నాయి. తమ కోర్ గ్రూప్‌ను అట్టిపెట్టుకున్న ముంబై టైటిల్‌ను నిలబెట్టుకోవాలనుకుంటోంది. ఇంగ్లండ్ కెప్టెన్ సివర్ బ్రంట్, విండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ కూడా ఇదే జట్టులో ఉన్నారు. వీరికి తోడు అమేలియా కెర్, ఇల్లింగ్‌వర్త్, అమన్‌జోత్, కమలినితో పాటు బౌలింగ్‌లో షబ్నిం, సైకా ఇషాక్ కీలకం కానున్నారు. మరోవైపు ఆర్‌సీబీ కేవలం మూడు మ్యాచ్‌ల్లోనే నెగ్గి నిరాశపరిచింది. తాజాగా ఎలిస్ పెర్రీ దూరం కావడంతో లీగ్ ఆరంభానికి ముందే ఝలక్ తగిలింది. అయినా బ్యాటింగ్ ప్రధాన బలంగా సవాల్ విసరాలనుకుంటోంది. మంధానకు జతగా జార్జియా వాల్, ఆల్‌రౌండర్లు గ్రేస్ హ్యారిస్, నాడిన్ డి క్లర్క్‌తో పాటు రిచా ఘోష్ హిట్టింగ్ ప్రత్యర్థి జట్లకు వణుకుపుట్టించేదే. అరుంధతి రెడ్డి, పూజా వస్త్రాకర్, లారెన్ బెల్ ప్రధాన పేసర్లు. దీనికి తోడు రాధా యాదవ్, శ్రేయాంక, లిన్సే స్మిత్‌లతో కూడిన స్పిన్ విభాగం అదనపు బలం కానుంది.

క్వార్టర్స్‌లో సింధు, సాత్విక్ జోడీ



కౌలాలంపూర్: స్టార్ షట్లర్ పీవీ సింధు, మేటి డబుల్స్ జోడీ సాత్విక్/చిరాగ్ మలేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీలో మరింత ముందంజ వేశారు. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో సింధు 21-8, 21-13తో మియజాకీ (జపాన్)ని ఓడించి క్వార్టర్స్‌కు చేరింది. తదుపరి మ్యాచ్‌లో మూడో సీడ్ యమగూచితో సింధు ఆడుతుంది. డబుల్స్ రెండో రౌండ్ లో మూడో సీడ్ సాత్విక్/చిరాగ్ ద్వయం 21-18, 21-12తో జునైది/రాయ్ కింగ్ (మలేసియా) జంటను ఓడించారు. అయితే పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుష్ షెట్టి ప్రీక్వార్టర్ ఫైనల్ నుంచే వెనుదిరిగారు. రెండో రౌండ్‌లో లక్ష్యసేన్ 20-22, 15-21తో లీ యియు (హాంకాంగ్) చేతిలో, ఆయుష్ 18-21, 21-18, 12-21తో టాప్ సీడ్ షి యుకి (చైనా) చేతిలో పరాజయం పాలయ్యారు.

ఆనంద్‌కు అర్జున్ చెక్



కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో విశ్వనాథన్ ఆనంద్‌కు ఇరిగేసి అర్జున్ చెక్ చెప్పాడు. గురువారం జరిగిన నాలుగో రౌండ్‌లో ఆనంద్‌తో తలపడిన అర్జున్ 58వ ఎత్తులో అతడిని ఓడించాడు. ఐదో రౌండ్‌లో చైనా జీఎం వీ యిపై నెగ్గిన అర్జున్, అరవింద్ చిదంబరంతో ఆడిన ఆరో రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. ఆరు రౌండ్లు ముగిసేసరికి అర్జున్ (3.5) నాలుగో స్థానానికి చేరుకున్నాడు. ఆనంద్ 4.5 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. భారత జీఎం నిహాల్ సరీన్ ద్వితీయ, అమెరికా జీఎం వెస్లీ తృతీయ స్థానాల్లో ఉన్నారు.

రాష్ట్రానికి రూ.60 కోట్ల ఖేలో ఇండియా నిధులు

శాప్ చైర్మన్ రవి నాయుడు

అమరావతి (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా పథకం నుంచి రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.60.76 కోట్లు మంజూరయ్యాయని శాప్ చైర్మన్ ఎ. రవి నాయుడు తెలిపారు. గురువారం కేంద్ర క్రీడాశాఖ నుంచి ఈ మేరకు శాప్‌కు అధికారిక సమాచారం అందింది. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.9.50 కోట్లు, ఫుట్‌బాల్ స్టేడియానికి రూ.6 కోట్లు, టెన్నిస్ కోర్టుకు రూ.1.50 కోట్లు, బాస్కెట్‌బాల్ కోర్టుకు రూ.92 లక్షలు, ఫ్లడ్ లైట్ల కోసం రూ.1.08 కోట్లు, కుప్పంలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి రూ.14 కోట్లు, శ్రీకాకుళంలోని పాత్రునివలసలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.14 కోట్లు, రాజమండ్రిలో మల్టీ పర్పస్ స్టేడియం కోసం రూ.13.76 కోట్లు కేటాయించారు.

కంగారుపడినా.. కొట్టేశారు..

● ఆస్ట్రేలియాదే ఐదో టెస్ట్ ● 4-1తో యాషెస్ సిరీస్ వశం



సిడ్నీ: బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా (6) కెరీర్‌కు ఘనమైన ముగింపు ఇవ్వలేకపోయినా.. ఐదు టెస్ట్‌ల యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా 4-1తో సొంతం చేసుకొంది. ఆఖరి టెస్ట్‌లో ఆసీస్ 5 వికెట్ల తేడాతో గెలిచింది. ఆటకు ఐదో, ఆఖరి రోజైన గురువారం 160 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆస్ట్రేలియా 161/5 స్కోరు చేసి నెగ్గింది. లక్ష్యసాధనలో ఆసీస్.. ఇంగ్లిష్ బౌలర్ల ధాటికి తడబడినా నిలదొక్కుకొంది. ఓవర్‌నైట్ స్కోరు 302/8తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లండ్ 342 పరుగులకు ఆలౌటైంది. మొత్తంగా 159 పరుగుల ఆధిక్యాన్ని మాత్రమే నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 384, ఆసీస్ 567 రన్స్ చేశాయి.

ఖవాజా వీడ్కోలు..: ఖవాజా ఈ మ్యాచ్‌తో టెస్ట్‌లకు వీడ్కోలు పలికాడు. అతడు క్రీజ్‌లోకి వస్తుండగా ఇంగ్లండ్ ఆటగాళ్లు గార్డ్ ఆఫ్ఆనర్ ఇచ్చారు. ఆరు రన్స్ చేసిన ఖవాజా టంగ్ బౌలింగ్‌లో అవుటయ్యాడు.

భారత జట్టులో నిత్య

ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్



న్యూఢిల్లీ: ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో తలపడే భారత జట్టును గురువారం ప్రకటించారు. 17 మంది సభ్యుల బృందంలో తెలంగాణకు చెందిన నిత్య గంధెకు చోటు దక్కింది. 60 మీ. పరుగులో ఆమె బరిలోకి దిగనుంది. ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, షాట్‌పుటర్ తజిందర్ పాల్ సింగ్ తూర్ భారత జట్టుకు నాయకత్వం వహిస్తాడు. ఈ పోటీలు ఫిబ్రవరి ఆరు నుంచి ఎనిమిది వరకు చైనాలోని తియాన్జిన్‌లో జరుగుతాయి.

ఆంధ్ర గెలుపుతో..

5 వికెట్లతో సర్వీసెస్ చిత్తు

ఆలూర్: మహీప్ కుమార్ (68 నాటౌట్) రాణించడంతో.. విజయ్ హజారే ట్రోఫీని ఆంధ్ర విజయంతో ముగించింది. గ్రూప్-డిలో గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 5 వికెట్ల తేడాతో సర్వీసెస్‌పై గెలిచింది. తొలుత సర్వీసెస్ 45 ఓవర్లలో 165 పరుగులకు కుప్పకూలింది. రామ్, హేమంత్ మూడేసి వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఆంధ్ర 38.1 ఓవర్లలో 168/5 స్కోరు చేసి గెలిచింది. 7 మ్యాచ్‌లనుంచి 10 పాయింట్లు మాత్రమే సాధించిన ఆంధ్ర టోర్నీ నుంచి ఎలిమినేట్ అయింది.

నాకౌట్‌లో ఎవరితో ఎవరు?

ఈ నెల 12న జరిగే తొలి క్వార్టర్స్‌లో ముంబైతో కర్ణాటక, రెండో క్వార్టర్‌లో ఉత్తరప్రదేశ్‌తో సౌరాష్ట్ర తలపడనున్నాయి. 13న జరిగే మూడో క్వార్టర్స్ మ్యాచ్‌లో ఢిల్లీతో విదర్భ, అలాగే మధ్యప్రదేశ్‌తో పంజాబ్ ఆడనున్నాయి. నాకౌట్ మ్యాచ్‌లన్నీ బెంగళూరులోనే జరగనున్నాయి.

శ్రీచైతన్య విద్యాసంస్థల 'ఇన్ఫినిటీ వన్'

▸ 1:1 నిష్పత్తిలో ఆన్‌లైన్ ట్యూషన్ల నిర్వహణ

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యార్థుల కోసం 'ఇన్ఫినిటీ వన్' అనే సరికొత్త ఆన్‌లైన్ ట్యూషన్ ప్లాట్‌ఫాంను అందుబాటులోకి తెచ్చాయి. 4వ తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 1:1 నిష్పత్తిలో వ్యక్తిగత శ్రద్ధతో కూడిన బోధన అందించడమే దీని లక్ష్యమని యాజమాన్యం పేర్కొంది. దేశంలో డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లో ఒకటైన ఇన్ఫినిటీ లెర్న్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపింది. ఇందులో ప్రతి విద్యార్థికి ఓ ప్రత్యేక ఉపాధ్యాయుడు అందుబాటులో ఉండి ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తారని శ్రీచైతన్య విద్యాసంస్థల సీఈవో, డైరెక్టర్ సుష్మా బొప్పన ఒక ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ, ఫౌండేషన్, జేఈఈ, నీట్ విభాగాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల లక్ష్యసాధనకు అవసరమైన శిక్షణ, వ్యక్తిగత మెంటరింగ్, నిరంతర ఫీడ్‌బ్యాక్ ఈ ప్రోగ్రాం ప్రత్యేకత అని చెప్పారు. కార్యక్రమంలో లైవ్ క్లాసులతో పాటు రికార్డు చేసిన సెషన్లు ఉంటాయని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు 24గంటల పాటు సందేహాలు నివృత్తి చేస్తారని ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండేషన్ సీఈవో ఉజ్వల్‌సింగ్ తెలిపారు. మరింత సమాచారం కోసం http://infinitylearn.com లేదా 98108 48779 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

త్వరితగతిన ఎంఎస్ఎంఈల ఏర్పాటు : సీఎస్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మూడు దశల్లో 175 పార్కులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి దశలో 55 ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఇప్పటికే 16 ప్రారంభం అయ్యాయని, మరో 39 పార్కులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. విశాఖ భాగస్వామ్య సదస్సు-2025లో వివిధ కంపెనీలతో చేసుకున్న అవగాహనా ఒప్పందాలకు సంబంధించిన ప్రాజెక్టులను గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్ జిల్లాల వారీగా ఎంఎస్ఎంఈ పార్కుల ప్రగతిని వివరించారు.

20న ఏపీపీఎస్సీ పరీక్షల హాల్ టికెట్లు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గతేడాది జారీ చేసిన 17 నోటిఫికేషన్లకు సంబంధించిన పరీక్షల హాల్ టికెట్లు ఈ నెల 20న విడుదల చేయనున్నట్లు ఏపీపీఎస్సీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. క్యారీ ఫార్వార్డ్ పోస్టుల భర్తీకి ఈనెల 27 నుంచి 31 వరకు 7 జిల్లా కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి.

ఏప్రిల్‌లో పాఠశాల విద్యార్థి ఆవిష్కర్తల సదస్సు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థుల నుంచి సమాజానికి ఉపయోగపడే కొత్త ఆలోచనలను రాబట్టే లక్ష్యంతో ప్రభుత్వం ఏప్రిల్ నెలలో ఆవిష్కర్తల(ఇన్నోవేటర్స్) సదస్సు నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి వెయ్యి ప్రాజెక్టులతో ఈ సదస్సు నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలను కూడా ఆహ్వానించనున్నారు.

ఓటర్ల అవగాహనపై జాతీయ మీడియా అవార్డులు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఓటర్ల చైతన్యం, అవగాహన పెంపొందించడంలో విశేష కృషి చేసిన మీడియా సంస్థలకు జాతీయ మీడియా అవార్డులు-2025 అందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఎంట్రీలను ఆహ్వానిస్తోందని రాష్ట్ర ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎంట్రీలను ఈ నెల 10లోగా పంపాలి. ఎంట్రీలను... బ్రజేశ్ కుమార్, అండర్ సెక్రటరీ(కమ్యూనికేషన్), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వాచన్ సదన్, అశోకా రోడ్డు, న్యూఢిల్లీ-110001 అన్న చిరునామాకు పంపాలి. ఈ మెయిల్ ఐడీ mediadivision@eci.gov.in' అని వివేక్ యాదవ్ తెలిపారు.

జిల్లా కోర్టులకు బాంబు బెదిరింపులు

▸ బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు

▸ విశాఖ, ఏలూరు, అనంతపురం, చిత్తూరుల్లో కలకలం

▸ తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని అన్ని కోర్టుల్లోనూ సోదాలు

▸ అన్నీ ఉత్తుత్తి బెదిరింపులేనని నిర్ధారణ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్):



విశాఖ జిల్లా కోర్టులో బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

రాష్ట్రంలోని పలు జిల్లా కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించగా ఉత్తుత్తి బెదిరింపులేనని తేలింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని గంటల పాటు కోర్టు కార్యకలాపాలు నిలిచిపోయాయి. విశాఖ జిల్లా కోర్టులో బాంబు పెట్టినట్టు గుర్తుతెలియని వ్యక్తులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజుకు గురువారం ఈమెయిల్ పంపించారు. ఆయన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చికి తెలియజేయడంతో బాంబు స్క్వాడ్ సిబ్బంది మెటల్ డిటెక్టర్లతో కోర్టు ఆవరణలోనూ, హాళ్లలోనూ తనిఖీ చేశారు. పార్కింగ్‌లో ఉన్న వాహనాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ కూడా వచ్చింది. ఎక్కడా బాంబు లేదని తేలింది. కోర్టు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీపీ తెలిపారు. ఇక చిత్తూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టామని, మధ్యాహ్నం 1.15 గంటలకు పేలుడు పదార్థాలతో ధ్వంసం చేస్తామంటూ గురువారం మధ్యాహ్నం 12.20 గంటలకు vikram-rajaguru@outlook.com ఐడీ నుంచి జిల్లా కోర్టు సూపరింటెండెంట్‌కు మెయిల్ వచ్చింది. వెంటనే ఎస్పీ తుషార్ డూడీకి సమాచారమివ్వడంతో ఆయన నాలుగు బృందాలను కోర్టు వద్దకు పంపారు. వారు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు, సిబ్బందిని బయటకు పంపించి సుమారు ఐదు గంటల పాటు తనిఖీలు చేసి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు ఏమీ లేవని తేల్చారు. ఈ బెదిరింపు నేపథ్యంలోనే చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిధిలోని అన్ని కోర్టుల్లోనూ పోలీసులు తనిఖీ చేశారు. అలాగే, ఈలం పీపుల్స్ రివల్యూషనరీ లిబరేషన్ ఫ్రంట్‌కు చెందిన అజ్మల్ అబ్దుల్లా పేరు మీద ఏలూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవికి గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు మెయిల్ వచ్చింది. జిల్లా కోర్టులోని న్యాయమూర్తుల చాంబర్స్‌లో మూడు చోట్ల ఆర్డీఎక్స్ అమర్చామని, 1.35 గంటలకు ఎల్ఈడీ(లైట్ ఇమెటింగ్ డయోట్)తో వాటిని పేల్చివేస్తామని పేర్కొన్నారు. ఆమె జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌కు సమాచారం ఇచ్చారు. కోర్టులో ఉన్నవారందరూ వెంటనే బయటికి వెళ్లిపోవాలని మైక్‌లో ప్రచారం చేయించారు. న్యాయమూర్తులు కూడా బయటకు వచ్చి చెట్టు కింద నిల్చున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించి ఏమీ లేదని తేల్చారు. అలాగే, తమిళ లిబరేషన్ ఆర్గనైజేషన్(టీఎల్ఓ)కు చెందిన మహ్మద్ అస్లాం విక్రం పేరిట అనంతపురం జిల్లా కోర్టుకు బుధవారం రాత్రి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. కశ్మీర్ ఐఎస్ఐ సభ్యులతో కలసి కోర్టు కాంప్లెక్స్‌ను పేల్చేస్తామని, మూడు ఆర్డీఎక్స్ బాంబులను కోర్టు కాంప్లెక్స్‌లో పెట్టామని, పేల్చివేస్తామని అందులో హెచ్చరించారు. అవి పేలకపోతే టీఎల్ఓ సభ్యులు కోర్టు ప్రాంగణంలోకి వచ్చి శ్రీలంక ఈస్టర్ దాడుల తరహాలో న్యాయాధికారులు, న్యాయవాదులను పేలుస్తారని బెదిరించారు. దీంతో అందరూ కోర్టును ఖాళీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు మైక్ ద్వారా ప్రచారం చేయించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఉత్తుత్తి బెదిరింపులేనని తేలడంతో మధ్యాహ్నం 3 గంటల తర్వాత కోర్టు కార్యకలాపాలు యథావిధిగా కొనసాగాయి.



జస్టిస్ మల్లికార్జునరావు దంపతులను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

జస్టిస్ మల్లికార్జునరావుకు ఘనంగా వీడ్కోలు

▸ న్యాయ సేవలను కొనియాడిన హైకోర్టు సీజే జస్టిస్ ఠాకూర్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావుకు గురువారం హైకోర్టు ఘన వీడ్కోలు పలికింది. ఆయన ఈ నెల 18న పదవీ విరమణ చేయనుండగా, సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ముందుగానే వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. జస్టిస్ మల్లికార్జునరావు న్యాయసేవలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కొనియాడారు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి కృషి, పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నతస్థానానికి ఎదిగారన్నారు. ఆయన శేషజీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. జస్టిస్ మల్లికార్జునరావు మాట్లాడుతూ..' న్యాయమూర్తిగా వృత్తి జీవితం ఎంతో సంతృప్తినిచ్చింది. సుదీర్ఘ వృత్తి జీవితంలో నాకు సహకరించిన వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు' అన్నారు. అంతకుముందు అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఇన్‌చార్జి అధ్యక్షుడు కేవీ రఘువీర్.. ఆయన సేవలను, ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అదనపు అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, జస్టిస్ మల్లికార్జునరావు కుటుంబ సభ్యులు, రిజిస్ట్రార్లు, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జస్టిస్ మల్లికార్జునరావు, కిరణ్మయి దంపతులను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక, పట్టువస్త్రాలు బహూకరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి సి.సుబోధ్ తదితరులు పాల్గొన్నారు.

40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

▸ 24 గంటల్లోపే చెల్లింపులు: నాదెండ్ల

ఈ ఖరీఫ్ సీజన్‌లో గురువారం నాటికి రాష్ట్రంలో 6,54,469 మంది రైతుల నుంచి 40 లక్షల టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి మరో మైలురాయిని అధిగమించామని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ చేశామన్నారు.

సెకండ్ సర్వే వక్ఫ్ ఆస్తులు నమోదు చేయండి

▸ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

సెకండ్ సర్వే ఆఫ్ వక్ఫ్ ఆస్తులను త్వరితగతిన శతశాతం ఉమీద్ పోర్టల్‌లో నమోదు చేయాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ ఆఫ్ వక్ఫ్‌లతో గురువారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'రాష్ట్రంలో మొదటి సర్వే వక్ఫ్ ఆస్తులను ఉమీద్ పోర్టల్‌లో వందశాతం నమోదు చేశారు. అదేవిధంగా ఐదు నెలల సమయం ఉందని ఆలస్యం చేయకుండా, సెకండ్ సర్వే వక్ఫ్ ఆస్తులను మండలాలవారీగా శతశాతం నమోదు చేయాలి' అన్నారు. త్వరలో ఏపీ వక్ఫ్ బోర్డు వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నట్లు అజీజ్ తెలిపారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయండి: ఆప్టా

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఫిబ్రవరి 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య (ఏఐపీటీఎఫ్), అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల జేఏసీ(ఏఐజేఏసీటీవో) కలిసి చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం టీచర్లను కోరింది. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆ సంఘం నేతలు కె.ప్రకాశ్‌రావు, ఎంజీ మెహది గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

షాపులు, బార్లకు ఒకే ధరకు మద్యం

▸ బార్లపై అదనపు ఏఆర్ఈటీ రద్దు

▸ దీంతో ప్రభుత్వానికి 340 కోట్ల నష్టం

▸ మద్యం ధర సీసాపై రూ.10 పెంపు

▸ పెంపు వల్ల 1,391 కోట్ల ఆదాయం

▸ క్వార్టర్ రూ.99, బీరుపై పెంపు లేదు

▸ మద్యం అమ్మకాలపై కీలక నిర్ణయాలు



అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల విషయంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వం నుంచి మద్యం దిగుమతి చేసుకునే మద్యం ధరల్లో... షాపులు, బార్ల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించేందుకు ఏఆర్ఈటీ (అడిషనల్ రిటైల్ ఎక్సైజ్ టాక్స్)ను రద్దు చేయాలని నిర్ణయించింది. మద్యం షాపుల లైసెన్సీలకు ఎమ్మార్పీపై మార్జిన్ ఒక శాతం పెంచాలని, వీటివల్ల ఏర్పడే ఆదాయ నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు మద్యం ధరలను లిక్కర్ సీసాపై రూ.10 పెంచాలని నిర్ణయించింది. ఈ అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసులను గురువారం జరిగిన క్యాబినెట్ ఆమోదించింది. పేదలను ఉద్దేశించి ప్రవేశపెట్టిన క్వార్టర్ రూ.99 బ్రాండ్లపై ధరలు పెంచడం లేదు. బీరు, వైన్, రెడీ టూ డ్రింక్స్‌పైనా పెంపు ఉండదు. మద్యం ధరల పెంపు వల్ల ప్రభుత్వానికి రూ.1,391 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది. ఏఆర్ఈటీ రద్దుతో రూ.340 కోట్ల నష్టం వాటిల్లుతుంది. అలాగే షాపుల లైసెన్సీలకు 1% శాతం మార్జిన్ పెంచడం వల్ల కూడా కొంత ఆదాయం కోల్పోవాల్సి ఉంటుంది. మున్సిపల్ కార్పొరేషన్ల వెలుపల 5 కి.మీ. పరిధిలో త్రీస్టార్ లేదా అంతకంటే ఎక్కువస్థాయి హోటళ్లలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు అనుమతివ్వాలని నిర్ణయించింది. అలాగే, వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సమస్యను కూటమి ప్రభుత్వం ఇప్పుడు పరిష్కరించింది. వైసీపీ సర్కారు రాకముందు బార్లకు, మద్యం షాపులకు ప్రభుత్వం ఒకే ధరకు మద్యాన్ని విక్రయించేది. ఆ తర్వాత షాపులు, బార్లు వినియోగదారులకు మద్యం అమ్ముకునేవారు. గత ప్రభుత్వం బార్ల లైసెన్సీలను మార్చేయాలనే కుట్రతో లైసెన్స్ గడువు ముగియకముందే కొత్త పాలసీ తేవాలని నిర్ణయించింది. దీనిపై బార్ల లైసెన్సీలు హైకోర్టుకు వెళ్లడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. దాంతో ఆగ్రహానికి గురైన అప్పటి ప్రభుత్వం బార్లకు ఇచ్చే మద్యంపై 10 శాతం ఏఆర్ఈటీ విధించింది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం ఏఆర్ఈటీని రద్దుచేసి ధరలను సమానం చేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ప్రమాదకరమైన పాత్రలో యశ్



కన్నడ హీరో యశ్ ప్రధాన పాత్రధారిగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్'. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ఉపశీర్షిక. యశ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఓ గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. దాదాపు మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియోలో ఓ అదిరిపోయే యాక్షన్ సన్నివేశం ద్వారా చిత్రంలో యశ్ పాత్ర ఎలా ఉండబోతోందో హింట్ ఇచ్చారు. 'ప్రమాదకరమైన 'రాయ'పై ఓ లుక్కేయండి' అని ఆయనను పరిచయం చేశారు. 'రాయ' అనే శక్తిమంతమైన పాత్రలో ఆయన కనిపించనున్నారు. ఈ సినిమాలో ఐదుగురు హీరోయిన్లు నటిస్తుండడం విశేషం. గంగ పాత్రలో నయనతార.. మెల్లిసాగా రుక్మిణీ వసంత్, నాదియాగా కియార అడ్వాణీ, ఎలిజిబెత్‌గా హ్యూమా ఖురేషీ, రెబెక్కాగా తారా సుతారియా కనిపించనున్నారు. మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, కేవీన్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై యశ్, వెంకట్ కే నారాయణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మార్చి 19న ప్రేక్షకుల ముందుకు వస్తోందీ చిత్రం.

చీకటి రహస్యాలను వెలికితీసే సంధ్య



హీరోయిన్, నాగచైతన్య సతీమణి శోభితా ధూళిపాళ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ 'చీకటిలో'. విశ్వదేవ్ రాచకొండ ముఖ్య పాత్రను పోషించారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో సురేశ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై దగ్గుబాటి సురేశ్‌బాబు నిర్మించారు. గురువారం ఈ చిత్రం గురించి ఓ కీలక అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ నెల 30న అమెజాన్ ప్రైమ్‌లో విడుదలవుతున్నట్లు తెలిపారు. 'హైదరాబాద్ నేపథ్యంలో సాగే అద్భుతమైన థ్రిల్లర్ ఇది. సంధ్య అనే పాడ్‌కాస్టర్ పాత్రలో శోభితా కనిపించనున్నారు. నగరంలో జరిగే కొన్ని దారుణమైన చీకటి రహస్యాలను బయటపెట్టడమే ధ్యేయంగా ఆమె సాగించే పోరాటం ఆసక్తికరంగా ఉంటుంది. ఉత్కంఠభరితమైన కథ, శక్తిమంతమైన నటనతో చిత్రం మీ అందర్నీ కట్టిపడేస్తుంది' అని పేర్కొన్నారు.



శ్రీలీల.. ముగ్గురు పిల్లలు



యువ కథానాయిక శ్రీలీల 25 ఏళ్ల వయసులోనే ముగ్గురు పిల్లల తల్లి అయ్యారు. ఆమెకు పెళ్లి కాలేదు కదా అని కంగారు పడకండి. వాళ్లు ఆమె సొంత పిల్లలు కాదు.. పెంచుకుంటున్న పిల్లలు. మూడేళ్ల కిత్రం ఓ అనాథ ఆశ్రమానికి వెళ్లి అక్కడ ఇద్దరు పిల్లలను దత్తత తీసుకుని ప్రత్యేక శ్రద్ధతో వారిని పెంచి పోషిస్తోంది. ఆ పిల్లల పేర్లు ఏమిటో తెలుసా? గురు, శోభిత. తాజాగా ఇప్పుడు మరో పాపను కూడా దత్తత తీసుకున్నారు శ్రీలీల. వృత్తిపరంగా తను బిజీగా ఉన్నప్పటికీ పిల్లల పెంపకంలో మాత్రం ఎలాంటి నిర్లక్ష్యం వహించడం లేదు. '2019లో కన్నడ చిత్రం 'కిస్'లో నటిస్తున్నప్పుడు ఆ చిత్ర దర్శకుడు నన్నొక పిల్లల అనాధాశ్రమానికి తీసుకెళ్లారు. అక్కడి వాతావరణం నాకు బాగా నచ్చేసింది. తరచూ అక్కడికి వెళ్లేదాన్ని. చాలా కాలం ఈ విషయాన్ని రహస్యంగానే ఉంచాను. కానీ నాలాగా మరికొందరు చేస్తారనే ఆశతో ఇప్పుడు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను' అని ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు శ్రీలీల.

రెండింతల వినోదంతో..



నవీన్ పొలిశెట్టి

'అనగనగా ఒక రాజు' మంచి వినోదంతో పాటూ భావోద్వేగాలు గల చిత్రం. దర్శకుడు మారికి ఇది తొలి చిత్రమైనా అద్భుతంగా హ్యాండిల్ చేశాడు. థియేటర్లో ఉన్నంత సేపూ పొట్టచెక్కలయ్యేలా నవ్వుతూనే ఉంటారు. నా నుంచి సినిమాల పరంగా వచ్చిన గ్యాప్‌ను భర్తీ చేసేలా రెట్టింపు వినోదాన్ని అందిస్తుంది' అని కథానాయకుడు నవీన్ పొలిశెట్టి అన్నారు. ఆయన, మీనాక్షీ చౌదరి జంటగా మారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అనగనగా ఒక రాజు'. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. శ్రీకార స్టూడియోస్ సమర్పిస్తోంది. గురువారం ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'ఇందులో కొత్త నవీన్ పొలిశెట్టిని చూస్తారు. అన్ని రకాలుగా ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో ముస్తాబైన చిత్రమిది. పక్కా పండగ చిత్రం' అని చెప్పారు. 'పూర్తిగా నవీన్ శైలిలో ఉండో కొత్త రకం చిత్రమిది. తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది' అని మారి తెలిపారు. 'ఇందులో నేను పోషించిన చారులత పాత్ర నాకు చాలా ప్రత్యేకమైనది. సినిమా ఘన విజయం సాధిస్తుంది' అని అన్నారు.

ధురంధర్ బ్యాన్.. జోక్యం చేసుకోండి

● ప్రధాని మోదీకి నిర్మాతల మండలి విజ్ఞప్తి



బాక్సాఫీస్ దగ్గర దుమ్మురేపుతున్న బాలీవుడ్ చిత్రం 'ధురంధర్'పై పశ్చిమాసియాలో బ్యాన్ ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని గురువారం ప్రధాని నరేంద్ర మోదీని కోరుతూ నిర్మాతల మండలి లేఖ రాసింది. 'బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాతో పాటు యూఏఈలోనూ 'ధురంధర్'పై నిషేధం విధించారు. ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోవాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాం. దీన్ని ఎక్కడైనా విడుదల చేసుకోవచ్చని.. ఎలాంటి అభ్యంతకర సన్నివేశాలు లేవని సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ ఇచ్చింది. పైన పేర్కొన దేశాల్లో నిషేధం విధించడం మా భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమే. ఎందుకంటే ఇది భారతీయ సినీ చరిత్రలోని అతి గొప్ప విజయాన్ని అందుకుంది' అని ఇండియన్ మోషన్ పిక్చర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఆ గల్ఫ్ దేశాలు మనకు మిత్ర దేశాలు కాబట్టి ఈ చిత్రం విడుదల విషయంలో జోక్యం చేసుకోవాలని మోదీని నిర్మాతల మండలి రిక్వెస్ట్ చేసింది. ఆ దేశాల అధికారులతో చర్చలు జరిపి భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవించేలా నిషేధాన్ని వీలైనంత త్వరగా రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించింది. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ తెరకెక్కించిన 'ధురంధర్' ఇప్పటికే ఒకే భాషలో విడుదలై అత్యధిక కలెక్షన్లు సాధించిన భారతీయ చిత్రంగా నిలిచింది.

అందుకే నేను కారణజన్మురాలిని

\- అనసూయ భరద్వాజ్



ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో ముచ్చటించిన ఆమె తనపై వస్తున్న ట్రోల్స్, ఫ్యాన్స్ అసోషియేషన్ గొడవలు, ఇటీవల తలెత్తిన వివాదాలపై ఘాటుగా స్పందించారు. ఈ క్రమంలో ఆమె 'నేను కారణ జన్మురాలిని' అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

● ఓ నెటిజన్ 'మీరెందుకు ఎప్పుడూ వివాదాల్లో ఉంటారు?' అని అడిగిన ప్రశ్నకు అనసూయ సమాధానమిస్తూ...'నేను ఎప్పుడూ నా అభిప్రాయాన్ని మాత్రమే నిజాయితీగా చెబతాను. కానీ కొందరు దాన్ని కావాలని వివాదంగా మారుస్తున్నారు. బహుశా సమాజంలో ఉన్న ఇలాంటి విషయాల గురించి గట్టిగా మాట్లాడడానికే నేను పుట్టానేమో. అందుకే నన్ను నేను 'కారణజన్మురాలిని' అనుకుంటాను'' అని బదులిచ్చారు. 'నా ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా చలామణి అవుతున్న ఆ వ్యక్తి ఎవరో నాకు తెలియదు. నన్ను వ్యక్తిగతంగా కలవకుండానే నా తరపున మాట్లాడడం సరికాదు. నా పేరు వాడుకొని కొందరు బతుకుతున్నారు' అని ఆమె మండిపడ్డారు.

నిహారిక కొత్త సినిమా



'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో నిర్మాతగా విజయం సాధించిన నటి నిహారిక ఇప్పుడు మరో సినిమా తీస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేశ్‌కుమార్ బన్సాల్‌తో కలసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'రాకాస' అనే పేరు నిర్ణయించినట్లు గురువారం వెల్లడించారు. ఏప్రిల్ 3న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు.





కోడిని కోసి, జగన్ ఫ్లెక్సీకి రక్తాభిషేకం చేస్తున్న నిందితులు

కోడిని కోసి.. జగన్ ఫ్లెక్సీకి రక్తాభిషేకం

- వీడియో తీసి.. బ్యాక్‌గ్రౌండ్‌లో రక్తచరిత్ర పాట
- ఆలస్యంగా వెలుగుచూసిన మరో ఘటన
- తిరుపతిలో ఇద్దరు వైసీపీ కార్యకర్తల అరెస్టు, విడుదల
- కోర్టు వద్ద నిందితులను పరామర్శించిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ జన్మదినం సందర్భంగా పలు జిల్లాల్లో ఆ పార్టీ కార్యకర్తలు రక్తచరిత్ర లిఖించారు. జంతు బలులుచేసి.. ఫ్లెక్సీలకు రక్తాభిషేకాలుచేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం తూర్పు చోడవరంలో మేక పోతు మెడనరికి, ఆ రక్తంతో జగన్ ఫ్లెక్సీకి రక్తాభిషేకం చేసి అరాచకం సృష్టించిన విషయం తెలిసిందే. ఇదే కోవలో తిరుపతిలో చోటుచేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం కట్టకిందపల్లికి చెందిన వైసీపీ కార్యకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి బంధువు బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆయన స్నేహితుడు, ప్రైవేటు ఉద్యోగి అయిన భువన్‌కుమార్ కలిసి జగన్ జన్మదినం సందర్భంగా గత నెల 21న జగన్ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీ ఎదుట కోడిని కోసి, కోడి రక్తంతో ఫ్లెక్సీలో జగన్, అభినయ్‌రెడ్డి ఫొటోలకు రక్తాభిషేకం చేశారు. దీనిని వీడియో తీసి.. దానికి రక్త చరిత్ర సినిమాలోని 'అక్కడ ఇక్కడ ఎక్కడికక్కడ ఎత్తిన తలకు రాత పెడత...' అంటూ బ్యాక్‌గ్రౌండ్ సాంగ్ పెట్టి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. దీనిపై స్థానికుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదుచేసి గురువారం నిందితులను అరెస్ట్ చేశారు. సాయంత్రం తిరుపతి కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా వారికి బెయిల్ మంజూరు చేశారు. కాగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోర్టు వద్దకు వచ్చి నిందితులను పరామర్శించారు.

జగన్ క్షమాపణ చెప్పాలి

- ఉత్తరాంధ్రుల్ని అవమానించావు.. 'అన్నమయ్య' గేట్లను వదిలేశావ్
- రాజధానిని ధ్వంసం చేశావు: బీజేపీ ఫైర్



మీడియాతో మాట్లాడుతున్న వల్లూరు జేపీ, యామిని శర్మ, కిలారు దిలీప్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'తల్లి పార్టీ ఓట్ చోరీ అంటుంది. పిల్ల పార్టీ క్రెడిట్ చోరీ అంటోంది. ఎర్రబస్సు వెళ్లని చోటుకు ఏయిర్ బస్ ఎందుకు? అంటూ ప్రశ్నించిన జగన్ ముందుగా ఉత్తరాంధ్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి. అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు మరమ్మత్తులు చేయకుండా విపత్తుకు కారణమైన వైసీపీ అధ్యక్షుడికి రాయలసీమ ప్రాజెక్టులపై ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత ఉందా?' అని ఏపీ బీజేపీ నిప్పులు చెరిగింది. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో యామినీ శర్మ, కిలారు దిలీప్‌తో కలసి బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ విలేకరులతో మాట్లాడారు. 'భోగాపురం(విశాఖ) అంతర్జాతీయ విమానాశ్రయానికి రెండోసారి శిలాఫలకం వేయడానికి మాత్రమే పరిమితమైన జగన్ క్రెడిటిని కొట్టేయాలనుకుంటే ప్రజలు నవ్వుతారు. రాజధాని అమరావతిలో ప్రజా వేదికను కూల్చావ్.. రాయలసీమలో అన్నమయ్య ప్రాజెక్టును నాశనం చేశావ్.. ఉత్తరాంధ్రలో రుషికొండ ధ్వంసం చేశావ్.. 2019-24మధ్య అరాచకం అంటే ఏమిటో చూపించావ్. ప్రజలు చిత్తుగా ఓడించినా పెట్టుబడిదారులకు బెదిరింపు మెయిల్స్ పంపుతూ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నావు. మెడికల్ కాలేజీలు పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు కేంద్రంతో పాటు నీతి ఆయోగ్ అంగీకరించింది. మీరు అడ్డుకున్నా 17 కళాశాలల నిర్మాణం పూర్తి చేసి తీరుతాం. సీమకు తీరని ద్రోహం చేసిన జగన్... తిరుమల పవిత్రతను దెబ్బతీసి, లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేశాడు. ఆఖరికి ఖాళీ మద్యం సీసాలతోనూ చేస్తున్న నీచపు పనుల్ని దేవుడు కూడా క్షమించడు. సింగపూర్ మంత్రి ఈశ్వరన్ జైలుకు వెళ్లాడంటూ వాడు, వీడు అని మాట్లాడుతున్న పేర్ని నాని... ఇక్కడ జైలుకు వెళ్లిన జగన్‌ను ఏమని పిలుస్తారో..! జగన్ లాంటి అవినీతి పరుడు బయట ఉంటే ప్రమాదమని, ఆయనపై ఉన్న అవినీతి కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి త్వరగా ముగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా' అని జేపీ పేర్కొన్నారు.

బాలిక ప్రాణం తీసిన ఇన్‌స్టాగ్రామ్ ప్రేమ!

- న్యూ ఇయర్‌కు డబ్బులు డిమాండ్ చేసిన బాలుడు
- మానసిక ఒత్తిడి తట్టుకోలేక బాలిక ఆత్మహత్య

తెనాలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్ ప్రేమ తొమ్మిదో తరగతి విద్యార్థి ప్రాణాన్ని బలితీసుకుంది. బాలికకు అదే స్కూల్‌లో పదో తరగతి బాలుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైంది. మెసేజ్‌లు వారిని దగ్గరం చేయడంతో.. దాన్నే వారు ప్రేమ అనుకున్నారు. ఇదే అదునుగా బాలికను డబ్బులు డిమాండ్ చేయడం మొదలుపెట్టిన బాలుడు.. ఇవ్వకుంటే ఆమె నుంచి దూరంగా వెళ్లిపోతానని బెదిరించాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. గుంటూరు జిల్లా తెనాలిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. తెనాలి పట్టణంలోని ఓ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పట్టణానికే చెందిన ఓ బాలిక 9వ తరగతి చదువుతోంది. అదే స్కూల్‌లో మరో బాలుడు పదో తరగతి చదువుతున్నాడు. వీరిద్దరికీ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో న్యూ ఇయర్ వేడుకల కోసం తనకు రూ.5 వేలు కావాలని ఆ బాలుడు డిమాండ్ చేశాడు. డబ్బు ఇవ్వకుంటే టీసీ తీసుకుని దూరంగా వెళ్లిపోతానిని బెదిరించాడు. దీంతో తీవ్ర ఒత్తిడికి గురైన బాలిక ఇంట్లో ఉన్న ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది.

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం

విశాఖపట్నం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని హిందూ మహాసముద్రంలో ఉన్న వాయుగుండం బుధవారం అర్ధరాత్రి తర్వాత తీవ్ర వాయుగుండంగా బలపడి నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. ఆ తర్వాత పశ్చిమ వాయవ్యంగా పయనిస్తోంది. ప్రస్తుతం చెన్నైకి దక్షిణ ఆగ్నేయంగా 940 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇంకా పశ్చిమ వాయవ్యంగా పయనించి శుక్రవారం సాయంత్రం శ్రీలంకలో తీరం దాటుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆ తర్వాత శనివారం నాటికి దక్షిణ తమిళనాడుకు సమీపంలోకి వస్తూ వాయుగుండంగా, తీవ్ర అల్పపీడనంగా బలహీనపడనున్నది. దీని ప్రభావంతో శుక్రవారం నుంచి తమిళనాడులో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. శుక్రవారం రాత్రి నుంచి నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరుగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోస్తాలోని అన్ని ఓడరేవుల్లో ఒకటో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. కాగా, తీవ్రవాయుగుండం శుక్రవారం ఉదయానికి తుఫానుగా మారనుందని అమెరికాకు చెందిన జేటీడబ్ల్యూసీ(జాయింట్ టైఫూన్ వార్నింగ్ సెంటర్) హెచ్చరించింది. బంగాళాఖాతంలోని తీవ్ర వాయుగుండం దిశగా గాలులు వీస్తుండడంతో రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. గురువారం పగటిపూట కూడా చలి వాతావరణం నెలకొంది. శివారు, ఏజెన్సీ ప్రాంతాల్లో చలితీవ్రతకు ప్రజలు గజగజ వణుకుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో 4.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. శుక్రవారం కోస్తా, రాయలసీమల్లో చలి తీవ్రత కొనసాగుతుందని, శనివారం స్వల్పంగా చలి తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

420 పడకల ఆస్పత్రిగా పిడుగురాళ్ల

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లలో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో అక్కడున్న 330 పడకల ఆసుపత్రిని 420 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం మెడికల్ కాలేజీ అనుమతుల కోసం 420 పడకల ఆస్పత్రి కచ్చితంగా అందుబాటులో ఉండాలి. దీంతో ప్రభుత్వం పిడుగురాళ్లలోని ఆస్పత్రిని 420 పడకల ఆస్పత్రిగా స్థాయి పెంచింది. తదుపరి దానిని బోధనాసుపత్రి, మెడికల్ కాలేజీగా ప్రభుత్వం పరిగణిస్తుంది.

'ద్రోహి' ఎవరు?



ఉమ్మడి కర్నూలు జిల్లా పాములపాడు మండలంలో ఆగిపోయిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులు

(మొదటి పేజీ తరువాయి)

జలాశయం ఎగువన 790-800 అడుగుల్లో కృష్ణా జలాలు ఎత్తిపోసి సాగు, తాగునీరు అందించాలనే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు చేపట్టారు. రాష్ట్ర విభజన తరువాత సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ముచ్చుమర్రి పూర్తి చేశారు. 2017 ఆగస్టు 8న జాతికి అంకితం చేశారు. ఇక్కడి నుంచి తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు-నగరి కాలువకు కృష్ణా వరద జలాలు ఎత్తిపోసేలా ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేయాలని ఆనాటి ఇంజనీర్లను ఆదేశించారు. అప్పటి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ సీఈ నారాయణరెడ్డి (జగన్ ప్రభుత్వంలో ఈఎన్‌సీగా పని చేసి రిటైర్డ్ అయ్యారు) సూచనలతో సాగునీటి అధికారులు ఏడాదికిపైగా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేసి.. వరద సమయంలో రోజుకు మూడు టీఎంసీలు చొప్పున ఎత్తిపోసి బనకచర్ల ఎగువన ఎస్‌ఆర్‌ఎంసీలో పోసి, అక్కడి నుంచి తెలుగుగంగ, ఎస్సార్బీసీ, కేసీ కాలువలతో పాటు కుందూ నదిలో మళ్లించేలా ముచ్చుమర్రి-బనకచర్ల లిఫ్ట్‌కు డిజైన్ చేశారు. దాదాపు రూ.3,600 కోట్లు అంచనా వ్యయంతో సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను 2018 ఆఖరులో ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అదే సమయంలో సాధారణ ఎన్నికలు రావడంతో ఈ ప్రాజెక్టుకు కదలిక రాలేదు.

జగన్ వచ్చాక జాదూ...: అప్పటికే ముచ్చుమర్రి లిఫ్ట్ పథకాన్ని జాతికి అంకితం చేయడంతో... అక్కడి నుంచే మరో లిఫ్ట్ చేపడితే న్యాయ చిక్కులు, పర్యావరణ అనుమతుల వంటి సమస్యలు తలెత్తేవి కావు. దాదాపు 13-14 కిలోమీటర్లు లింక్ చానల్ కెనాల్ తవ్వకానికి భూ సేకరణ మాత్రం చేయాల్సి వచ్చేది. కానీ... జగన్ హయాంలో అంతా తలకిందులైంది. వైసీపీ ప్రభుత్వంలో ఈఎన్‌సీగా కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ నారాయణరెడ్డి బాధ్యతలు చేపట్టారు. టీడీపీ ప్రభుత్వంలో, తన ఆధ్వర్యంలోనే రూపొందించిన ముచ్చుమర్రి -బనకచర్ల లిఫ్ట్ ప్రతిపాదనను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును యథావిధిగా చేపడితే చంద్రబాబుకు మంచి పేరు వస్తుందనే కుట్రతో నాటి జగన్ ప్రభుత్వం ముచ్చుమర్రి దిగువన సంగమేశ్వరానికి హెడ్ వర్క్ పాయింట్‌ను మార్చేసి 'రాయలసీమ లిఫ్ట్'గా మార్చేసింది. సంగమేశ్వరం నుంచి రోజుకు మూడు టీఎంసీలు ఎత్తిపోసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన ఎస్‌ఆర్‌ఎంసీలో పోసేలా డిజైన్ మార్పు చేశారు. ఇది తామే చేపడుతున్న కొత్త ప్రాజెక్టుగా, తమ ఘనతగా ప్రచారం చేసుకున్నారు. అయితే... ఈ ప్రాజెక్టును ఆపాలంటూ తెలంగాణకు చెందిన శ్రీనివాస్ ఎన్జీటీలో ఫిర్యాదు చేశారు. జస్టిస్ రామకృష్ణన్ నేతృత్వంలోని బెంచ్ విచారణ చేసింది. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలంటూ ముగ్గురు సభ్యుల కమిటీని నియమించింది.

రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం రూ.3,825 కోట్ల అంచనాతో 2020 మే 5న నాటి జగన్ ప్రభుత్వం పరిపాలనా అనుమతులిచ్చింది. దీనికి పర్యావరణ అనుమతులు లేవు. అదే ఏడాది ఆగస్టు 15న టెండర్లు పిలిచింది. ఎస్‌పీఎంఎల్-ఎన్‌సీసీ-ఎంఈఐఎల్ (మేఘా) జాయింట్ వెంచర్ (జేవీ)గా ఈ పనులు దక్కించుకుని 2021 ఫిబ్రవరి 27న పనులు ప్రారంభించారు. 24 శాతం పనులు చేసి దాదాపు రూ.923 కోట్లు ఖర్చు చేశారు. ఎన్జీటీ ఆదేశాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ పనులు చేపట్టిందని అప్పటి తెలంగాణ ప్రభుత్వం ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లింది. డీపీఆర్ తయారీ ముసుగులో క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు కూడా కొనసాగించవద్దని 2021 ఆగస్టు 7న ఎన్జీటీ ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ఆ రోజు నుంచి పనులు ఆపేశారని ఇంజనీర్లే చెబుతున్నారు. అయితే, తాగునీటి అవసరాల కోసమంటూ మళ్లీ పనులు మొదలుపెట్టగా.. తెలంగాణ ఎన్జీటీలో కంటెంప్ట్ వేయడంతో అదే ఏడాది పూర్తిగా పనులు ఆపేశామని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ముందస్తు అనుమతులు లేకుండా ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టి పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించడంతో సీపీసీబీ/ఏపీపీసీబీకి రూ.2.65 కోట్లు అపరాధ రుసుం చెల్లించాలని 2024 మార్చి 22న ఎన్జీటీ ఆదేశించింది. ఇవన్నీ జగన్ హయాంలోనే జరిగాయి. అంటే... 'ముచ్చుమర్రి-బనకచర్ల' వల్ల జరగాల్సిన మేలును చెడగొట్టింది జగన్! 'రాయలసీమ లిఫ్టు' ఆగిపోయిందీ ఆయన హయాంలోనే! మరి... సీమ ద్రోహి ఎవరు?

ఎవరు చెప్పింది నిజం...

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యూహాత్మక ప్రకటనతో వైసీపీ రచ్చ చేయడం మొదలుపెట్టింది. చంద్రబాబుపై తానే ఒత్తిడి తెచ్చి రాయలసీమ లిఫ్టు ఆపివేయించానన్న రేవంత్ మాటల్లో నిజం లేదన్నది నిజం! బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ప్రకటనతో ఇది స్పష్టమైంది. 'ఎన్జీటీని ఆశ్రయించి మా హయాంలోనే రాయలసీమ ఎత్తిపోతలను ఆపివేయించాం' అని చెప్పారు. అంటే... జగన్ హయాంలోనే అది ఆగిపోయిందని తేల్చేశారు. ఇక.. సీమ లిఫ్టును ఆపింది ఎన్డీయే అని జలశక్తిశాఖ మాజీ సలహాదారు శ్రీరామ్ కూడా స్పష్టం చేశారు.

రాష్ట్రాభివృద్ధి నేనే చేశా!

పరిశ్రమలు తెచ్చా.. అప్పులు చేసి సంక్షేమాన్ని అందించా: జగన్



అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి అంతా తానే చేశానని మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ప్రకటించుకున్నారు. తన పాలనా కాలంలో భారీ పరిశ్రమలు తెచ్చానని.. అప్పులు చేసి సంక్షేమం అందించానన్నారు. భోగాపురం విమానాశ్రయమూ నిర్మించానని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమకు ద్రోహిగా అభివర్ణించారు. సీమ మొత్తానికీ ప్రయోజనం కలిగించే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపేసిన రాక్షసుడని.. రాష్ట్రానికి విలన్ అని.. అసలు మనిషే కాదని విమర్శించారు. గురువారం తాడేపల్లి ప్యాలెస్‌కు తనకు అనుకూలంగా ఉండే మీడియా ప్రతినిధులను జగన్ పిలిపించుకున్నారు. సుదీర్ఘంగా మాట్లాడారు. చంద్రబాబుపై ఏకవచన ప్రయోగంతో చెలరేగిపోయారు. శ్రీశైలం జలాశయం నుంచి 800 అడుగుల నుంచే రోజుకు మూడు టీఎంసీల కృష్ణా జలాలను అందించే సీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేశాడని.. క్లోజ్డ్ రూమ్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆయన సమావేశమై ఈ పథకాన్ని ఆపేసేందుకు కుట్ర పన్నాడని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు కోసం త్వరలోనే భారీ ఆందోళన చేపడతానన్నారు. ఈ స్కీం ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 800 అడుగుల నుంచే రోజుకు మూడు టీఎంసీల చొప్పున తీసుకోవచ్చన్నారు. కృష్ణా జలాల్లో 120 టీఎంసీలు వాడుకునే హక్కు ఏపీకి ఉందన్నారు. తద్వారా రాష్ట్రానికి నీటి కేటాయింపులపై ఆయనకు ఏ మాత్రం అవగాహన లేదని తేలిపోయింది. నదీ జలాలను ప్రాజెక్టుల వారీగా కేటాయిస్తారన్న సత్యాన్ని చెప్పకుండా.. ఒక తూము తవ్వేసి కృష్ణా జలాలను తరలించుకుపోతామంటే కృష్ణా బోర్డు, ట్రిబ్యునళ్లు, న్యాయస్థానాలు అంగీకరిస్తాయా? సీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రకటించిన 15 రోజులకే దానిని నిలిపివేయడం ఆయనకు తెలియదా? ఆ స్టేను ఎత్తివేయించేందుకు సీఎంగా మూడున్నరేళ్లలో ఒక్క ప్రయత్నమూ చేయకపోవడం ఆయన చిత్తశుద్ధిని చాటుతోందని నిపుణులు అంటున్నారు. రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయి మరో సోమాలియా కానుందని జగన్ అన్నారు. తాను సంక్షేమ పథకాల అమలుకు క్యాలెండర్ విడుదల చేస్తే.. చంద్రబాబు అప్పులు తేవడానికి క్యాలెండర్‌ను విడుదల చేశారని ధ్వజమెత్తారు. ఒకట్రెండు పేరున్న కంపెనీలకు 99 పైసలకే ఎకరా కేటాయించి.. తెరవెనుక ఊరూపేరూలేని బినామీ కంపెనీలకు కూడా భూములు కట్టబెడుతున్నారని.. రియల్ ఎస్టేట్ కంపెనీలకూ భూములు, రాయితీలిస్తున్నారని ఆరోపించారు. పీపీపీ విధానంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి పిలిచిన టెండర్లలో ఎవరూ పాల్గొనకపోతే రాష్ట్రానికి మంచిదేనని చెప్పారు. పారిశ్రామికవేత్తల నుంచి చంద్రబాబు కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు.

రివర్ బేసిన్ అంటే ఏంటో జగన్‌కు ఏం తెలుసు?

- ఆయన మిడి మిడి జ్ఞానంతో మాట్లాడుతున్నాడు: మంత్రి నారాయణ

'నాడు అసెంబ్లీ సాక్షిగా అమరావతే రాజధాని అని ఒప్పుకున్న జగన్... తన పాలనలో మూడు ముక్కలాట ఆడారు. ఇప్పుడు నదీ గర్భంలో కడుతున్నామనడం... విడ్డూరంగా ఉంది' అని మంత్రి నారాయణ అన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మంత్రి మాట్లాడారు. 'జగన్ అధికారంలోకి వచ్చాక రాజధానికి భూములిచ్చిన రైతులతో పాటు, పనులు చేసిన కాంట్రాక్టర్లకూ డబ్బులివ్వకుండా మోసం చేశారు. అమరావతిని ధ్వంసం చేశారు. కూటమి అధికారంలోకి రాగానే రాజధాని పనులు పునఃప్రారంభించాం. పనులన్నీ చురుగ్గా సాగుతున్నాయి. రాజధాని నదిలో ఎందుకు కడతాం? అమరావతిపై జగన్ మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు. నదీ గర్భంలో భవనాలు కడుతున్నామా? రివర్ బేసిన్ అంటే ఏమిటో జగన్‌కు తెలుసా? ఆయనకు రివర్ బేసిన్‌కు, రివర్ బెడ్‌కు తేడా తెలీదు. నది వెడల్పు ఎంత? కరకట్ట ఎంత ఉండాలనేది పరిగణనలోకి తీసుకునే భవనాలు కడుతున్నాం. పట్టా భూములు నదీ గర్భంలో ఎక్కడా లేవు. రెండో విడత ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చేందుకు రైతులు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారు. దీన్ని ఎలాగైనా ఆపేయాలని జగన్ విష ప్రచారం చేస్తున్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేయడం వల్లే వైసీపీకి 11 సీట్లు వచ్చాయి. ఆయన ఇలాగే మాట్లాడితే ఈసారి అవి కూడా రావు. రాజధాని గ్రామాల్లోనే ఇళ్లు, రోడ్లు అన్నీ ఉన్నాయి. రాజధాని నగరాలన్నీ నదుల ఒడ్డునే ఉన్న విషయం జగన్‌కు తెలియపోవడం విడ్డూరం. వర్షాల కారణంగా అమరావతి పనులు కాస్త ఆలస్యమైనాయి. అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు సీఎం చంద్రబాబు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా అమరావతి నిర్మాణం ఆగదు' అని మంత్రి స్పష్టంచేశారు.

జగన్ మాటలు రైతులపై మానసిక దాడే: కొలుసు, అచ్చెన్న

రాజధాని అమరావతి ఎక్కడ కడుతున్నామో కేంద్రానికి, రూ.వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్న అంతర్జాతీయ సంస్థలకు తెలీదా..! అని మంత్రి కొలుసు పార్థసారథి, జగన్‌ను ప్రశ్నించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'అమరావతే రాజధాని అని నాడు అసెంబ్లీలో చెప్పిన జగన్.. ఇప్పుడు నదీ గర్భంలో కడుతున్నామనడం విడ్డూరం. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుపై జగన్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు' అని కొలుసు అన్నారు. రాజధాని అమరావతే అని ఒప్పుకున్న జగన్ ఇప్పుడు ద్వంద్వ వైఖరితో మాట్లాడుతున్నారని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 'అమరావతి నదీ గర్భంలో కడుతున్నామా? అమరావతిపై కుట్రలు చేయడం జగన్‌కు అలవాటుగా మారింది. ఇలాంటి మాటలు రాజధాని రైతులపై మానసిక దాడి చేయడమే. ఆయనో మానసిక రోగి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం అనే పదాలు వింటే అతనిలో మృగం బయటకు వస్తుంది. అమరావతిపై అభ్యంతరం లేదన్న సజ్జల, జగన్ నేడు మాటలు మార్చడం వారి కుటిల రాజకీయమే' అని ధ్వజమెత్తారు.

మళ్లీ అదే విషం!

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణా నదికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. రాజధానిలోని ఈ-5, ఈ-6 రోడ్ల మధ్య ఈ నిర్మాణాలు వస్తున్నాయి. కృష్ణా నదీ ప్రవాహం... ఆ తర్వాత కొంత దూరంలో వరదల సమయంలో ముంపును అడ్డుకునే కరకట్ట... ఆ కరకట్ట నుంచి ఐదారు కిలోమీటర్ల దూరంలో 'కోర్ క్యాపిటల్' వస్తోంది. కృష్ణా నదికి, నేలపాడుకు మధ్య ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, లింగాయపాలెం తదితర గ్రామాలు ఉన్నాయి. జగన్ వాదన ప్రకారం ఈ గ్రామాలన్నీ తరలించాల్సిందే. అక్కడ ఇళ్లూ వాకిళ్లూ ఉండకూడదు. వాటన్నింటినీ ఖాళీ చేయించాల్సిందే! అసలు విషయం ఏమిటంటే... రాజధాని గ్రామాలేవీ 'రివర్ బేసిన్' పరిధిలోకి రావు. కరకట్ట నుంచి వంద మీటర్ల వరకు మాత్రమే రివర్ బేసిన్‌గా పరిగణిస్తున్నట్లు సాగునీటి శాఖ అధికారులు స్పష్టం చేశారు. అయినప్పటికీ... 'రాజధానిని రివర్ బేసిన్‌లో నిర్మిస్తున్నారు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలి' అని జగన్ డిమాండ్ చేయడం విశేషం. ఇది అమరావతిపై విషం చిమ్మడం తప్ప మరొకటి కాదని రాజధాని గ్రామ రైతులు మండిపడుతున్నారు.

మరి మీ ప్యాలెస్ మాటేమిటి?

'జగన్ తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నారు. మేం అధికారంలోకొస్తే అమరావతి ఇక్కడే ఉంటుంది' అని 2019 ఎన్నికల ముందు వైసీపీ నేతలు మభ్యపెట్టారు. ఆ సంగతి పక్కనపెడితే... తాడేపల్లిలో జగన్ ప్యాలెస్ కృష్ణా నదికి కేవలం 2 కిలోమీటర్ల లోపే ఉంటుంది. జగన్ చెప్పిన లెక్క ప్రకారం ఇదీ 'రివర్ బేసిన్'లో ఉన్నట్లే. మరి ఆయన తన ప్యాలెస్‌ను ఖాళీ చేసేస్తారా?

'ఆంగ్ల' మర్మమేమిటో!?

జగన్ బుధవారం తాడేపల్లి ప్యాలెస్ లోపల ఎంపిక చేసుకున్న మీడియాతో మాట్లాడారు. అంతా తెలుగులోనే! అది ముగిశాక... ఎన్నడూలేని విధంగా బయటకు వచ్చి కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మరోసారి మాట్లాడారు. లోపల తెలుగులో మాట్లాడిన జగన్... తన సందేశం ఎవరికో చేరాలన్న ఉద్దేశంతో కాబోలు బయట మీడియాతో ఆంగ్లంలో మాట్లాడారు. జాతీయ మీడియా ప్రతినిధులను పిలిపించుకోవడం, అమరావతి గురించి ప్రస్తావించేలా చూడటం, అంతా వ్యూహం ప్రకారమే జరిగినట్లు తెలుస్తోంది. దీని మర్మమేమిటి? ఎవరి కోసం 'ఆంగ్లంలో' సంకేతాలు పంపారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రివర్ బేసిన్‌లో రాజధాని కడతారా?

- కొత్త పాట అందుకున్న జగన్

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మూడు రాజధానుల పేరిట రాజధాని అమరావతిని ధ్వంసం చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి.. దానిపై మరోసారి విషం కక్కారు. ఈసారి... 'రివర్ బేసిన్' అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. నదీ పరివాహక ప్రాంతం (రివర్ బేసిన్)లో రాజధాని నిర్మిస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆ ప్రాంతంలో ఒక్క భవనం కూడా నిర్మించేందుకు వీల్లేదని గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో చెప్పారు. వాటికి విరుద్ధంగా నిర్మిస్తున్నందున సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలన్నారు. అలాగే... రాజ్యాంగంలో రాజధాని అనే పదమే లేదని చెప్పారు. 'ప్రభుత్వం ఎక్కడ కూర్చుంటే అదే రాజధాని. ఈ ముఖ్యమైన విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలి. ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే.. అక్కడికే మంత్రులంతా వస్తారు. మంత్రులు ఎక్కడుంటే... హెచ్‌వోడీలూ అక్కడికే వస్తారు. ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అదే రాజధాని. ఇదే రాజ్యాంగం చెబుతోంది. చంద్రబాబు కడుతున్న సోకాల్డ్ రాజధాని రివర్ బేసిన్‌లో ఉంది. ఆయనకు మెదడులో ఫ్యూజు, ప్లగ్గు ఉన్నాయో లేవో! అమరావతిలో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ సదుపాయాలు లేవు. కానీ అక్కడే చంద్రబాబు రాజధాని నిర్మాణం చేపడతానంటున్నారు' అని జగన్ విమర్శించారు. 50 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాలకే రూ.లక్ష కోట్లు అవసరమని పాతపాటే పాడారు. ఇంకా కొత్తగా భూసేకరణ ఎందుకని ప్రశ్నించారు. బినామీల కోసమే సేకరిస్తున్నారని ఆరోపించారు.

దెయ్యాలూ సిగ్గుపడతాయ్!

- జగన్ చేసింది సీమ 'థెఫ్ట్' ఇరిగేషన్
- ఆయన మాటల్లో ప్రేమ.. చేతల్లో విధ్వంసం
- ఎవరు ద్రోహం చేశారో చర్చకు సిద్ధమా?
- మంత్రులు, ఎమ్మెల్యేల ఫైర్
- అసెంబ్లీకి వస్తే.. చర్చిస్తాం: మంత్రి కేశవ్



అమరావతి/జగ్గయ్యపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై జగన్ అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పలువురు మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. ఆయన మాటలు వింటే దెయ్యాలు కూడా సిగ్గు పడతాయన్నారు. 'వైనాట్ 175' అని 11 సీట్లకు పరిమితమైనా ఇంకా జ్ఞానోదయం కాలేదని, ఆయన తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని వ్యాఖ్యానించారు. గురువారం అమరావతి సచివాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్‌రెడ్డి, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ కాల్వ శ్రీనివాసులు, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు మీడియాతో మాట్లాడారు. 'జగన్ నోట ప్రతి మాటా అబద్ధమే. రాయలసీమ లిఫ్ట్ వైసీపీ హయాంలో పూర్తి చేశామనడం పూర్తిగా అవాస్తవం. దానికి డీపీఆర్ సిద్ధం చేసుకునేందుకే పనులు చేసినట్లు ఆయనే అఫిడవిట్ వేశారు. ఈ ప్రాజెక్టు పేరుతో రూ.900 కోట్లు రుణం తెచ్చి.. దారి మళ్లించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను.. సీమ థెఫ్ట్ ఇరిగేషన్‌గా మార్చుకున్నారు. దీనిపై చంద్రబాబు కేసులు వేశాడంటాడు. నిజానికి కేసులు వేసింది ఎవరో ఆయనకు తెలీదా? చీకటి ఒప్పందాలు ఎవరివో అందరికీ తెలుసు. గండికోట తానే కట్టానంటాడు. వెలిగొండకు రూ.వెయ్యి కోట్లు పెండింగ్ పెట్టారు. కుప్పానికి నీరిచ్చామంటున్న ఆయన మాటలు నమ్మితే దెయ్యాలు, పిల్లులు కూడా సిగ్గుపడతాయి. ఆయన మాటల్లో ప్రేమ.. చేతల్లో విధ్వంసం. క్రెడిట్ చోరీ అంటున్న జగన్‌కు.. అసలు క్రెడిట్ ఏముంది? ఏడాదిన్నరలో పరిమితుల ప్రకారమే రూ.79 వేల కోట్ల అప్పు తెచ్చాం' అని కేశవ్ చెప్పారు. సీమ కోసం జగన్ ఏమీ చేయలేదని బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎక్కువ కాలం రాయలసీమ బయట ఉన్న జగన్‌కు సీమ పేరు ఎత్తే హక్కు, అర్హత లేవని కాల్వ అన్నారు. 'సీమ వెనుకబాటు తనం, అక్కడి ప్రజల పేదరికమే ఆయనకు రాజకీయ పెట్టుబడి. సీమ ప్రాజెక్టుల్లో వందల కోట్లు దోపిడీ చేశారు' అన్నారు. రాయలసీమకు ఎవరు ద్రోహం చేశారో తేల్చేందుకు జగన్ చర్చకు రావాలని మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సవాల్ చేశారు.

టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీశ్‌కుమార్ మరణంపై

దర్యాప్తు వేగవంతం చేయండి

- చార్జ్‌షీట్ దాఖలు చేసేవరకు పర్యవేక్షిస్తాం
- పరకామణి చోరీ కేసు నిందితుడు రవికుమార్‌తో టీటీడీ, సెక్యూరిటీ, పోలీసు అధికారులు కుమ్మక్కు
- ఆ అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోండి
- సంబంధిత శాఖలకు హైకోర్టు ఆదేశం
- పరకామణి కేసు దర్యాప్తు తీరుపై సంతృప్తి



అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పరకామణిలో చోరీకి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసిన టీటీడీ అప్పటి ఏవీఎస్వో, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వై.సతీశ్ కుమార్ మరణంపై దర్యాప్తును వేగవంతం చేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. చార్జ్‌షీట్ దాఖలు చేసేంతవరకు తాము దర్యాప్తును పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది. ఏసీబీ దాఖలు చేసిన ప్రాథమిక దర్యాప్తు నివేదికను పరిశీలిస్తే నిందితుడు రవికుమార్ ప్రభుత్వ అధికారి నిర్వచనం పరిధిలోకి వస్తారని, ఐపీసీ సెక్షన్ 409(నేరపూరిత విశ్వాసఘాతుకం) అతనికి వర్తిస్తుందని పేర్కొంది. రవికుమార్, అతని కుటుంబ సభ్యులకు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు, స్థిరచరాస్తులతో పాటు బంగారం, వెండి పెద్దఎత్తున ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయని పేర్కొంది. పరకామణి చోరీ కేసును నిర్వీర్యం చేసేందుకు టీటీడీలోని అప్పటి అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు రవికుమార్‌తో కుమ్మక్కయ్యారని తెలిపింది. రవికుమార్, అతని కుటుంబ సభ్యుల ఆస్తుల స్వీకరణ విషయంలో టీటీడీ అధికారులు, బోర్డు సభ్యులు నిబంధనలు అనుసరించలేదని పేర్కొంది. చట్టనిబంధనలు అతిక్రమించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని టీటీడీ, పోలీసు, సెక్యూరిటీ, సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించింది. కేసు దర్యాప్తుపై సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు సంబంధిత అధికారులను అభినందించింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుసరించి చట్టనిబంధనల మేరకు దర్యాప్తు కొనసాగించవచ్చని సీఐడీ, ఏసీబీకి స్పష్టం చేసింది. పరకామణిలో కానుకల లెక్కింపునకు సంబంధించి తీసుకురానున్న తక్షణ సంస్కరణల విషయంలో టీటీడీ సమర్పించిన నివేదికపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. కానుకలు లెక్కింపునకు వచ్చే భక్తులను అమానవీయరీతిలో తనిఖీ చేయడాన్ని ఆమోదించలేమని పేర్కొంది. కానుకల లెక్కింపునకు టేబుళ్లు ఏర్పాటు చేయాలని న్యాయస్థానం చేసిన సూచనను పాటించడం సాధ్యంకాదని ఈవో నివేదికలో పేర్కొనడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. లెక్కింపు ప్రక్రియలో మర్యాదపూర్వక విధానాన్ని అమలు చేసేందుకు అత్యుత్తమ ఆలోచనలతో ముందుకు రావాలని టీటీడీ ఈవోను ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది. గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.

కానుకలపై నడవడం సంప్రదాయమా?

పరకామణిలో సంస్కరణలకు సంబంధించి తక్షణ, శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని టీటీడీని ఆదేశించిన విషయం తెలిసిందే. గురువారం వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. టీటీడీ తరపు న్యాయవాది శ్రీనివాసబాబా వాదనలు వినిపిస్తూ.. "ప్రతీరోజు పరకామణిలో 300మంది భక్తులు కానుకలు లెక్కిస్తారు. వీరందరికీ టేబుళ్లు ఏర్పాటు చేయడం ఆచరణ సాధ్యం కాదు. మార్పులు చేయాలంటే ఈవో ఒక్కరే నిర్ణయం తీసుకుంటే సరిపోదు. ఏమైనా మార్పులు చేయాలంటే ఆగమశాస్త్ర పండితులు, టీటీడీ బోర్డు ఆమోదం తప్పనిసరి" అని తెలిపారు. తాను పరకామణిలో జరిగే ప్రక్రియను ఫొటోలలో చూశానని, కానుకలను కింద పోసి వాటిపై నడవడం సంప్రదాయమా అని ప్రశ్నించారు. ప్రస్తుతం కానుకల లెక్కింపుకు అనుసరిస్తున్న విధానం సరికాదన్నారు.

రవికుమార్ అప్పీల్‌పై విచారణ వాయిదా

పరకామణి చోరీ కేసును లోక్ అదాలత్ వద్ద రాజీ చేసుకున్న వ్యవహారం పై సీఐడీ విచారణకు ఆదేశించడంతో పాటు ఆస్తుల విషయంలో దర్యాప్తు చేయాలని ఏసీబీని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు సవాల్ చేస్తూ నిందితుడు రవికుమార్ దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణను ధర్మాసనం ఈ నెల 29కి వాయిదా వేసింది. పూర్తిస్థాయిలో వాదనలు వినేందుకు సమయం లేనందున అప్పీల్‌పై మరోరోజు విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది.

చంద్రబాబే మన నాయకుడు

» మళ్లీ గెలిచి చరిత్ర సృష్టిద్దాం
» పార్లమెంటరీ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో లోకేశ్



అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించి చరిత్ర తిరగరాయాలన్నదే లక్ష్యం. టీడీపీలో ఉండే ప్రతి ఒక్కరికీ ఆ లక్ష్యమే అజెండా కావాలి' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో ఇటీవల కొత్తగా నియమితులైన పార్లమెంటరీ పార్టీ అధ్యక్ష, కార్యదర్శి జోనల్ కో-ఆర్డినేటర్లతో లోకేశ్ సుమారు 2 గంటలపాటు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. 'మనందరికి చంద్రబాబు ఒక్కరే నాయకుడు, నాతోసహా మనమంతా పార్టీలో పనిచేసే సైనికులమే. సమస్యలు ఏమైనా ఉంటే బాధ్యత తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలి. అందరికీ నేను అందుబాటులో ఉంటా. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, మండల పార్టీ అధ్యక్షులతో క్యాలండర్ ప్రకారం సమీక్ష సమావేశాలు నిర్వహించాలి' అని మంత్రి పేర్కొన్నారు. '1999లో మాత్రమే మనం రెండోసారి గెలిచాం. ఆ చరిత్ర తిరగరాయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలి. ఆయా నేతల పనితీరుపై మూడు నెలలకోసారి సమీక్షిస్తా. పని చేయని వారిని మార్చడానికి వెనుకాడబోము. ఉత్తమ కార్యకర్తలకే నామినేటెడ్ పదవుల్లో పెద్దపీట వేశాం' అని స్పష్టం చేశారు. 'రాబోయే రోజుల్లో అందరం కలసి పార్టీని బలోపేతం చేద్దాం. చంద్రబాబు ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్నారు. టీడీపీకి కార్యకర్తే అధినేత' అని లోకేశ్ అన్నారు.

వైసీపీలో చీలిక ఖాయంగా కనిపిస్తోంది: యనమల

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసిన అంశాన్ని అసెంబ్లీ నైతిక విలువల కమిటీ పరిశీలించి, వెలుగులోకి తీసుకురావడంతో వారి బూటకపు చర్యలు బయటపడ్డాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'జగన్ అసెంబ్లీ కార్యకలాపాలను పూర్తిగా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. మరో వైపు ఆయన పార్టీ ఎమ్మెల్యేలు జగన్‌కు తెలియకుండా రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. ఇది ఆ పార్టీలో అంతర్గత విభేదాలను ప్రతిబింబిస్తోంది. ఈ పరిణామాలు వైసీపీ చీలికకు దారితీయవచ్చు' అన్నారు.

మాక్ అసెంబ్లీ విద్యార్థులకు స్పీకర్ కానుకలు

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులకు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు న్యూ ఇయర్ కానుకలుగా గ్రీటింగ్ కార్డులు, అసెంబ్లీ క్యాలెండర్లు పంపిణీ చేశారు. గత ఏడాది నవంబరులో అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో ప్రతిభ కనబరిచిన 175 మంది విద్యార్థులను స్పీకర్ ప్రత్యేకంగా అభినందించారు.

సకాలంలో రుణాలు చెల్లించండి

» అప్పుడు బ్యాంకులు ఎక్కువ రుణాలు ఇస్తాయి
» డ్వాక్రా మహిళలకు చంద్రబాబు సూచన
» జీవనోపాధి పెంపుపై దృష్టి సారించండి
» సొంత ఉత్పత్తులకు మార్కెటింగ్ పెంచుకోవాలి
» 'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త' అంశంపై ఇక ప్రతీ నెలా సమీక్ష
» పారిశ్రామికవేత్తలుగా చేసేందుకు తోడ్పాటు
» గుంటూరులో 'సరస్'లో ముఖ్యమంత్రి


సరస్ మేళాలో రూ.1375 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కును ప్రదర్శిస్తున్న సీఎం చంద్రబాబు, డ్వాక్రా సంఘాల మహిళలు

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సకాలంలో చెల్లిస్తే బ్యాంకులు ఎక్కువ మొత్తంలో రుణాలు ఇచ్చి సహకరిస్తాయని సూచించారు. రుణాలు తీసుకుని ఇంట్లో కూర్చోవద్దని, అలా చేస్తే అవి కచ్చితంగా మిమ్మల్ని మింగేస్తాయని, తర్వాత అప్పులు పాలైపోతారని హెచ్చరించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పుతో జీవనోపాధి పెంపొందించుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్‌ను పెంచుకోవాలన్నారు. డ్వాక్రా మహిళల కుటుంబ సభ్యులే రాష్ట్రంలో 3.40 కోట్ల మంది ఉన్నారని, వాళ్లంతా ఆయా ఉత్పత్తులను కొనుగోళ్లు చేసినా చాలన్నారు. గురువారం గుంటూరులో కేంద్ర, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలు, సెర్ప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎస్ఏఆర్ఏఎస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్స్ సొసైటీ) ప్రదర్శనలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి వారి బాగోగులు, ఆర్థిక పరిస్థితులు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

నా మానస పుత్రికలు డ్వాక్రా, మెప్మాలు

"డ్వాక్రా, మెప్మాలు నా మానస పుత్రికలు. నాకు అత్యంత ప్రీతివంతమైనవి. మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన సంఘాలు నేడు రూ. లక్ష కోట్ల టర్నోవర్‌కు చేరుకున్నాయి. ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నా.. ఈ రెండు సంస్థలు మాత్రం జీవితంలో శాశ్వతంగా గుర్తుండి పోతాయి. ఆడబిడ్డల సభకు వచ్చినప్పుడు కలిగే ఆనందం నా జీవితంలో ఏ పని చేసినా ఉండదు. డ్వాక్రా సంఘాలను మరో స్థాయికి తీసుకెళ్లడమే నా లక్ష్యం. పొదుపు ఉద్యమాన్ని కాపాడే బాధ్యత మీరు తీసుకోండి. మీ అందరిని బాగు పడేలా చేసే బాధ్యత నేను తీసుకొంటాను. రాష్ట్రంలో ఉండే ఐదు కోట్ల మంది ఆరోగ్యంగా, ఆనందంగా, ఆర్థికంగా బావుండేలా చేయడమే నా కోరిక. అది తప్పక సాధిస్తా" అని భరోసా కల్పించారు.

ఆడబిడ్డలతో అనుబంధం ఇప్పటిది కాదు

"తెలుగుదేశం పార్టీకి ఆడబిడ్డలతో అనుబంధం ఇప్పటిది కాదు. దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఆస్తిలో సమాన హక్కు చట్టం తెచ్చిన మహనీయుడు నందమూరి తారక రామారావు. 1990లలో నేను సీఎం అయ్యాక మహిళల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు తీసుకురావడానికి డ్వాక్రా సంఘం పెట్టి చైతన్యం తీసుకువచ్చాను. సరస్ ఎగ్జిబిషన్‌లు సాధారణంగా ఢిల్లీలో జరుగుతుంటాయి. అలాంటి కార్యక్రమాన్ని ఇక్కడికి తీసుకొచ్చినందుకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను అభినందిస్తున్నా" అని చంద్రబాబు అన్నారు.

నీతి, నిజాయితీగా ఉండాలి

"గ్రామీణ ప్రాంతాల్లో 89 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 24 లక్షలు కలిపి మొత్తం 1.13 కోట్ల పొదుపు సంఘాలున్నాయి. ఈ సంఘాలలోని సభ్యులు నీతి, నిజాయితీగా ఉండాలి. బ్యాంకుల నుంచి తీసుకొన్న రుణం ఎగ్గొట్టకుండా సకాలంలో చెల్లిస్తే ఇంకా ఎక్కువ మొత్తంలో రుణాలు ఇచ్చి సహకరిస్తారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు రూ.31,175 కోట్ల బ్యాంకు రుణాలను తీసుకొన్నారు. 26 వేల కోట్ల రూపాయల రివాల్వింగ్ ఫండ్ ఉన్న ఏకైక సంస్థ మీది. ఏమైనా డబ్బు అవసరమైతే 48 గంటల్లో స్త్రీనిధి ఇస్తున్నది. రూ.లక్ష కోట్ల అప్పు కావాలన్నా డ్వాక్రా సంఘాలకు ఇచ్చేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయి. ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్నదే నా సంకల్పం. ఈ ఏడాది 94 వేల మంది చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పి పారిశ్రామికవేత్తలయ్యారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సెర్ప్ సీఈవో బీ కరుణకు ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాలను నిర్దేశిస్తున్నా. ప్రతీ నెలా సమీక్ష, మూడు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేస్తాను. 70 శాతం మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయడమే మా లక్ష్యం" అని చంద్రబాబు అన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ ఇక్కడి నుంచి అమెరికా వెళ్లి చదువుకొని వ్యాపారాలు చేసి బాగా సంపాదించారని, దేశంలోని పార్లమెంట్ సభ్యుల్లో ఆయనే అత్యంత సంపన్నుడని అన్నారు. పెమ్మసానిని చూసి గర్వపడుతున్నానన్నారు. ఈ సభలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిర్ణయాలొద్దు!

» దుర్గగుడి ఈవో, విద్యుత్ అధికారులపై సర్కారు సీరియస్
» ఆలయానికి విద్యుత్ బంద్‌పై క్యాబినెట్‌లో కీలక చర్చ
» రెండు శాఖల అధికారులనూ సచివాలయానికి పిలిపించిన మంత్రులు ఆనం, గొట్టిపాటి

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేతపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. విద్యుత్, దేవదాయ శాఖల అధికారులతోపాటు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్‌ను గురువారం సచివాలయానికి పిలిపించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విద్యుత్ బకాయిల చెల్లింపులో ఎందుకు జాప్యం జరిగిందని, ఈవో అసలు ఏం చేస్తున్నారని ఆరాతీసింది. ఇదే సమయంలో ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులకు మాటమాత్రం చెప్పకుండా ఆలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై ఆ శాఖ అధికారులపైనా మండిపడినట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పిచ్చిపనులతో ప్రభుత్వానికి అప్రతిష్ఠ తెస్తారా అని అధికారులను మందలించినట్లు తెలిసింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ అంశం చర్చకొచ్చింది. జనసేనకు చెందిన మంత్రులు దీనిని ప్రస్తావించారని తెలిసింది. దీనికి కారణమైన తమ అధికారులపై చర్యలు తీసుకున్నామని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంత్రివర్గంలో చెప్పినట్లు తెలిసింది. సమావేశం జరుగుతుండగానే విద్యుత్ శాఖ అధికారులు, దేవదాయ శాఖ కార్యదర్శి, కమిషనర్, దుర్గగుడి ఈవోను, ఇతర అధికారులను సచివాలయానికి పిలిపించారు. దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, విద్యుత్ మంత్రి గొట్టిపాటి వారితో మాట్లాడారు. విద్యుత్ సరఫరా నిలివేతకు దారితీసిన పరిస్థితులు, ఆ తర్వాతి పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. రూ.3 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయేవరకు ఎందుకు కరెంటు బిల్లులు చెల్లించలేదని ఈవోను ప్రశ్నించారు. 'బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖ నుంచి వచ్చిన నోటీసులకు ఎందుకు స్పందించలేదు? బిల్లులు ఎందుకు చెల్లించలేదు' అని నిలదీసినట్లు తెలిసింది. 2023 ఫిబ్రవరి నుంచి రూ.3.08 కోట్లమేర విద్యుత్ బకాయిలు ఉన్నాయని.. అంత పేరుకుపోయేవరకు ఎందుకు చెల్లించలేదని అడిగారు. దీనిపై ఉన్నత స్థాయిలో సమీక్ష చేశారా? ఈ విషయాన్ని ఎందుకు గుర్తించలేదని దేవదాయ కమిషనర్‌ను కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. అసలు ఇంత ప్రముఖ ఆలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేయాలన్న నిర్ణయం ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎలా తీసుకుంటారు.. ఈ విషయాన్ని ఎస్ఈకి, చీఫ్ ఇంజనీర్‌కు ఎందుకు తెలియజేయలేదని విద్యుత్ అధికారులను మంత్రులు ప్రశ్నించారు. ప్రభుత్వ స్థాయిలో అనుమతి తీసుకుని చేయాల్సిన పనిని, ఈఈ స్థాయిలో ఎలా నిర్ణయిస్తారని.. ఇది తీవ్రమైన క్రమశిక్షణ రాహిత్యమని గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సమన్వయం లేకపోవడం, కీలకమైన అంశాలను పెద్దల దృష్టికి తీసుకురాకపోవడం, నోటీసులకు స్పందించకుండా నాన్చడం వంటి చర్యలు అధికారుల క్రమశిక్షణరాహిత్యానికి నిదర్శనమని, ఈ వైఫల్యాలపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని మంత్రులు మండిపడినట్లు తెలిసింది. ఆలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేతపై క్షేత్ర స్థాయి అధికారులు సొంత నిర్ణయాలు తీసుకోవద్దని, బకాయిలు, ఇతర సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేసినట్లు తెలిసింది.

రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయా?

» నేడు క్షేత్రస్థాయి పరిశీలనకు చంద్రబాబు
» తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో రైతులు, రెవెన్యూ సిబ్బందితో ముఖాముఖి

అమరావతి/రాజమహేంద్రవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారంపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు రెవెన్యూ శాఖకు కీలక కార్యాచరణ అప్పగించారు. దాని అమలు ఎలా ఉందో తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో పర్యటించనున్నారు. అక్కడ జరుగుతున్న భూముల సర్వే, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, ఇతర రెవెన్యూ అంశాలపై రైతులతో సీఎం నేరుగా మాట్లాడతారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు రైతుల భూముల వద్దకే ముఖ్యమంత్రి వెళ్లే అవకాశం ఉంది. ఆ తర్వాత రీసర్వే తీరు, గ్రామంలో రైతుల సమస్యలు, వాటికి ప్రభుత్వ పరిష్కారాలు, సిబ్బంది పట్ల రైతుల అభిప్రాయాలు ఇలా అనేక అంశాలపై సీఎం రైతులు, రెవెన్యూ అధికారులతో ముఖాముఖిగా మాట్లాడనున్నారు. ఈ పర్యటనలో సీఎంతో పాటు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ ప్రత్యేక సీఎస్ జి.సాయిప్రసాద్, సీసీఎల్ఏ జి. జయలక్ష్మి, సర్వే డైరెక్టర్ కూర్మనాథ్, అదనపు సీసీఎల్ఏ వెంకట మురళితో పాటు పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొంటారు. జగన్ హయాంలో జరిగిన రీసర్వే 1.0లో సమస్యలు, వాటికి పరిష్కారం దొరక్కపోవడం, ప్రస్తుతం జరుగుతున్న రీసర్వే 2.0లో రైతులు, భూ యజమానులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ఉదంతాలను ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెవెన్యూశాఖ సమీక్ష నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులను రీసర్వే జరుగుతున్న గ్రామాలకు వెళ్లి రైతులు, భూ యజయానులతో మాట్లాడాలని, సమస్యలేమిటో తెలుసుకొని స్థానికంగానే పరిష్కారం చూపాలని సమీక్షలో చంద్రబాబు ఆదేశించారు. ఇప్పుడు స్వయంగా క్షేత్రస్థాయిలో రీసర్వే తీరు, పాస్‌పుస్తకాల అంశాన్ని పరిశీలించాలని నిర్ణయించి రాయవరం వెళుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆ గ్రామానికి తీసుకెళ్లడం ద్వారా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ చిత్తశుద్ధి చాటిచెప్పాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన. రైతుల సమస్యలకు పరిష్కారాలు అక్కడే అధికారులతో చెప్పించే అవకాశం ఉంది. సీఎం చంద్రబాబు హెలీకాప్టర్‌లో ఉదయం 11 గంటలకు రాయవరం చేరుకుంటారు. ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తారు. 12.05 నుంచి 1.30 గంటల వరకూ ప్రజావేదిక సమావేశంలో పాల్గొంటారు. 2.05 నుంచి 3.35 వరకూ టీడీపీ కార్యకర్తలతో సమావేశమవుతారు. అంతకుముందు రాయవరంలో దివంగత మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 3.45కి తాడేపల్లికి తిరుగు ప్రయాణం అవుతారు.

ఏసీబీ కేసుల కొట్టివేత చెల్లదు!

» ఏపీ హైకోర్టు తీర్పు న్యాయానికి విఘాతం
» సాంకేతిక కారణాలతో ఎఫ్ఐఆర్‌ల రద్దు.. న్యాయాన్ని అపహస్యం చేయడమే: సుప్రీంకోర్టు
» హైకోర్టు తీర్పు రద్దు.. తిరిగి దర్యాప్తు కొనసాగింపు
» 6 నెలల్లో దర్యాప్తులు పూర్తి చేయాలని ఏసీబీకి నిర్దేశం



న్యూఢిల్లీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను సాంకేతిక కారణాలతో కొట్టివేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. హైకోర్టు తీర్పు న్యాయానికి విఘాతం కలిగించేలా ఉందని ఆక్షేపించింది. ఆ తీర్పు న్యాయాన్ని అపహస్యం చేయడమే నంటూ తీవ్రవ్యాఖ్యలు చేసింది. చట్టాన్ని వక్రీకరించడంలో హైకోర్టు తప్పుదోవ పట్టిందని వ్యాఖ్యానించింది. అతి సాంకేతిక కారణాలతో ఏసీబీ కేసులను కొట్టివేయడం చెల్లదని తేల్చిచెప్పింది. హైకోర్టు తీర్పును రద్దు చేసింది. హైకోర్టు తీర్పు వల్ల నిలిచిపోయిన కేసుల దర్యాప్తును తిరిగి కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. ఈమేరకు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం కీలకతీర్పును వెలువరించింది.

నాడు 15 మందిపై అవినీతి కేసుల కొట్టివేత

2016-2020 మధ్య కాలంలో అనేకమంది అధికారులు, ఉద్యోగులపై ఏపీ ఏసీబీ-సీఐయూ(సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్, విజయవాడ) అవినీతి కేసులను నమోదు చేసింది. అయితే, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్పీసీ) 1973 సెక్షన్ 2(ఎస్) ప్రకారం విజయవాడలోని ఏసీబీ కార్యాలయాన్ని పోలీస్‌స్టేషన్‌గా ప్రకటిస్తూ రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వలేదని, అందువల్ల ఆ ఎఫ్ఐఆర్‌లకు చట్టబద్ధత లేదని 15 మంది నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఏసీబీ విభాగంలోని జాయింట్ డైరెక్టర్ల కార్యాలయాలను పోలీసుస్టేషన్లుగా గుర్తిస్తూ 2003లోనే ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందని, పునర్విభజన చట్టంలోని సెక్షన్ 101, 102 ప్రకారం రాష్ట్ర విభజన అనంతరం ఆ చట్టాలు అమల్లో ఉంటాయని నాడు ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపించారు. అయితే, విజయవాడలోని ఏసీబీ సీఐయూ యూనిట్‌ను పోలీసుస్టేషన్‌గా నోటిఫై చేస్తూ 2022 సెప్టెంబరు 14న గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో 2016 నుంచి 2020 మధ్య నమోదు చేసిన 15 కేసులను రద్దు చేస్తున్నట్టు హైకోర్టు పేర్కొంది. ఆ ఎఫ్ఐఆర్‌లను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ గతేడాది ఏసీబీ జాయింట్ డైరెక్టర్(రాయలసీమ), రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. విచారణ జరిపిన సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును రద్దు చేస్తూ తాజాగా తీర్పు ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లో సెక్షన్లు 100, 101, 102 ప్రకారం, ఉమ్మడి రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టాలు, జీవోలు కొత్త రాష్ట్రంలోనూ కొనసాగుతాయని స్పష్టం చేసింది. నిలిచిపోయిన కేసుల విచారణను ఏసీబీ అధికారులు వెంటనే ప్రారంభించవచ్చని, ఈ తీర్పు కాపీ అందిన తేదీ నుంచి 6 నెలల లోపు దర్యాప్తును పూర్తి చేసి నివేదికలు అందించాలని ఆదేశించింది.




ఆవకాయ్ - అమరావతి ఉత్సవంలో కృష్ణమ్మకు హారతి, నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు, హెర్వే డెల్ఫీ

తెలుగుజాతి ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి

» సంస్కృతి, సాహిత్యం, సినిమా తెలుగు ప్రజల బలం
» ఆవకాయ్-ఫెస్టివల్‌లో సీఎం చంద్రబాబు
» విజయవాడ పున్నమిఘాట్‌లో ఘనంగా ప్రారంభం

విజయవాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): "తెలుగు జాతి ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరం కాపాడుకోవాలి. సంస్కృతి, సాహిత్యం, సినిమా.. తెలుగు ప్రజల బలం. సృజనాత్మకతకు తెలుగు సినిమా చిరునామా. భక్తప్రహ్లాద నుంచి బాహుబలి వరకు మన భాష, సంస్కృతి, సృజనాత్మకతలు ప్రపంచ వ్యాప్తం అయ్యాయి. తెలుగు సాంస్కృతిక వైభవం, సంప్రదాయాలను ముందుకు తీసుకువెళ్లడం కోసమే ఆవకాయ్-అమరావతి ఫెస్టివల్ నిర్వహించటానికి కారణం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గురువారం విజయవాడ భవానీపురంలోని పున్నమిఘాట్‌లో ఆవకాయ్-అమరావతి ఫెస్టివల్‌ను చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. తెలుగు జాతి ఎక్కడున్నా నంబర్ వన్‌గా ఉండాలని ఆకాంక్షించారు. ఆవకాయ్ అంటే గుర్తుకొచ్చేది ఆంధ్రప్రదేశ్ అని, ఆవకాయ్ మన సంప్రదాయం, సాంస్కృతిక వైభవమని చెప్పారు. సంస్కృతి సంప్రదాయాలను చాటే కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, రానున్న రోజుల్లో మూడు రోజులు పాటు ఆవకాయ్-అమరావతి వేడుకలు ప్రభుత్వ పరంగా జరుపుదామన్నారు. ఆహారం అంటే ప్రపంచానికి గుర్తుకు వచ్చేది భారత్ అయితే, మనదేశంలో ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. రాబోయే రోజులలో ప్రపంచానికే ఏపీ ఆతిథ్యం ఇచ్చే స్థితికి వస్తుందన్నారు. 2019-24 మధ్యలో పండుగలు లేవని, ప్రజలు నవ్వడం మర్చిపోయారని అంటూ వైసీపీ పాలనపై సెటైర్లు వేశారు. ఈ సభలో సీఎం ఇంకా ఏమన్నారంటే.. "ముఖ్యమంత్రిగా ఉండగా మూడు పుష్కరాలు రావడం నా అదృష్టం. మొదటి పుష్కరాలు ఉమ్మడి ఏపీలో చేశాం. రెండో పుష్కరాలు రాష్ట్రం విడిపోయిన తర్వాత చేశాం. మూడోసారి గోదావరి పుష్కరాలు 2027లో, కృష్ణా పుష్కరాలు 2028లో నిర్వహిస్తాం. సాహిత్యం మన వారసత్వ సంపద. నన్నయ్య, తిక్కన, ఎర్రన్న, పోతన, అన్నమయ్య వంటి వారి వారసులం. గురజాడ, శ్రీశ్రీ వంటి వారి రచనలు సమాజంలో మార్పు తేవటానికి కృషి చేశాయి.

ప్రపంచ టెక్నాలజీని ఏపీకి తెస్తా

ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం. నాలెడ్జ్ ఎకానమీ మనకు బ్యాక్‌బోన్. ప్రపంచంలో ఉన్న టెక్నాలజీని ఇక్కడకు తెస్తా. దానిని ఉపయోగించుకొని అభివృద్ధికిలోకి రావాలి. రాబోయే రోజుల్లో స్పేస్ సిటీగా తిరుపతి, డ్రోన్ సిటీగా ఓర్వకల్లు ఉంటాయి. ఎలక్ట్రానిక్స్‌కు ఏపీ చిరునామాగా మారుతుంది. ఉద్యోగాలు కల్పించేందుకు టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నాం. ప్రపంచం అంతా సూర్యలంక బీచ్ గురించి మాట్లాడుకునే పరిస్థితి వస్తుంది. సంక్రాంతి లాంటి పండుగలను గ్రామాలకు వెళ్లి అందరితో కలిసి ఉత్సాహంగా జరుపుకోవాలి. ఇరవై ఏళ్ల క్రితం నుంచి సంక్రాంతికి మా కుటుంబం నారావారిపల్లెకు వెళతాం. అంతా కలిసి పండగ చేసుకుంటాం. ప్రతి ఒక్కరూ జన్మభూమితో అనుసందానం అవ్వాలి. అమరావతి ప్రపంచంలోనే బెస్ట్ సిటీగా ఉంటుంది. టూరిజం బాగా జరగాలంటే శుభ్రత, భద్రత ఉండాలి" అని చెప్పారు.

అమరావతి గురించి ఎవరూ భయపడక్కర్లేదు

అమరావతి భవిష్య నగరమని, ఎవరూ కూడా భయపడాల్సిన, బాధపడాల్సిన అవసరం లేదని చంద్రబాబు అన్నారు. అమరావతిపై వైసీపీ అధ్యక్షుడు జగన్ వ్యాఖ్యల నేపథ్యంలో పరోక్షంగా చంద్రబాబు స్పందించారు. అమరావతి, గుంటూరు, విజయవాడ, మంగళగిరి నాలుగు నగరాలు కలిసి ఫ్యూచర్‌సిటీగా మారుతుందన్నారు ప్రపంచస్థాయిలో రోడ్లు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వపాలనా భవనాలన్నింటినీ నిర్మిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో అద్భుతంగా ఉంటుందన్నారు.

టీటీడీ దూకుడుకు బ్రేక్

» జంగాకు కొండపై భూమి ఇవ్వబోం
» క్యాబినెట్‌లో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్న టీటీడీ పాలక మండలికి ప్రభుత్వం చెక్ పెట్టింది. పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తికి తిరుమలలో వసతి గృహ నిర్మాణానికి స్థలం కేటాయించాలన్న బోర్డు తీర్మానాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. ఈ భూ కేటాయింపులపై ముందుకు వెళ్లబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై బుధవారం ఆంధ్రజ్యోతి 'ఏడు కొండలపై ఏమిటిది' శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే అధికార యంత్రాంగం రంగంలోకి దిగి దాని వెనుక ఉన్న వ్యవహారాలపై సీఎంకు నివేదించింది. గురువారం క్యాబినెట్ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ అంశాన్ని లేవనెత్తారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ప్రస్తావించారు. "రూల్ అందరికీ ఒకేలా ఉండాలి. టీటీడీలో బోర్డు మెంబర్‌కు ఒకలా.. బయటి వ్యక్తులకు మరోలా ఉండకూడదు. టీటీడీ అనేది ధర్మాన్ని కాపాడే సంస్థ. అది ధర్మం ప్రకారమే పని చేయాలి. ధర్మాన్ని పరిరక్షించాలి. టీటీడీలో ప్రతి ఒక్కరూ చట్టబద్ధంగా పని చేయాలి" అని పవన్ అన్నారు. వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు.. "అవును అది ధర్మాన్ని కాపాడే సంస్థ. వ్యక్తిగత ఇష్టాఇష్టాలకు తావు ఉండకూడదు. ప్రతిదీ ధర్మబద్ధంగానే ఉండాలి. వివరాల పూర్తిగా తెప్పించుకుని పరిశీలిస్తాను. జంగాకు స్థలం ఇవ్వడం లేదు. పెద్ద పెద్ద వాళ్లే కొండ మీద స్థలం కావలని అడగరు. మనం కొన్ని పద్ధతులు పెట్టుకున్నాం. వాటిని అతిక్రమిస్తామంటే సహించలేది లేదు. ఎట్టి పరిస్థితుల్లో స్థలం ఇవ్వం" అని స్పష్టం చేశారు. రెండు సార్లు కాదన్నది.. మళ్లీ ఇప్పుడు టీటీడీ పాలక మండలి సమావేశం ముందుకు ఎలా వచ్చిందన్నది సర్వత్రా చర్చకు దారి తీసింది. దీని వెనుక భారీ డీల్ ఉందని టీటీడీ, అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఊరూపేరూ లేని ఒక ట్రస్ట్‌కు కొండ మీద స్థలం ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం. ఈ ట్రస్ట్‌ను కేవలం తిరుమలలో స్థలం పొందేందుకు ఏర్పాటు చేశారని, జంగా మధ్యవర్తిగా తనదేనని క్లైమ్ చేస్తున్నారని, వాస్తవానికి ఈ ట్రస్ట్ రియల్ ఎస్టేట్ వ్యాపారికి చెందినదని విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

నివేదిక కోరిన సీఎంవో...

టీటీడీ బోర్డు జంగాకు భూ కేటాయింపు చేయడం వెనుక ఎవరెవరు ఉన్నారన్న దానిపై సీఎంవో ఆరా తీసింది. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో దీనిపై కథనం ప్రచురితం కావడంతో సీఎం కార్యాలయం రంగంలోకి దిగింది. సీఎం ఆదేశాల మేరకు పూర్తి వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని దేవదాయ శాఖ, టీటీడీని ఆదేశించారు. మరోవైపు ఈ స్థలం కేటాయింపు వ్యవహారాన్ని బోర్డులో వ్యతిరేకించిన బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డితో కూడా అధికారులు మాట్లాడారు.

ఏపీ సంస్కృతీ సంప్రదాయాలు భేష్

» ఆర్థిక వృద్ధి, పెట్టుబడుల్లో దేశంలోనే అగ్రగామిగా ఏపీ
» 'యూరోపియన్' రాయబారి హెర్వే డెల్ఫీ

విజయవాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంస్కృతీ సంప్రదాయాల గొప్పదనానికి ఆంధ్రప్రదేశ్ నిదర్శనమని యూరోపియన్ యూనియన్ రాయబారి హెర్వే డెల్ఫీ అన్నారు. అవకాయ్-అమరావతి ఫెస్టివల్‌లో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న డెల్ఫీ మాట్లాడుతూ కూచిపూడి, కలంకారి, కొండపల్లి బొమ్మలు ప్రపంచాన్ని ఎప్పుడో ఆకర్షించాయని చెప్పారు.



సీఎం చంద్రబాబుతో 'యూరోపియన్' రాయబారి హెర్వే డెల్ఫీ

సీఎంను కలిసిన దౌత్యవేత్త

అమరావతి: హెర్వే డెల్ఫిన్ సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం రాత్రి ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో యూరోపియన్ యూనియన్‌తో ఏపీ సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపైన ఇరువురూ చర్చించారు.

ప్రపంచ సృజనాత్మక రాజధానిగా ఏపీ

» ఆవకాయ్ ఫెస్టివల్‌లో మంత్రి దుర్గేష్



విజయవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ప్రతి నదికీ ఒక కథ, ప్రతి కళకూ ఒక ఆత్మ ఉందని.. ఏపీని ప్రపంచ సాంస్కృతిక రాజధానిగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపు నిచ్చారు. పవిత్ర కృష్ణా నది తీరాన నిర్వహిస్తున్న 'ఆవకాయ్ అమరావతి ఫెస్టివల్' ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవానికి కళా, సాహిత్య, సినిమా, పర్యాటక రంగానికి కొత్త ఊపిరి పోస్తుందని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రం పర్యాటకాభివృద్ధితో ఆరెంజ్ రివల్యూషన్‌గా మారుతోందన్నారు. గురువారం విజయవాడలో జరిగిన ఆవకాయ్ అమరావతి ఉత్సవాల ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, కనుమరుగవుతున్న కళలు, సాహిత్యం, సినిమా, జానపద సంప్రదాయాలకు పునరుజ్జీవం కల్పించడమే ఈ ఫెస్టివల్ ప్రధాన ఉద్దేశమన్నారు. తెలుగు వారి ప్రతి ఇంటికీ 'ఆవకాయ్'తో విడదీయలేని బంధం ఎలా ఉందో.. ఈ ఉత్సవం కూడా సినిమా, సాహిత్యం, సంగీతం, నాటకం, కళా ప్రదర్శన సమ్మేళనంగా అంతటి ఆత్మీయతను పంచుతుందని వివరించారు. కథలు, సినిమాలు, డిజిటల్ కళలే పెట్టుబడిగా ఉపాధిని సృష్టించడాన్ని ఆయన 'ఆరెంజ్ రెవల్యూషన్'గా అభివర్ణించారు. భారతదేశానికే ఏపీ కోహినూర్ వజ్రం లాంటిదన్నారు.

కృష్ణానదిలో ఫ్లోటెడ్ హౌస్ బోట్స్

» ఈయూ రాయబారితో కలిసి రెండు బోట్లు ప్రారంభించిన సీఎం
» ఫ్యామిలీ డిన్నర్ కోసం.. మూన్‌లైట్ పంటు పరిశీలన



విజయవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో పర్యాటకులు సకుటుంబ సమేతంగా విహరించటానికి వీలుగా ఫ్యామిలీ ఫ్లోటెడ్ హౌస్ బోట్లను యూరోపియన్ యూనియన్ రాయబారి హెర్వే డెల్ఫిన్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. పీపీపీ విధానంలో ఫ్లోటెడ్ హౌస్‌బోట్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో, సింపుల్ ఇండియా సంస్థ.. కేరళ తరహా రెండు విభిన్న హౌస్‌బోట్లను రూపొందించింది. కృష్ణానదిలో ఇటీవల ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ రెండింటితో పాటు, కృష్ణానదిలో మూన్‌లైట్ డిన్నర్‌కు వీలుగా రూపొందించిన పంటును కూడా ప్రారంభించారు. ఈయూ రాయబారితో కలిసి హౌస్‌బోట్లను, అందులోని సౌకర్యాలను సీఎం పరిశీలించారు. మూన్‌లైట్ డిన్నర్ పంటులో కూర్చుని ఈయూ రాయబారితో దీని విశేషాలను పంచుకున్నారు.



కోనసీమ జిల్లా ఇరుసుమండలో బ్లోఔట్ వద్ద మంటలపైకి హైప్రెషర్ పంపులతో నీటిని వెదజల్లుతున్న దృశ్యం

నాలుగో రోజూ ఆరని మంటలు..!

» బ్లోఔట్ నియంత్రణకు శ్రమిస్తున్న ఓఎన్జీసీ సిబ్బంది

అమలాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో సంభవించిన బ్లోఔట్ మంటలను అదుపు చేసేందుకు ఓఎన్జీసీ సిబ్బంది నాలుగు రోజులుగా తీవ్రంగా శ్రమిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీకి చెందిన మోరీ-5 బావిలో డీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ డ్రిల్లింగ్ నిర్వహిస్తున్న సమయంలో బ్లోఔట్ సంభవించిన సంగతి తెలిసిందే. దీనివల్ల ఎగసిపడుతున్న మంటలను అదుపు చేసే పనులకు ఓఎన్జీసీ సిబ్బంది గురువారం శ్రీకారం చుట్టారు. బ్లో ఔట్ సైట్ వద్ద కుప్పకూలిపోయిన డీప్ ఇండస్ట్రీస్ రిగ్గు శకలాలను భారీ క్రేన్ల సాయంతో తొలగిస్తున్నారు. ఎగిసిపడుతున్న గ్యాస్ మంటలను అదుపు చేసేందుకు నిరంతరం వాటర్ అంబ్రెల్లాలతో నీటిని వెదజల్లుతున్నారు. దీంతో మంటల ఎత్తు క్రమంగా తగ్గుతోంది. ఓఎన్జీసీకి చెందిన శ్రీహరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సక్సేనా ఆధ్వర్యంలో నిపుణులు వెల్ మౌత్ వద్ద పరిస్థితిని సమీక్షించారు. బావికి మూత వేసేందుకు అవసరమైన సాంకేతిక సామగ్రిని రిగ్గు సైటు వద్దకు తరలిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లోనే మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తెస్తారని అధికారులు భావిస్తున్నారు.

రాజ్ కసిరెడ్డిపై ఈడీ నజర్

» కోల్‌కతా ఐప్యాక్ ఆఫీసులో లభించిన కీలక ఆధారాలు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో ఐప్యాక్ సంస్థ కార్యాలయాల్లో దాడులు నిర్వహిస్తోన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ).. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి సహకరించిన రాజ్ కసిరెడ్డిపై దృష్టి సారించింది. ఐప్యాక్ సంస్థ గతంలో రాష్ట్రంలో జగన్‌కు సహకారం అందించింది. ఈ సంస్థ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో తృణముల్ కాంగ్రెస్‌కు ఎన్నికల వ్యూహాలపై సహకారాన్ని అందిస్తోంది. కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయాలపై గురువారం ఈడీ దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లోనే.. గతంలో రాష్ట్రంలో వైసీపీకి ఎన్నికల వ్యూహాలపై సహకారం అందించిన సమయంలో జరిగిన ఆర్థిక లావాదేవీల గుట్టు బయటపడిందని రాజకీయవర్గాల్లో ప్రచారం సాగుతోంది. జగన్‌కు అత్యంత సన్నిహితుడైన రాజ్ కసిరెడ్డికి చెందిన పలు కీలక డాక్యుమెంట్లు కూడా కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయంలో ఈడీకి లభించినట్టు పేర్కొంటున్నారు. రాజ్ కసిరెడ్డి ఆర్థిక లావాదేవీల అంశంపై ఈడీ సమగ్రంగా దర్యాప్తునకు సిద్ధమవుతున్నట్టు చెబుతున్నారు.

టిడ్కో ఇళ్ల హడ్కో రుణాలకు ప్రభుత్వ గ్యారెంటీ

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఏపీ టిడ్కో ఇళ్లకు సంబంధించి హడ్కో ఇస్తున్న రూ.4,451 కోట్ల రుణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. టిడ్కో ఇళ్లను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ రుణం తీసుకుంది. అసలుతో పాటు వడ్డీకి కూడా గ్యారెంటీ ఉంటుంది.

ఎస్సీ కార్పొరేషన్ వాహనాల స్థితిపై కమిటీ

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ జాతీయ సఫాయి కర్మచారి కార్పొరేషన్ నిధుల నుంచి 2018-19లో కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, పవర్ ఆటోల స్థితిని పరిశీలించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అప్పట్లో 42 హెచ్‌పీ ట్రాక్టర్లను డ్రైన్ల క్లీనింగ్ కోసం కొనుగోలు చేసి జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ల ఈడీలకు అప్పగించారు. వాటిని సరఫరా చేసేందుకు ఎన్నికల కమిషన్ అభ్యంతరం తెలపడంతో పలు వాహనాలను పంపిణీ చేయక అవి తుప్పుపట్టిపోయాయి. వాటిని ఏం చేయాలనే దానిపై పరిశీలించేందుకు ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్, ఎస్సీ గురుకులం సొసైటీ అడిషనల్ సెక్రటరీ సునీల్‌రాజ్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మి, ఆయా ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు, ఆయా జిల్లాల రవాణా శాఖ ప్రతినిధులను సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేస్తూ ఆదేశాలిచ్చారు.

రాష్ట్ర పండుగగా కోనసీమ ప్రభల తీర్థం: మంత్రి దుర్గేశ్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంతంలో విశిష్ట సంప్రదాయంగా జరిగే జగ్గన్న తోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. గురువారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మకత సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వితో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. 470 ఏళ్ల చరిత్ర కలిగిన కోనసీమ ప్రభల తీర్థం తెలుగు సంప్రదాయాలు, సంస్కృతికి అద్దం పడుతుంది. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన కోనసీమలో ఈ ఉత్సవాన్ని సంక్రాంతి వేళ కనుమ రోజున నిర్వహించడం ఆనవాయితీ. 11 పురాతన శైవ క్షేత్రాల కలయికతో అత్యంత వైభవంగా జరిగే ఈ తీర్థానికి పెద్ద సంఖ్యలో ప్రభలు, ఉప ప్రభలు వస్తాయి. కౌశికా నదిలో ప్రభల ఊరేగింపును తిలకించడానికి 5-6 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. ప్రధాని మోదీ ప్రశంసలు, కేంద్ర పర్యాటక శాఖ గుర్తింపు పొందిన ఈ ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ సీఎం చంద్రబాబు, మంత్రిమండలి నిర్ణయం తీసుకోవడం చాలా గర్వకారణం. భవిష్యత్ తరాలకు వారసత్వాన్ని అందించేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయి' అని మంత్రి పేర్కొన్నారు. సృజనాత్మకత సమితి చైర్‌పర్సన్ తేజస్వీ మాట్లాడుతూ... ఏకాదశ రుద్రులు కొలువయ్యే ప్రభల తీర్థం చరిత్రను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ ఉత్సవాన్ని అద్భుతంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

పేద బ్రాహ్మణులకు త్వరలో 'గరుడ': మంత్రి సవిత

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద బ్రాహ్మణ కుటుంబాలకు భరోసా ఇచ్చే 'గరుడ' పథకాన్ని త్వరలో అమల్లోకి తీసుకురాబోతున్నట్లు మంత్రి ఎస్.సవిత తెలిపారు. సచివాలయంలో గురువారం ఈ పథకం విధి విధానాలపై బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్‌తో మంత్రి చర్చించారు. అనంతరం సవిత మాట్లాడుతూ... 'పేద బ్రాహ్మణులు మరణిస్తే అంత్యక్రియలకు ఆయా కుటుంబాలకు రూ.10 వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది. సీఎం చంద్రబాబు బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారు' అని మంత్రి తెలిపారు.

ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధిగా కోమటి జయరామ్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రవాసాంధ్రుడు కోమటి జయరామ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నార్త్ అమెరికా ప్రత్యేక ప్రతినిధి (స్పెషల్ రిప్రజెంటేటివ్)గా నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టులో ఆయన రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. అన్ని రకాల అలవెన్సుల కింద రూ.1,93,500 కేటాయించింది.

కొండగట్టుకు 35.19 కోట్లు

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.35.19 కోట్ల నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గురువారం దేవదాయ శాఖ ఎక్స్‌అఫీషియో సెక్రటరీ డా.ఎం. హరిజవహర్‌లాల్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో దీక్ష విరమణ మండపం, 96 గదులతో కూడిన చౌల్ట్రీ నిర్మాణానికి ఈ నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. నిధులను ప్రత్యేకంగా కేటాయిస్తున్నామని, నిబంధనల ప్రకారం టెండర్లు ఆహ్వానించి నిర్మాణ పనులు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిధుల కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ టీటీడీ ఈవోను ప్రత్యేకంగా కోరినట్టు వెల్లడించారు.

జల్‌జీవన్ మిషన్‌కు 5 వేల కోట్ల రుణం

ప్రభుత్వ గ్యారెంటీకి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం.. పలు పరిశ్రమలకు భూకేటాయింపులు

» టెక్కలిలో కొత్త డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఆమోదం

» డాక్టర్ సుధాకర్ కుమారుడికి డిప్యూటీ తహశీల్దార్ పోస్టు

» పిచ్చుకలపాలెంలో జ్యుడీషియల్ అకాడమీ

» క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి



అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ అమలు కోసం జల్‌జీవన్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్‌కు నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (నాబ్‌ఫిడ్) మంజూరుచేసిన రూ.5 వేల కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ ఇవ్వడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కార్పొరేషన్ వనరుల సమీకరణ పరిమితిని రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్లకు పెంచడానికి అనుమతించింది. పలు పరిశ్రమలకు భూమి కేటాయింపు, ప్రోత్సాహకాలు అందిస్తూ నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచార-పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం సచివాలయంలో క్యాబినెట్ సమావేశం తీసుకున్న నిర్ణయాలను అనంతరం ఆయన విలేకరులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను సమగ్ర లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్ కంపెనీగా ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపిందన్నారు. లాజిస్టిక్స్, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కోసం సంస్థాగత మూలధనాన్ని సమీకరించేందుకు తగిన పరిమాణంలో ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ ఫండ్‌ను ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధిగా ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. ఈ నిధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభ స్పాన్సర్‌గా మొత్తం మూలధనంలో 10-20 శాతం వాటా అందించనుంది. ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ను ఏఎంఎన్‌ఎస్ పోర్ట్స్ రాజయ్యపేట ప్రైవేట్ లిమిటెడ్ అనే స్పెషల్ పర్పస్ వెహికల్‌గా మార్చడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనకాపల్లి జిల్లా డీఎల్‌పురంలో క్యాప్టివ్ ఓడరేవును కొత్తగా ఏర్పాటు చేసిన ఎస్పీవీకి కేటాయించేందుకు సవరించిన ఉత్తర్వుల జారీకి అనుమతిచ్చింది. ఎంఎస్ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్ ప్రతిపాదించిన ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఏపీ-సీడీపీ)పథకానికి ఆమోదం తెలిపింది. రూ.200 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకం రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో కనీసం 45 ఎంఎస్‌ఎంఈ కామన్ ఫెసిలిటీ సెంటర్లను ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన జిల్లాలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలు నడిపే పరిశ్రమలకు పెద్దపీట వేస్తారని మంత్రి తెలిపారు. ఈ నెల 6న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

మరిన్ని నిర్ణయాలివీ..

- తిరుపతి జిల్లాలో స్పేస్ సిటీలో ఇథేరియల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్‌కు ఎకరా రూ.5 లక్షల చొప్పున 149.29 ఎకరాల భూమి.
- చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం మనేంద్రంలో పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 55.47 ఎకరాల భూమి.
- విజయనగరం జిల్లా రాంభద్రాపురం మండలం కొత్తాకి గ్రామంలో రాధికా వెజిటబుల్ ఆయిల్స్‌కు 64.67 ఎకరాల కేటాయింపు.
- కడప జిల్లాలో ఎలక్ట్రికల్ స్టీల్ (కోల్డ్ రోల్డ్ గ్రెయిన్ ఓరియెంటెడ్-సీఆర్‌జీఓ), ప్యాకేజ్ సబ్‌స్టేషన్లు, రింగ్ మెయిన్ యూనిట్లు(ఆర్ఎంయూ), ప్యానెల్‌బోర్డులు, విండ్‌మాస్ట్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ కాంపోనెంట్స్ అండ్ యాక్సెసరీస్ తయారీకి గ్రీన్‌ఫీల్డ్ సౌకర్యం కల్పనకు షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ పెట్టుబడి ప్రతిపాదనకు ఆమోదం.. భూమి కేటాయింపు.. ఏపీ-ఐడీపీ 2024-29 కింద ప్రత్యేక ప్రోత్సాహకాలు.
- రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్ పెట్టుబడి ప్రతిపాదనకు ఆమోదం.
- నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలో రూ.1,500 కోట్లతో క్లింకర్, సిమెంట్ అండ్ వేస్ట్ హీట్ రికవరీ పవర్‌ప్లాంట్ విస్తరణకు ప్రత్యేక ప్రోత్సహకాలు. వెబ్‌సోల్ రెన్యువల్ పెట్టుబడి ప్రతిపాదనకు అనుమతి.
- తిరుపతిలోని ఎంపీసెజ్ నాయుడుపేటలో 4 గిగావాట్స్ సోలార్ మాడ్యూల్స్ తయారీ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడానికి ఏపీ-ఐడీపీ(4.0) 2024-29 కింద ప్రత్యేక ప్రోత్సాహకాలు.
- తిరుపతి జిల్లాలో రూ.200.82 కోట్ల పెట్టుబడితో సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏకీకృత పాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రోత్సాహకాలకు అనుమతి.
- శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం కొత్తబొమ్మాళిలో 2026-27 నుంచి కొత్త ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు.
- 2024-25 విద్యా సంవత్సరానికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌ల సేకరణ, సరఫరాకు రూ.944.53 కోట్ల పరిపాలనా ఆమోదానికి ఆమోదం.
- ఏపీ షెడ్యూల్ కులాల సహకార ఆర్థిక సంస్థకు రాష్ట్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ నుంచి రూ.1,500 కోట్ల రుణం మంజూరుకు సమ్మతి.
- వైసీపీ వేధింపులతో మరణించిన డాక్టర్ సుధాకర్ కుమారుడు, సహకార శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.లలిత్ ప్రసాద్‌ను మానవతా కారణాలతో ప్రత్యేక కేసుగా పరిగణించి డిప్యూటీ తహశీల్దార్‌గా నియమించడానికి ఆమోదం.
- రాజధాని పరిధిలోని పిచ్చుకలపాలెంలో ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణం, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, మౌలిక సదుపాయాల కల్పన, అంతర్గత రోడ్లకు రూ.165.33 కోట్లకు ఆమోదం.
- బాపట్ల జిల్లా సూర్యలంకలో ఫైవ్‌స్టార్ కోస్టర్ రిసార్ట్ స్థాపన కోసం ఆర్నా కోస్టల్ రిసార్ట్స్‌కు భూమి, ప్రోత్సాహకాలు.
- శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో శ్రీగణగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం దిగువన మెగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక కేంద్రం బేస్ క్యాంప్ అభివృద్ధికి బెంగళూరు ఇస్కాన్‌కు భూమి, ప్రోత్సాహకాలు.
- జలవనరుల శాఖలో నామినేషన్ పద్ధతిలో అప్పగించే పనుల పరిమితిని రూ.5 లక్షల నుంచి 10లక్షలకు పెంచడానికి ఆమోదం.

- పెట్టుబడులను సాధించడంతోపాటు ప్రాజెక్టులు వీలైనంత త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలి. దీనికి మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులతో సమన్వయంతో వ్యవహరించాలి.

- సీఎం చంద్రబాబు

యూనిట్ రూ.4కే!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర సచివాలయంలో మంత్రిమండలి సమావేశంలో వైసీపీ హయాంలో 2019-24 నాటి ట్రూఅప్ చార్జీల భారం రూ.4,498 కోట్లను ప్రభుత్వమే భరించాలన్న నిర్ణయానికి ఆమోదం తెలిపే సమయంలో సీఎం పై వ్యాఖ్యలు చేశారు. చార్జీలు తగ్గించాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు విద్యుదుత్పత్తిని పెంచుకోవడంతోపాటు సరఫరాలో నష్టాలు తగ్గించుకునే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై జగన్ చేసిన తప్పిదాలను కూటమి ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం జరుగుతోందన్నారు. 2020లో ఆయన హయాంలోనే ఆ స్కీం ఆగిపోతే.. అప్పుడు కళ్లు మూసుకుని ఇప్పుడు ఆ నిందను మనపై వేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇలాంటివన్నీ వారికి అలవాటుగా మారాయని.. దీనిని గట్టిగా తిప్పికొట్టాలని మంత్రులకు సూచించారు. తిరుమలలో లిక్కర్ బాటిళ్లను పెట్టి రాద్ధాంతం చేసిన అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఇలాంటివి చేయడంలో వైసీపీ వారు సిద్ధహస్తులని.. మనం అప్రమత్తంగా లేకపోతే నష్టపోతామని వ్యాఖ్యానించారు. ఇంకా ఏం చెప్పారంటే..

అందరం లబ్ధిపొందుతాం..

సముద్రంలో కలిసే నదీ జలాలు రెండు తెలుగు రాష్ట్రాలు ఉపయోగించుకుంటే తెలుగు ప్రజలందరూ లబ్ధి పొందుతారు. పోలవరం-నల్లమల సాగర్ పూర్తయితే సమృద్ధిగా నీరు, విద్యుత్ లభిస్తాయి. నీటి లభ్యత ఉంటే సాగు విస్తీర్ణం పెరుగుతుందని, రైతులు కొత్త రకాల పంటలు వేసుకోవచ్చు.

270 పీపీపీ ప్రాజెక్టులు..

పీపీపీ విధానం అమల్లో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. కూటమి ప్రభుత్వం 270 ప్రాజెక్టులను ఈ విధానంలో అమలు చేస్తోంది. మన తర్వాతి స్థానాల్లో తమిళనాడు, మధ్యప్రదేశ్ ఉన్నాయి. పెట్టుబడుల సాధనలో ఏపీ ముందంజలో ఉందని.. దేశంలో నాలుగో వంతు పెట్టుబడులను ఆకర్షిస్తోందని ఫోర్బ్స్ పత్రిక ప్రచురించింది. ప్రతి నెలా జీఎస్డీపీ గణాంకాలను సేకరిస్తున్న రాష్ట్రం దేశంలో ఏపీ ఒక్కటే.

లాజిస్టిక్ రంగంపై మరింత దృష్టి..

ప్రపంచంలో ఏ అభివృద్ధి చెందిన దేశాన్ని చూసినా అక్కడ లాజిస్టిక్ రంగం ముందంజలో ఉంటుంది. ఏపీని కూడా ఈ రంగంలో నంబర్ వన్ స్థానంలో నిలపాలి. అత్యంత చౌకయిన జలరవాణా సౌకర్యాలను మెరుగుపరచుకునే దిశగా కార్యాచరణ రూపొందించాలి. జలరవాణా మెరుగుపడితే అభివృద్ధిపథంలో ముందుంటాం. ఇందుకు అనుగుణంగా ప్రతి తీర ప్రాంత జిల్లాలో ఓ పోర్టు ఏర్పాటు కావాలి.

- ధాన్యం సేకరణ రికార్డు స్థాయిలో చేశాం. అన్ని రకాల పంటలు కొనుగోలు చేస్తున్నాం. రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలి.
- పర్యాటక రంగం గేమ్ చేంజర్. ఈ రంగంలో అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలి. చీరాలను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. సూర్యలంకలో మరో మూడు హోటళ్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది.

జగన్‌లా ప్రజలను భయపెట్టడం టీడీపీ సంస్కృతి కాదు: లోకేశ్

మంత్రివర్గ సమావేశానికి ముందు ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో టీడీపీ మంత్రులతో మంత్రి లోకేశ్ అల్పాహార భేటీ నిర్వహించారు. పలు అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. వైసీపీలా రప్పా, రప్పా.. మన విధానం కాదన్నారు. జగన్‌లా ప్రజలను భయపెట్టడం, బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడడం వంటివి తెలుగుదేశం సంస్కృతి కాదని స్పష్టంచేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూర్చామో ప్రతి ఒక్కరూ బేరీజు వేసుకోవాలన్నారు. ప్రజావేదికలో వచ్చే ఫిర్యాదులు పరిష్కారమయ్యేలా మంత్రులు బాధ్యత తీసుకోవాలని కోరారు. తమ తమ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి వారు చొరవ చూపాలన్నారు. పార్టీ మరింత బలోపేతమే లక్ష్యంగా క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఇన్‌చార్జి మంత్రులు పనిచేయాలని కోరారు.

సొమ్ము ఒకరిది.. సోకు ఆయనది!

» ఆ ఎమ్మెల్యే పుట్టినరోజు వరంగా ఉద్యోగులు, కాంట్రాక్టర్ల జేబులకు చిల్లు

» వేడుకల ఖర్చుకు బలవంతంగా లక్షల్లో వసూళ్లు

» వేలాది మందికి 'గొప్ప' విందుతో సంబరాలు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజు అంటే సొంత డబ్బు ఖర్చు పెట్టి.. స్థాయికి తగినట్లుగా చేసుకుంటారు. అదే డబ్బున్న వారయితే విందులు, వినోదాలతో కొంత హడావుడి చేస్తారు. అయితే.. ఈ విషయంలో ఏలూరు జిల్లాకు చెందిన ఆ ఎమ్మెల్యే తీరు మాత్రం 'సొమ్ము ఒకరికి.. సోకు ఒకరిది' అన్నట్లుగా ఉంది! తన నియోజకవర్గంలో పనిచేస్తున్న వివిధ శాఖలు ఉద్యోగులు, కాంట్రాక్టర్లతో పాటు చోటా నాయకుల నుంచి బలవంతంగా లక్షల రూపాయలు వసూలు చేసి.. గురువారం తన పుట్టినరోజు సందర్భంగా వేలాది మందికి 'గొప్పగా' భోజనాలు పెట్టించారు!! డబ్బులు ఇవ్వకుంటే 'బదిలీ' వేటేనని బెదిరించడంతో గత్యంతరం లేని ఉద్యోగులు 'విరాళాలు' సమర్పించుకున్నారు. దీంతో ఈ విధంగా డబ్బులు దండుకోవడం ఏంటో.. అని బాధితులు ఆవేదన చెందుతున్నారు. పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఆశ పడటంలో తప్పు లేదు! కానీ, అందుకు వసూలు డబ్బుతో సంబరాలు నిర్వహించడమే చర్చనీయాంశంగా మారింది. గతేడాది కూడా ఆయన ఇదేవిధంగా తన పుట్టినరోజుకు ఉద్యోగులకు టార్గెట్లు విధించి, డబ్బులు వసూలు చేశారు. ఈ విషయం ఆ పార్టీ అధిష్టానం దృష్టికి కూడా వెళ్లింది. ఇద్దరు సీనియర్ నేతల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలో సదరు ప్రజాప్రతినిధి వసూళ్లపై మాట్లాడిన మాటల ఆడియో బయటకు రావడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

ఇంటికి పిలిపించి.. డబ్బులు డిమాండ్

బర్త్‌డే సంబరాలకు తన జేబు నుంచి ఖర్చు పెట్టకుండా.. ఆ భారం ఇతరులపై మోపడంపై పెద్దఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. గురువారం నాటి వేడుకలను ఘనంగా నిర్వహించాలని వారం రోజులుగా ప్రణాళికలు వేశారు. అందుకు తగ్గట్లే 30 వేల మందికి తగ్గకుండా జనాల్ని రప్పించి భోజనాలు పెట్టారు. క్రీడా, ముగ్గుల పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందుకు లక్షల్లోనే ఖర్చు అయ్యింది. ఈ మొత్తాన్ని ఆ నేత తన జేబులో నుంచి పెట్టుకోకుండా... మండలస్థాయి అధికారుల నుంచి చిరుద్యోగుల వరకు తేడా లేకుండా వసూలు చేశారు. ముందుగానే ఆ ప్రజాప్రతినిధి పలు శాఖల అధికారులను ఇంటికి రప్పించి.. భోజనాల ఖర్చులకు కొంత నగదు ఇవ్వాలని హుకుం జారీచేశారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం నుంచి ఐదు నుంచి ఎనిమిది వేల మందిని మహిళలను పంపాలని ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ, డ్వాక్రా సీఏ, సీసీలు, ఉపాధి హామీ తదితర శాఖల నుంచి లక్ష నుంచి రెండు లక్షల చొప్పున వసూలు చేశారు. కాంట్రాక్టర్లు, చోటా నాయకుల జేబులు సైతం ఖాళీ కావడంతో తమకు సంక్రాంతి పండుగ ముందే కనిపించిందని వారు వాపోయారు.

భవిష్యత్‌లో ఎలా పనిచేస్తారో చూస్తా?

తన మాట పెడచెవిన పెట్టిన వారిని దృష్టిలో పెట్టుకుంటానని, భవిష్యత్‌లో విధులు ఎలా నిర్వహిస్తారో చూస్తామని ఆ ఎమ్మెల్యే ఉద్యోగులకు హెచ్చరికలు చేశారు. దీంతో కొందరు గత్యంతరం లేక భారీగానే తాంబూలం సమర్పించుకున్నారు. మరోవైపు పెట్టిన టార్గెట్‌ను అందుకోలేని వారిపై బదిలీ వేటు తప్పదని ఆయన అనుచర గణం బెదిరించింది. ఓ రెవెన్యూ అధికారి వద్ద ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో వచ్చే కమీషన్ దక్కాలంటే ముందుగా రూ.3 లక్షలు ఇవ్వాలని చెప్పి, అనుచరుల ద్వారా నగదు వసూలు చేశారనే ఆరోపణలు వచ్చాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.